
ఒంగోలులోని జిల్లా సహకారాధికారి కార్యాలయం

సహకారం లేదిక్కడ!

సిబ్బందికి రెండు నెలలుగా నిలిచిపోయిన జీతాలు

కలెక్టర్ నియమించిన ఇన్‌చార్జి డీసీవోను గుర్తించని ఆ శాఖ కమిషనర్

ప్రభుత్వం మారినా మారని తీరు

- తనను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించమని కోరుతున్న ఇందిరాదేవి
- ఆ శాఖలో అంతా గందరగోళం
- డీసీసీబీ వ్యవహారంలోనూ ఉన్నతాధికారుల విచిత్ర వైఖరి

ఒంగోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా జిల్లా పాలన వ్యవహారాలలో అంతిమ నిర్ణయం కలెక్టర్లదే. ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులపై పర్యవేక్షణ వారి పరిధిలోనే ఉంటుంది. ఆశించిన మేర పనితీరు లేని వారిని ప్రభుత్వానికి సరెండర్ చేసి మరొకరికి ఆ బాధ్యతలను అప్పగించే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. అలాంటి సందర్భంలో కలెక్టర్ సిఫార్సును గౌరవించి సదరు అధికారికి రాష్ట్రశాఖ కార్యాలయం తరఫున అవసరమైన గుర్తింపు ఇచ్చి పనిచేసేలా ఉన్నత స్థాయి అధికారులు వ్యవహరిస్తారు. అయితే జిల్లా సహకార శాఖ విషయంలో జరిగిన వ్యవహారం అందుకు భిన్నంగా ఉంది. గతంలో ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాస రెడ్డి పనితీరు పట్ల జిల్లాకు చెందిన పలువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర ఉన్నత స్థాయి పెద్దలకు ఫిర్యాదులు చేశారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రధానంగా అందులో

మిగతా 6వ పేజీలో

జిల్లా సహకార శాఖలో సంక్షోభం నెలకొంది. గతంలో డీసీవోగా పనిచేసిన అధికారి అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేయించి అతనిని కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అనంతరం మొత్తం జిల్లాలోని సహకార రంగ సంస్థలను పర్యవేక్షించే అధికారి (డీసీవో)గా కలెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన అధికారిణిని ఆ శాఖ కమిషనర్ అసలు గుర్తించ లేదు. దీంతో ఆర్థిక వ్యవహారాలు చూసే అవకాశం సదరు అధికారిణికి లేకుండా పోయింది. ఫలితంగా జిల్లా సహకార శాఖ కార్యాలయ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. వచ్చే నెలలో కూడా వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

గతంలోనూ ఇదే వైఖరి

గతంలో పీడీసీసీ బ్యాంకుపై విచారణ సమయంలోనూ రాష్ట్ర సహకారశాఖ అధికారులు ఇలాగే వ్యవహరించారు. అప్పట్లో కలెక్టర్ సిఫార్సులకు అనుగుణంగా బ్యాంకు సీఈవోను బదిలీ చేయడం, విచారణాధికారుల నియామకం, ఇతర చర్యల్లోనూ మీనమేషాలు లెక్కించారు. చివరకు సీఎం జోక్యం చేసుకుంటే కాని కదల్లేదు.



తొలగింపు.. తరలింపు ఇలా..



భారీ వృక్షం.. పునరుజ్జీవం..

ఒంగోలు నగరంలోని దక్షిణం బజారు వాసులు పర్యావరణంపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. తమ ప్రాంతంలోని సుమారు యాభై ఏళ్ల నాటి భారీ వృక్షాన్ని వేర్లతో సహా తొలగించి వల్లూరు వద్ద ఉన్న రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కాలేజీకి తరలించి అక్కడ నాటారు. దక్షిణం బజారులోని ఓ ఇంటి ఆవరణలో ఈ వృక్షం ఉంది. నూతనంగా ఇల్లు నిర్మించుకునే క్రమంలో దానిని కొట్టి వేయకుండా భవిష్యత్‌తరాలకు ఉపయోగపడాలని ఆలోచన చేశారు. ఆ వృక్షాన్ని వ్యయప్రయాసల కోర్చి వేర్లతో సహా మరోచోట నాటి పునరుజ్జీవానికి పాటుపడ్డారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

మరోచోట మళ్లీ జీవం కోసం..




ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష


ఒంగోలులోని డీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

- 90శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేయగా మొదటి రోజు ఐదు సెంటర్‌లలోనే పరీక్షలు జరిగాయి. రెండు సెషన్లలో వీటిని నిర్వహించారు. మొత్తం 791 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 710 (90శాతం) మంది హాజరయ్యారు. 81మంది గైర్హాజరయ్యారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదన్న నిబంధన ఉండటంతో అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ప్రధాన ద్వారాల వద్దే హాల్‌టిక్కెట్లను పరిశీలించి ధ్రువీకరించుకున్న తర్వాతే హాలులోకి అధికారులు అనుమతించారు. ఒక్క బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లోనే రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. మిగిలిన నాలుగు కేంద్రాల్లో ఉదయం సెషన్ మాత్రమే జరిగింది. ఒంగోలు క్విస్ పరీక్షా కేంద్రంలో ఉదయం సెషన్‌లో 200 మందికి 179మంది, రైజ్ ప్రకాశంలో 170 మందికి 147 మంది, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో 100 మందికి 96 మంది, శామ్యూల్ జార్జి కళాశాలలో 120 మందికి 106 మంది, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 100 మందికి 89మంది పరీక్ష రాశారు. బ్రిలియంట్‌లో మధ్యాహ్నం సెషన్‌లో 101 మందికి 93 మంది పరీక్షకు హాజరయ్యారు. టీజీటీ గణితం, హిందీ, ఫిజికల్ సైన్స్, తెలుగు పోస్టులకు పరీక్ష నిర్వహించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, పక్కన పామూరు సీఐ భీమా నాయక్, ఎస్సై కిశోర్‌బాబు

బ్యాంకు నగదు గోల్‌మాల్ కేసులో ఇద్దరు అరెస్టు

క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి మోసం చేసిన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్

పామూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : యాక్సిస్ బ్యాంకులో ఖాతాదారుల డిపాజిట్‌లకు సంబంధించిన రూ.2.49 కోట్ల నగదును దుర్వినియోగం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక యాక్సిస్ బ్యాంకులో పనిచేసిన బ్రాంచ్ మేనేజర్ అలవల సుబ్బారావు, అసిస్టెంట్ మేనేజర్ బొందల అనిల్‌సింగ్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. ఈక్రమంలో కొంతమంది ఖాతాదారుల అకౌంట్‌ల నుంచి అక్రమంగా నగదును ఇతరుల ఖాతాలకు పంపారు. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు చేయడానికి వచ్చిన వారి నగదును డిపాజిట్ చేయకుండానే చేసినట్లు నకిలీ బాండ్లు ఇచ్చారు. బ్యాంక్ లోన్‌లను క్లోజ్ చేయడానికి వచ్చిన ఖాతాదారుల నుంచి నగదు తీసుకొని స్లిప్‌లు ఇచ్చి లోన్ అకౌంట్‌లకు కట్టకుండా మోసానికి పాల్పడ్డారు. మొత్తం 2 కోట్ల 48 లక్షల 690 రూపాయల దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రస్తుత మేనేజర్ తిరుపతయ్య బ్యాంకు ఉన్నతాధికారులకు

మిగతా 6వ పేజీలో


మద్దిపాడులోని రైస్ మిల్లులో పట్టుబడిన బియ్యంతో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు

- ఆలస్యంగా కౌన్సెలింగ్ ప్రారంభం
- ఆరు గంటలు నిరీక్షించిన ఉపాధ్యాయులు

ప్రమోషన్ల కోసం పడిగాపులు

ఒంగోలు విద్య, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కోసం పడిగాపులు పరిపాటిగా మారిపోయింది. ప్రమోషన్ల కౌన్సెలింగ్ కోసం శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌కు చేరుకున్న టీచర్లు టెంట్ల కింద ఉక్కపోతతో ఉడికిపోయారు. ఆరు గంటల నిరీక్షణ అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. గతంలో ఉద్యోగోన్నతి వద్దనుకునేవారు కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యేవారు. కొందరైతే వచ్చి తమకు ప్రమోషన్ వద్దని రాసి ఇచ్చి వెళ్లేవారు. అయితే ప్రస్తుతం అధికారుల నిర్వాకంతో ప్రమోషన్ వద్దనుకున్న వారికీ పడిగాపులు తప్పలేదు. సీరియారిటీ జాబితాలో పేరు వచ్చేవరకు వేచి ఉండి కౌన్సెలింగ్‌కు హాజరై టేబుల్ కాపీలో సంతకం పెట్టి ప్రమోషన్ వద్దని ఫామ్ పూరించి సమర్పిం చాల్సి రావడంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతిసారీ సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో ఎస్‌ఆర్‌లు, విద్యార్హతల సర్టిఫికెట్లు తేవడం కూడా ఇబ్బందికరంగా మారింది. శుక్రవారం కౌన్సెలింగ్, బదిలీలకు గురువారం రాత్రి డీఈవో కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది.


ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం స్కూల్ వద్ద పడిగాపులు కాస్తున్న టీచర్లు

టీచర్లు ఉక్కిరిబిక్కిరి

తీరా చూస్తే శుక్రవారం ప్రమోషన్ కౌన్సెలింగ్ ఉందంటూ ఉపాధ్యాయ

మిగతా 6వ పేజీలో

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

మద్దిపాడులో 1,900 బస్తాలు, ఎన్‌జీపాడు వద్ద 300 బస్తాలు

- ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలింపు
- రైస్ మిల్లు లీజుదారుడిపై 6ఏ కేసు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మద్దిపాడులోని ఓ రైస్ మిల్లులో నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. మద్దిపాడులోని వెంకటేశ్వర రైస్‌మిల్లులో భారీగా బియ్యం నిల్వలు ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణకు ఫిర్యాదు అందింది. దీంతో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. భారీగా బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. రేషన్ బస్తాలతోపాటు మరికొంత భాగాన్ని పాలిష్ చేసి ప్యాకింగ్ మార్చినట్లు పసిగట్టారు. అక్కడ సుమారు 1,900 బస్తాల వరకు నిల్వ ఉన్నట్లు తేల్చారు. శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆ మిల్లులో నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రత్యేక లారీలు ఏర్పాటు చేసి ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించే ప్రక్రియను చేపట్టారు. మధ్యాహ్నం వరకు రెండు లారీల్లో వెయ్యి బస్తాలు, సాయంత్రం మరో లారీలో మిగతా బియ్యాన్ని తరలించారు. ఆ మిల్లు లీజుదారుడైన సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. మరోవైపు చీరాల వైపు నుంచి లారీలో వస్తున్న బియ్యాన్ని నాగులుప్పలపాడు వద్ద పట్టుకున్నారు. ఆ లారీలో సుమారు 300 బస్తాల బియ్యం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో రెండుచోట్ల కలిపి సుమారు 2,200 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకేరోజు రెండు ప్రాంతాల్లో పట్టుకున్న బియ్యాన్ని ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు.



దర్శిలోని పాలశీతల కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఏఎస్పై

కల్తీపాల తయారీ నివారణకు చర్యలు

పాలశీతల, విక్రయ కేంద్రాల్లో పోలీసుల ముమ్మర తనిఖీలు

- రెండు రోజులుగా కొనసాగుతున్న దాడులు
- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- కన్నెత్తి చూడని ఆహార భద్రత అధికారులు

గిరిజనులకు సహకారం కరువు

- చేష్టలుడిగిన జీసీసీ
- లభించని గిట్టుబాటు ధర
- ఫలసేకరణకు గిరిపుత్రుల వెనకడుగు
- తగ్గిన అటవీ ఉత్పత్తుల వ్యాపారం

7

కల్తీపాల తయారీ నివారణకు చర్యలు

పోలీసుల ముమ్మర తనిఖీలు

దర్శి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ఎంతోకాలంగా కొనసాగుతున్న కల్తీపాల తయారీ నివారణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అందులోభాగంగా దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లోని పాలశీతల కేంద్రాలు, పాలవిక్రయ కేంద్రాల్లో గత రెండు రోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. దర్శి ప్రాంతంలో కల్తీపాల తయారీ కుటీర పరిశ్రమగా తయారైన విషయం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు ఇష్టానుసారం కల్తీపాలు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని హరించే కల్తీపాలను మార్కెట్‌లో విచ్చలవిడిగా చలామని కావడంతో ప్రజలు పాలు కొనుగోలు చేసేందుకు బయపడే పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్తీపాల తయారీదారులపై దృష్టి సారించారు. రెండు నెలల క్రితం నియోజకవర్గంలోని అన్ని పాలశీతల కేంద్రాలు, విక్రయ కేంద్రాలను దర్శి సీఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. దీంతో కొంతమేరకు కల్తీపాల తయారీ తగ్గింది. ప్రస్తుతం వేసవి కావడంతో పాల దిగుబడి తగ్గింది. దీంతో అక్రమార్కులు మళ్లీ గుట్టుగా కల్తీపాల ద్వారా లబ్ధి పొందేందుకు యత్నాలు చేస్తున్నారు. ఈ తరుణంలో పోలీసులు గత రెండు రోజులుగా మళ్లీ తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే కల్తీపాలు ఎవరెవరు తయారు చేస్తున్నారనే వివరాలు సేకరించారు. భవిష్యత్తులో కల్తీపాలు తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పాలశీతల కేంద్రాలను తనిఖీ చేసి యజమానులకు పోలీసులు స్పష్టమైన సూచనలు చేస్తున్నారు. కల్తీపాలను సేకరించవద్దని అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉండగా కల్తీపాలను నియంత్రించాల్సిన ఆహార భద్రతాశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు మొక్కుబడిగా తనిఖీలు చేసి నామమాత్రపు కేసులు బనాయించారు. ఇటీవల కాలంలో ఏకారణం చేతనో ఆహార భద్రతాశాఖ అధికారులు తనిఖీలకు కూడా రావడం లేదు. ఇప్పటికైనా ఇరుశాఖల అధికారులు కల్తీపాలను పూర్తిగా నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాంకు నగదు గోల్‌మాల్ కేసులో ఇద్దరి అరెస్టు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. దీంతో బ్యాంకు అధికారి కె.లక్ష్మీభార్గవ్ విచారణ చేపట్టి ఖాతాదారుల నగదు సుమారు 2కోట్ల 14లక్షల 45వేల 736 రూపాయలు మోసం చేసినట్లు గుర్తించారు. అందులో 34 లక్షల 42వేల 954 రూపాయలు రికవరీ అయింది. ఈమేరకు మేనేజర్ తినుపతయ్య జూన్ 2న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ దామోదర్ పర్యవేక్షణలో సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. మోసానికి పాల్పడిన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు జరిపే ఖాతాదారులు నెలకోమారు స్టేట్ మెంట్లను పరిశీలించుకుంటే ఇలాంటి మోసాలు జరగకుండా ఉంటాయని డీఎస్పీ సూచించారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సింగరాయకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. తొలుత దేవస్థానంలోని మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు రాజ్యలక్ష్మి, గోదాదేవి, యోగానందలక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని సుందరమైన పూలతో అలంకరించారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి బ్రహ్మోత్సవాలకు ప్రారంభ సూచికంగా మేళతాళాలతో పుట్టమట్టిని దేవస్థానానికి తీసుకొచ్చారు. వేదమంత్రోచ్చరణల మధ్య ఆమట్టిలో నవధాన్యాలను పోసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు నరసింహాచార్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ధ్వజారోహణ నిర్వహిస్తారు. రాత్రికి చంద్రప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు భక్తులకు దర్శనమిస్తారు.

హుండీ ఆదాయం రూ.2.21లక్షలు

వరాహ లక్ష్మీనరసింహస్వామివారి హుండీలోని కానుకలను శుక్రవారం లెక్కించారు. 84 రోజులకు రూ.2,21,135 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

సహకారం లేదిక్కడ..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. మరోవైపు డీసీసీబీ వ్యవహారంలోనూ ఇతర కొన్ని అంశాల్లోనూ డీసీవో శ్రీనివాసరెడ్డి వ్యవహారశైలిపై కలెక్టర్ అన్సారియా కూడా అసంతృప్తితో ఉన్నారు. ఆ సమయంలో ఉన్నత స్థాయి నుంచి డీసీవోపై తమకు వస్తున్న ఫిర్యాదుల విషయమై కలెక్టర్‌ను వివరణ కోరడంతో పాటు తగు చర్యలకు సూచించారు. ఈ నేపథ్యంలో డీసీవో శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ప్రభుత్వానికి సరెండ్ చేశారు. అది మార్చి ఆఖరులో జరిగింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు కలెక్టర్ సిఫార్సును సంబంధిత శాఖ కమిషనర్ ఆమోదించి ఆస్థానంలో మరొక అధికారిని నియమిస్తారు. అలాంటి చర్య ఒకట్రెండ్రోజుల్లో జరిగిపోవాలి. కానీ ఇక్కడ డీసీవో విషయంలో ఉన్నత స్థాయి అధికారుల నుంచి స్పందన లేదని సమాచారం. శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ సరెండర్ చేస్తూ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా పంపిన అనంతరం ఆయన ఇక్కడ రిలీవ్ కాగా ఆ స్థానంలో ఎవరినీ రాష్ట్ర అధికారులు నియమించలేదు.

రెండు వారాల తర్వాత నియామకం

దాదాపు రెండు వారాలపాటు డీసీవో పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో శాఖాపరమైన పనులు కుంటుపడకుండా ఉండేందుకు డీఎల్‌సీవో కేడర్‌లో పీడీసీసీ బ్యాంకులో ఓఎస్‌డీగా పనిచేస్తున్న ఇందిరాదేవిని ఏప్రిల్ 15న కలెక్టర్ అన్సారియా ఇన్‌చార్జి డీసీవోగా పూర్తి అదనపు బాధ్యతల్లో నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేందుకు అర్హత డీఎల్‌సీవో కేడర్ వారికే ఉండగా అలాంటి వారు జిల్లాలో ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. వారిలో ఒకరు పి.రాజశేఖర్ కాగా ఆయన డీసీఏవో పాటు ఒంగోలు డివిజనల్ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారు. అంతేకాక ఆయనపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నాయి. ఇక మార్కాపురం డీసీసీవో ఒకరు కాగా, డీసీసీబీలో ఓఎస్‌డీగా ఇందిరాదేవి మరొకరు. ఒంగోలులో అందుబాటులో ఉండటంతో ఆమెవైపు కలెక్టర్ మొగ్గుచూపినట్లు సమాచారం. ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా నియమించిన కలెక్టర్ ఆ విషయాన్ని సహకారశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు.

డీసీవోకు లాగిన్ ఇవ్వకుండా..

సాధారణంగా ప్రభుత్వంలో ఇలా కలెక్టర్లు చేస్తే తక్షణం ఉన్నత స్థాయి నుంచి ఆమోదం లభిస్తుంది. అయితే సహకార శాఖ కమిషనరేట్ నుంచి అందుకు విరుద్ధంగా జరిగింది. తొలుత డీసీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేసినప్పుడే మరొకరిని ఆ స్థానంలో రాష్ట్ర సహకార అధికారులు మరొకరిని నియమించాలి. అది చేయకపోగా ఇక్కడ ఇన్‌చార్జీ డీసీవోగా ఇందిరాదేవిని నియమించి రాటిఫికేషన్ (ధ్రువీకరణ) కోసం కమిషనర్‌కు పంపితే అందుకు కూడా అంగీకారం ఇంతవరకు తెలుపలేదు. దీంతో ఇన్‌చార్జీ డీసీవో ఇందిరాదేవికి ఆర్థిక పరమైన, ఇతర అంశాలలో పూర్తిగా పనిచేసే అవకాశం లేకుండాపోయింది. కీలకమైన జిల్లా అధికారులకు ఉండే సీఎఫ్ఎంఎస్‌లో ఆమెను ధ్రువీకరించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల డీసీవోలు కలిసి ఉండే సీఎఫ్ఎంఎస్ లాగిన్ కూడా సమస్యలు ఎదురై ఇతర జిల్లాల అధికారుల విధులకు కొంత ఆటంకం ఏర్పడినట్లు సమాచారం. దానిని గుర్తించి ఆ లాగిన్ నుంచి ఒంగోలు డీసీవోను తప్పించి ఇతర జిల్లాలకు ఇబ్బందులు లేకుండా చేసిన ఉన్నతాధికారులు ఇక్కడ మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు.

జీతాలు నిలిచి ఇబ్బందుల్లో ఉద్యోగులు

నిజానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీసీవోలు ఉండే లాగిన్ నుంచి ఒంగోలు డీసీవోను తప్పించడం కూడా నిబంధనలకు విరుద్ధమని చెప్తున్నారు. ఆ విషయం అలా ఉంచితే ఇక్కడ ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించిన ఇందిరాదేవిని ధ్రువీకరించకుండా ఆ శాఖ కమిషనరేట్ వ్యవహరిస్తున్న తీరుతో జిల్లాలో సమస్య ఏర్పడింది. ఇందిరాదేవిని ధ్రువీకరించక సీఎఫ్ఎంఎస్‌లో ఆమె పేరు చేరకపోవడంతో చివరకు డీసీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందికి కూడా జీతాలు నిలిచిపోయాయి. రెండు నెలల జీతాలు ఆగిపోగా వచ్చేనెల పరిస్థితి కూడా అలాగే ఉండవచ్చని తెలుస్తోంది. ఈ మొత్తం పరిస్థితికి ప్రధాన కారణం డీసీవో శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేయడం పట్ల కమిషనరేట్ అధికారులు గుర్రుగా ఉండటమేనని తెలుస్తోంది. అయితే వారికి ఇష్టం లేకపోయినా కలెక్టర్ సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా అందుకు వారు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ మొత్తం వ్యవహారంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ఇన్‌చార్జి డీసీవో ఇందిరాదేవి తన అనారోగ్య కారణాలు, పని ఒత్తిడి దృష్ట్యా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నట్లు సమాచారం. ఆ మేరకు అటు సహకార శాఖ కమిషనర్‌కు, ఇటు కలెక్టర్‌కు తన అభ్యర్థలను ఇచ్చిట్లు తెలుస్తోంది. మొత్తం మీద జిల్లాలో సహకార సంస్థలు సంక్షోభంలో పడకుండా పర్యవేక్షించాల్సిన జిల్లా సహకార శాఖే గందరగోళంలో పడింది.

దేవదాయశాఖ అధికారిపై కమిషనర్ ఆగ్రహం

పర్చూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల సొంత భూములను దేవదాయశాఖ నిషిద్ధ భూముల జాబితాలో చేర్చి వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించడంలో తీవ్రజాప్యంపై కమిషనర్ రామచంద్రమోహన్ అగ్రహం వ్యక్తం చేశారు, పర్చూరు మండలంలోని పలువురు రైతులు శుక్రవారం కమిషనర్‌ను కలసి జిల్లా దేవదాయశాఖ తీరుపై ఫిర్యాదు చేశారు. తమ సొంత భూములు దేవదాయశాఖకు చెందినవిగా పేర్కొని నిషిద్ధ భూముల జాబితాలో చేర్చారన్నారు. వాటిని తొలగించాలని ఏడేళ్లగా తాము అర్జీలు ఇస్తున్నా సమస్య పరిష్కరించలేదని కమిషనర్‌కు వివరించారు. దీంతో జిల్లా దేవదాయశాఖ అధికారికి కమిషనర్ ఫోన్‌చేసి సమస్యల పరిష్కారంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. కారణాలు చెబుతూ ఎంతకాలం జాప్యం చేస్తారని ప్రశ్నించారు. రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించరా..? అంటూ అగ్రహం వ్యక్తం చేశారు. నిషిద్ధ జాబితాలో తప్పుగా నమోదు చేసిన రైతుల భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పనితీరును మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యపై పర్యవేక్షించాలని గుంటూరు దేవాదాయశాఖ ఉప కమీషనర్ కె.బి.శ్రీనివాసరావుకు కమిషనర్ సూచించారు.

ప్రమోషన్ల కోసం పడిగాపులు

(5వ పేజీ తరువాయి)

గ్రూపుల్లో, టీచర్లకు నేరుగా ఫోన్లు చేసి పిలిపించారు. ఈ విధంగా లేచిందే లేడికి పరుగు సామెతగా అధికారులు టీచర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితోనే ఇక్కడి అధికారులు అలా చేస్తున్నట్లు సమాచారం. గంటల తరబడి పడిగాపులు కాయాల్సి రావడంతో టీచర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల ప్రమోషన్ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించేందుకు పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలు చేరుకున్నారు. డీఆర్‌ఆర్ఎం స్కూలులో మూడు గదుల్లో మూడు యాజమాన్యాల ఉద్యోగోన్నతులను చేపట్టారు. ఒక గదిలో జడ్పీ, మరో గదిలో ప్రభుత్వ యాజమాన్యం, మరో గదిలో మునిసిపాలిటీ పరిధిలోని టీచర్లకు ప్రమోషన్లు నిర్వహించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యంలో కోర్టు కేసుల నేపథ్యంలో తెలుగు, హిందీ స్కూలు అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు నిలిపివేశారు. మొత్తం 432 స్కూలు అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్ఎంలు, పీడీల ఉద్యోగోన్నతులకు సెకండరీ గ్రేడ్, తత్సమాన కేడర్ టీచర్లకు ఈ ఉద్యోగోన్నతులు నిర్వహించారు. ఎక్కువమంది టీచర్లు ప్రమోషన్లకు విముఖత చూపుతున్నారు. కౌన్సెలింగ్‌ను డీఈవో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి వాయు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అంతేగాకుండా ఉష్ట్రవాహన, వినాయక జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ డాక్టరు అన్నదానం చిదంబరస్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అనంతరం పలువురు మహిళలు విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. అంతేగాకుండా మహిళలు స్వామి వారికి కుంకుమ, పసుపుతో పూజలు చేశారు. స్వామి వారికి హారతులు పట్టారు. దాదాపుగా 22 అడుగులు ఎత్తైన శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్థులు సహకరించారు. మండలంలోని కోనంకి గ్రామం నుండి వలపర్ల గ్రామంలోకి ప్రవేశించే సమయంలో వలపర్ల గ్రామపొలిమేర వద్ద భారీగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమాన్ని తిలకించడానికి వలపర్ల, కోనంకి, రామకూరు గ్రామాల నుంచి ప్రజలు విశేషంగా తరలివచ్చారు.



ప్రతిష్ఠించిన అంజన్న విగ్రహం

అలరారుతున్న గుండ్లకమ్మ

గేట్లు పూర్తిచేసి.. నీటిని నిల్వచేసిన రాష్ట్ర ప్రభుత్వం

మరమ్మతులు చేయించలేక ప్రాజెక్టును ఎండబెట్టిన వైసీపీ పాలకులు

మంత్రి గొట్టిపాటి చొరవతో పూర్తయిన నిర్మాణం

హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

మేదరమెట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తాగు, సాగు నీటికి ప్రధాన వనరైన గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. కనీసం నీటిని నిల్వ ఉంచలేక ప్రాజెక్టును నిర్దాక్షిణ్యంగా ఎండబెట్టింది. జగన్ హయాంలో అంటే 2022 ఆగస్టులో 3వ నంబరు గేటు, 2023 డిసెంబరులో 2వ నంబరు గేటు వరదనీటికి కొట్టుకుపోయాయి. అంతేగాక రిజర్వాయర్‌లో ఉన్న నీటితోపాటు లక్షలాది రూపాయల మత్స్య సంపద మొత్తం సముద్రం పాలైంది. అప్పట్నుంచి రెండేళ్లపాటు ఆయకట్టు రైతులు పంటలు పండించలేక నష్టపోయారు. గేట్లు కొట్టుకుపోయి రిజర్వాయర్‌లోని నీరు మొత్తం సముద్రంపాలైనా అప్పటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. గేట్లకు మరమ్మతులు చేసి నీటిని నిలిపేందుకు అవసరమైన కనీస ప్రయత్నం కూడా చేయలేదు. అప్పట్లో రిజర్వాయర్‌ను పరిశీలించిన నిపుణుల బృందం సరైన మరమ్మతులు చేయకపోవడం వలనే రెండు గేట్లు కొట్టుకుపోయినట్లు నిర్ధారించారు. అంతేగాక మిగతా గేట్లకు కూడా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు.



గేట్లు పెట్టడంతో నీటితో నిండుగా ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్

నిధుల విడుదలతోపాటు పనులు పూర్తి చేయించిన గొట్టిపాటి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని రిజర్వాయర్‌లోని 15 గేట్ల నిర్మాణానికి రూ.9.17 కోట్లు అంచనాలతో టెండర్లు పిలిచారు. రూ.6.56 కోట్లతో పనులు చేయడానికి కాంట్రాక్టరు ముందుకు వచ్చారు. వారం, వారం గేట్ల నిర్మాణ పురోగతిని తెలుసుకొని పనులు ఆగకుండా కాంట్రాక్టరుకు అవసరమైనప్పుడల్లా నిధులు మంజూరు చేయించి గేట్లు త్వరగా పూర్తి కావడానికి కృషి చేశారు. దీంతో కొత్త గేట్లు నిర్మాణం పూర్తిచేసి వాటిని అమర్చి గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీటిని నిల్వచేశారు. రిజర్వాయర్ ఆయకట్టులోని రైతులకు అవసరమైర నీటిని డిసెంబరు నుంచే విడుదల చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉంది. దీంతో అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని తాగునీటి చెరువులకు ఇబ్బంది లేకుండా పోయింది. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి రవికుమార్‌కు ఆయకట్టు రైతులేకాక ఈ రిజర్వాయర్‌పై తాగునీటికి ఆధారపడిన ఒంగోలు నగరంతోపాటు 100కుపైగా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



నీళ్లు లేని రిజర్వాయర్‌లో నడుస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా(ఫైల్)

అప్పట్లో ఇసుక కోసం గేట్ల మరమ్మతులు గాలికి...

నాడు వైసీపీ ప్రభుత్వం కొత్త గేట్లు నిర్మిస్తున్నామని టెండరు పిలిచి, బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. గేట్లు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పి కాంట్రాక్టరుకు నిధులు కేటాయించలేదు. దీంతో గేట్ల నిర్మాణం ఆగిపోయింది. నిధులు కేటాయించకపోవడానికి కారణం రిజర్వాయర్‌లోని ఇసుకను దోచుకోవడానికే గేట్ల నిర్మాణం చేపట్టలేదని అప్పట్లో ఆయకట్టు రైతులు ఆరోపించారు. తమ్మవరం, అనమనమూరు, మణికేశ్వరం తదితర గ్రామాల పరిధిలో రిజర్వాయర్‌లోని ఇసుకను డ్రెజ్జర్లతో తోడుకువెళ్లడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరింది. రెండేళ్లపాటు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీళ్లు లేకపోవడంతో ఆయకట్టులోని రైతులు, రిజర్వాయర్‌పై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులతోపాటు ఆధారపడిన తాగునీటి పథకాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఇసుక తోడుతున్న డ్రెజ్జర్(ఫైల్)

రైల్వే జోన్‌పై కేంద్రం ప్రత్యేక దృష్టి

అవీఇవీ

మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి కృతజ్ఞతలు

కొండపి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ సౌత్ రైల్వేజోన్‌పై ప్రత్యేక దృష్టి సారించి జీఎంగా సందీప్ మధును నియమించడంపై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఆమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను కేంద్రం నెరవేర్చేక్రమంలో వేగంగా అడుగులు వేయడాన్ని మంత్రి హర్షించారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుండగా మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. పీఎం మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి బక్రీద్ శుభాకాంక్షలు

కొండపి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ అని మంత్రి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర పర్వదినం ప్రతి ఒక్కరికీ ఆనందం, శాంతి, ఆరోగ్యాన్ని అందించాలని ఆకాంక్షించారు.

నాగార్పమ్మ ఆలయంలో మంత్రి స్వామి పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి

జరుగుమల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిర్రికూరపాడులో శ్రీ నాగార్పమ్మ కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు వెన్నూరు విద్యార్థి



మనోజ్‌కుమార్

కొండపి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి కొండ్రు మనోజ్‌కుమార్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యాడు. ఆమేరకు సమాచారం రావడంతో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్‌ను అభినందించారు.

ప్రతిభా పురస్కారానికి యోషితకృష్ణశ్రీ ఎంపిక



యోషితకృష్ణశ్రీ

కొండపి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన కొండపి యోషితకృష్ణశ్రీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు అధికారులు ప్రకటించారు. దీంతో యోషితకృష్ణశ్రీని పలువురు అభినందించారు.

బర్లీ పొగాకు కోసం స్టాక్ పాయింట్ల పరిశీలన



ఉప్పుగుండూరులో మార్కెట్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న డీఎం హరికృష్ణ

నాగులుప్పలపాడు, జూన్6 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన బర్లీ పొగాకు నిల్వ చేసేందుకు అనువైన స్థలాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉప్పుగుండూరులోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ గోడౌన్‌లను మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఎంతమేర సరుకు నిల్వ చేయవచ్చని వివరాలను సేకరించారు. మొత్తం 20 లారీల సరుకు నిల్వ చేసేందుకు అనువుగా ఉన్నట్లు డీఎం అంచనాకు వచ్చారు. కాగా వ్యవసాయ మార్కెట్‌యార్డ్ గోడౌన్‌లను పరిశీలించేందుకు వచ్చిన డీఎం హరికృష్ణను స్థానిక రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి ఉప్పుగుండూరులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రస్తుతం స్టాక్ పాయింట్లను మాత్రమే పరిశీలిస్తున్నామని, కొనుగోలు కేంద్రం ఏర్పాటు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఆయన వెంట ఏవో పోతినేని వెంకట్రావు ఉన్నారు.

ఒంగోలు కార్పొరేషన్‌కు షోకాజ్ నోటీసు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థకు రాష్ట్ర సమాచార కమిషన్ షోకాజ్ నోటీసు జారీ చేంది. ఒంగోలు కార్పొరేషన్‌లో వాకీటాకీల కొనుగోలులో రూ.27లక్షలు అవినీతికి పాల్పడ్డారని, అందుకు సంబంధించి సమాచారం కావాలని వేటపాలెంకు చెందిన నాగార్జున రెడ్డి 2019లో దరఖాస్తు చేశారు. పలుమార్లు తాను కోరిన సమాచారం అందించకపోవడంతో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అర్జీదారుడు అడిగిన సమాచారం ఇవ్వకపోగా వాకీ టాకీల కొనుగోలు బహిరంగ టెండర్‌లు ఆహ్వానించకుండా నామినేషన్ పద్ధతిన ఏడు వర్క్‌లుగా చిత్రీకరించి ప్రస్తుతం రికార్డులు మాయం చేశారని ఫిర్యాదుదారుడు నాగార్జున ఆరోపిస్తున్నారు. దీంతో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంగోలు కార్పొరేషన్ సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు.

9న విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం

ఒంగోలు విద్య, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు ఈనెల 9వ తేదీన ఒంగోలులో అవార్డులను ప్రదానం చేయనున్నారు. జిల్లాలో 242 మంది విద్యార్థులకు ఈ ప్రతిభా వార్డులకు పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసింది. ఒక్కొక్క విద్యార్థికి రూ.20వేల చొప్పున రూ.48.4 లక్షలను విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంగా అందించనున్నారు. విద్యార్థులకు జ్ఞాపిక, శాలువ, ప్రశంసాపత్రాలను అందజేస్తారు. 9న ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు ప్రారంభించింది.

వైద్యశాఖలో బదిలీలు దరఖాస్తుల పరిశీలన పూర్తి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన శుక్రవారం ముగిసింది. బదిలీల కోసం గత నెల 31న వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీచేయడంతో తదనుగుణంగా దరఖాస్తులను స్వీకరించారు. ఆ శాఖలో పనిచేస్తున్న పదిరకాల క్యేడర్లకు సంబంధించి బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులను డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశీలించారు. ఆయా దరఖాస్తుల పరిశీలనపై ఏమైనా అభ్యంతరాలు వస్తే వాటిని స్వీకరించి ఈనెల 10, 11 తేదీల్లో విచారణ చేయనున్నారు. ఈనెల 14న తుది జాబితా విడుదల చేసి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యక్తిపై రౌడీషీటర్ బీరుసీసాతో దాడి

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వ్యక్తిపై ఓ రౌడీ షీటర్ బీరు సీసాతో దాడి చేశాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి ప్రసాద్ థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... ఇరువురు సమీపంలోని ఓ చోట్ల వేర్వేరుగా మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో అనుకోని రీతిలో చెలరేగిన వివాదంతో ఆ రౌడీ షీటర్ బీరు సీసాతో వ్యక్తి తలపై, తీవ్రంగా దాడి చేశాడు. దీంతో రక్త గాయాలతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

నల్ల'మలమల' కాదు.. మిలమిల...!





రోహిణికార్తెలో కాసే ఎండలకు రోళ్లు సైతం పగిలిపోతాయని పెద్దలు చెబుతుంటారు. అంతటి తీవ్రమైన ఎండల వేడిమికి చెట్టూచేమ, కొండాగుట్ట అంతా ఎండిపోయి ఉంటుంది. పచ్చదనం ఎక్కడా కనిపించదు. వాటి మధ్య తిరుగాడే వన్యప్రాణులు తాగేందుకు నీరు కూడా దొరక్క మైదాన ప్రాంతాలకు వలస వెళ్తాయి. అలాంటి కార్తెలో ఇటీవల కురిసిన వర్షాలకు నల్లమల అడవంతా తడిసి ముద్దయింది. చెట్లన్నీ జీవాన్ని పోసుకుని ఆకుపచ్చని సోయగంతో ఆకట్టుకుంటోంది. మృగశిర కార్తె రాక ముందే నల్లమల మురిసిపోతోంది. ముందస్తుగా కురిసిన వానలతో ఎటు చూసినా అడవిలో కొండలు, లోయలు, చెట్లన్నీ చిగుర్చాయి. ఆ అటవీ ప్రాంతంలో వంకర టింకరగా ఉన్న నల్లటి తారురోడ్లు మరింత అందాన్నిస్తున్నాయి. నల్లమల ఘాట్ రోడ్డులో ప్రయాణానికి ప్రజలను ఆహ్వానిస్తున్నట్లుగా ఉన్నాయి. - పెద్దదోర్నాల, ఆంధ్రజ్యోతి

గ్రానైట్ టిప్పర్ ఢీకొని యువకుడు దుర్మరణం

చీమకుర్తి, జూన్6(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ టిప్పర్ ఢీకొన్న సంఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చీమకుర్తి బైపాస్‌పై కేవీ.పాలెం జంక్షన్ సమీపంలో జరిగింది. చీమకుర్తికి చెందిన శివప్రసాద్(24) బైక్‌పై పట్టణంలోకి వస్తుండగా ఒంగోలు వైపు వెళ్తున్న గ్రానైట్ టిప్పర్ ఢీకొనటంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే చనిపోయాడు. సీఐ సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్..

ఐదుగురికి గాయాలు



ప్రమాదస్థలంలో బస్, లారీ

నాగులుప్పలపాడు, జూన్6 (ఆం ధ్రజ్యోతి): లారీని వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొని ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన ఉప్పుగుండూరు గ్రా మంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు నుంచి ఉప్పుగుండూరులోని వెళుతున్న లారీ గ్రామంలోని అయ్యప్పస్వామి గుడి సమీపంలోకి రాగానే అక్కడ ఆటో ఒక్కసారిగా అడ్డు వచ్చింది. దీంతో లారీని అదుపు చేసేందుకు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేశాడు. దీంతో వెనక వస్తున్న చీరాల వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలుకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానాలకు తరలించారు.

నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు

రిమ్స్‌లో త్వరలో ఏర్పాటుకానున్న మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్ కేర్ యూనిట్ పరిశీలన

ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లోని నవజాత శిశు కేంద్రంలో ఉన్న చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా జీజీహెచ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీజీహెచ్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్ కేర్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా యూనిట్‌లలో చేపడుతున్న మరమ్మతులను పరిశీలించి, వైద్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లోని నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవల అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లోని పలు విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి, అక్కడ లభిస్తున్న వైద్యు సేవలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న పరీక్ష తీరుతెన్నులను పరిశీలించారు. అభ్యర్థులకు కల్పించిన వసతులను, పరీక్ష నిర్వహణను, బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో 8 పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారితపరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. రెండు పూటలా ఈ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒంగోలు తహసీల్దార్‌మదుసూదన్‌రావు ఇతర అధికారులు ఉన్నారు.



డీఎస్సీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

బక్రీద్‌కు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి

పలు శాఖల అధికారులతో సమీక్షించిన డీఆర్వో

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం జరగనున్న పవిత్ర బక్రీద్ పండుగకు అన్ని ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ చట్టం 1977 కచ్చితంగా అమలు చేయడంతో పాటు బక్రీద్ సందర్భంగా జంతువుల అక్రమ రవాణా, జంతువధ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కబేళాలపై, ఆవులు, తదితర జంతు అక్రమ రవాణా, జంతువధలపై కూడా ప్రత్యేకనిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. అవసరమైన ప్రాంతంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మతపెద్దలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, జిల్లామైనార్టీ వెల్ఫేర్ అధికారి జి. పార్థసారథి, డీటీసీ సుశీల, మునిసిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేషు



నమాజ్ కోసం సిద్ధం చేసిన పెద్ద ఈద్గా

నమాజ్‌కు సర్వం సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే బక్రీద్ పర్వదినానికి మార్కాపురం పట్టణంలోని మసీద్‌లు సిద్ధమయ్యాయి. స్థానిక కంభం రోడ్డు పెద్ద ఈద్గా, నాగులవరం రోడ్డు ఈద్గాలను ఈద్ నమాజ్ కోసం సిద్ధం చేశారు. పట్టణంలోని మర్కస్ జామీయా మసీద్‌లో శనివారం ఉదయం 7.30 గంటలకు ఈద్ నమాజ్ నిర్వహిస్తారని, ముతవల్లి మిర్జా సబ్దర్ అలీ బేగ్ తెలిపారు. కంభం రోడ్డులోని ఈద్గాలో ఉదయం 9 గంటలకు నమాజ్ నిర్వహిస్తారని, కంభం సెంటర్ నుంచి 8.30గంటలకు ఈద్గా వద్దకు బయలుదేరతారని తెలిపారు. నాగులవరం రోడ్డులో 9.30 గంటలకు, తర్లుపాడు రోడ్డులోని ఈద్గాలో ఉదయం 9గంటలకు నమాజ్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ఈద్ నమాజ్ అనంతరం పొట్టేళ్లు, మేకపోతులు కోసి పేదలకు మాంసాన్ని పంచుతారు. మనిషి దైవానికి ప్రీతిపాత్రుడు కావాలన్నా, తోటి మానవుల హృదయాల్లో కొలువు దీరాలన్నా త్యాగమే ఉత్తమ మార్గం అని ముఫ్తి మహమ్మద్ ఖాశిం తెలిపారు. ఖుర్బానీ ఇవ్వడం అంటే దేవుడి ఆజ్ఞలను పాటించటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం, సంపన్నులు ఖుర్బానీ ఇచ్చి పేదలకు ఆ మాంసాన్ని పంచాలన్నారు. ఈద్ సందర్భంగా ముస్లింలు అత్తరు, టోపీలు వివిధ సామగ్రి కొనుగోలు చేశారు. ఈద్గాల వద్ద అధికారులు, మున్సిపల్ సిబ్బంది పందిళ్లను ఏర్పాటు చేశారు.

వీరయ్యచౌదరి హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ఒంగోలు క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు విచారణాధికారి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. వీరయ్యచౌదరిని కిరాతకంగా కత్తితో పొడిచిన నెల్లూరు జిల్లాకు చెందిన ఓబిలి నాగరాజు, గోళ్ల రుత్యంద్ర అలియాస్ నానిలను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరువురు నిందితులను త్రోవగుంట సమీపంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

వైసీపీ కార్యకర్త అనుమానాస్పద మృతి

కొండపిలోని టంగుటూరు రోడ్డులో మృతదేహం గుర్తింపు

కొండపి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెన్నూరుపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, పొగాకు రైతు చల్లా మధుసూదన్‌రెడ్డి (43) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కొండపిలోని టంగుటూరు రోడ్డులో ఆయన మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. మధుసూదన్‌రెడ్డి ఈనెల 4వ తేదీన కొండపిలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్నాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం టంగుటూరు రోడ్డులోని ఓ వెంచర్ వద్దకు వెళ్లిన కొందరు యువకులు అక్కడ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మధు కుటుంబ సభ్యులను పిలిపించగా వారు మృతదేహం ఆయనదేనని గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నియమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వివాదాలకు దూరంగా ఉండే మధుకు శత్రువులు ఎవరూ లేరని గ్రామస్థులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుల్లో ఒకరు ఇంజనీరింగ్ పూర్తిచేయగా, మరొకరు ఇంజనీరింగ్‌లో చేరాల్సి ఉందని గ్రామస్థులు చెప్పారు.

అటవీ ఫల సేకరణపై వెనకడుగు



చింతలలో ఉసిరి కాయలు అమ్ముకుంటున్న గిరిజనులు

చేష్టలుడిగిన గిరిజన సహకార సంస్థ

గిట్టుబాటు ధర దక్కకపోవడంతో గిరిపుత్రులు అసంతృప్తి

తగ్గిన వ్యాపారం

పెద్దదోర్నాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : అనాదిగా ఆదివాసులు అటవీ ఫల సేకరణ చేసి కడుపు నింపుకోవడం ఆనవాయితీ. అటవీ సంరక్షణ నేపథ్యంలో ఆ శాఖాధికారులు ఫల సేకరణను ఆక్షేపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సైతం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో చెంచుగిరిజనులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఫల సేకరణపై చెంచులు ఆసక్తి కనబర్చడం లేదు. తద్వారా ప్రభుత్వం ఆదాయం కోల్పోవడంతో జీసీసీ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది.

జీసీసీ ధరలు ఇవీ

అడవి తేనె కిలో రూ.300, పెట్టె తేనె రూ.150, మారేడు గడ్డలు రూ.450, ముష్ఠ గింజలు రూ.100, కుంకుడుకాయలు కేజీ రూ.35, కానుగ పప్పు రూ.25, తానికాయలు రూ.18, చింతపండు గింజతో రూ.34, గింజ లేకుండా రూ.67, కరక్కాయలు రూ.20, చిల్ల గింజలు రూ.50, ఎండు ఉసిరిక పప్పు రూ.90, విప్ప పరక రూ.32, నరమామిడి చెక్క రూ.18, ఫ్లవర్ చింతపండు రూ.90, చొప్పున చెల్లిస్తున్నారు. కాని బయటి మార్కెట్టులో చాలా వ్యత్యాసం ఉండడంతో జీసీసీకి వెల్లడం లేదు. దీంతో వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఎంతా అంటే ఏడాదికి కోటి రూపాయలు టార్గెట్ లక్ష్యం కాగా రూ.30లక్షలు వ్యాపారం కూడా జరగడం లేదని సంస్థ సిబ్బంది చెప్తున్నారు.

చెంచు గిరిజనుల అభివృద్ధికి జీసీసీ ఏర్పాటు

అటవీ ప్రాంతంలోని చెంచులు అటవీ ఉత్పత్తులు సేకరించి గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కి విక్రయించడం వల్ల వారికి జీవనోపాధి లభిస్తుంది. తద్వారా జీసీసీ ఆ ఫల సంపదను తిరిగి అమ్మకాలు చేసి వచ్చిన ఆదాయంతో సిబ్బందికి జీతాలు చెల్లిస్తూ గిరిజన అభివృద్ధికి సహకారం అందించేందుకు ప్రభుత్వం గిరిజన సహకార సంస్థను దోర్నాలలో ఏర్పాటు చేసింది. కొన్నేళ్ల వరకు మంచి లాభాలను గడించింది. చెంచులకూ ఆర్థికంగా ఉపకరించింది. రానురాను ఫల సేకరణ తగ్గింది. కొద్దోగొప్పో సేకరించిన ఫల సంపదకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించకపోవడంతో గిరిజనులు ఫల సేకరణను తగ్గించారు. నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకూ ఆకాశన్నంటుతున్న సమయంలో అటవీ ఫల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేదని గిరిజనులు వాపోతున్నారు. రోజంతా కష్టపడినా చేతికి రూ.200 రావడం లేదంటుని చెబుతున్నారు. వన్యప్రాణులు, విషసర్పాలు, క్రూర మృగాలు సంచరించే ప్రాంతాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కిలోనో, 2కిలోలు బంక సేకరిస్తే జీసీసీ ఇచ్చేది నామమాత్రమే.

స్వతాహాగా విక్రయాలు

జీసీసీలో తమకు గిట్టుబాటు కాదని చెంచు గిరిజనులు చాలా మంది సేకరించిన తేనె, కుంకుళ్లు, షరబత్ గడ్డలు స్వతాహాగానే ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. అక్కడే మంచి ధరలు లభిస్తున్నాయని చెంచు గిరిజనులు చెపుతున్నారు. బీరు బాటిల్ తేనె రూ.1,200 నుంచి రూ.1,500 వరకు అమ్ముతున్నారు. షరబత్ గడ్డలు(సుగంధపు వేళ్లు) కిలో రూ.450 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు.

వ్యాపారం పూర్తిగా తగ్గింది

వీ శ్రీనివాస్, జీసీసీ మేనేజర్ దోర్నాల



ఫల సేకరణ లేక జీసీసీలో వ్యాపారం పూర్తిగా తగ్గింది. అసలు ఇప్పటి గిరిజన యువతకు అటవీ ఫలాలు ఏంటో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మారేడు గడ్డలు అటవీ ప్రాంతంలో సేకరిస్తేనే అధిక ధరలు చెల్లిస్తాం. మైదాన ప్రాంతాల్లో సాగు చేసిన వాటికి డిమాండ్ ఉండదు.

ప్రభుత్వం జీసీసీని అభివృద్ధి చేయాలి

దాసరి అంకన్న, ఐటీడీఏ రాష్ట్ర సభ్యుడు



ప్రభుత్వం జీసీసీని అభివృద్ధి చేయాలి. అటవీ ఫల, ఉత్పత్తులను కొనుగోలు చేసి తద్వారా గిరిజనులకు ఆర్థిక తోడ్పాటును అందివ్వాలి.

ఆగని కల్తీ తేనె విక్రయం

గిట్టుబాటు ధరలు లేవని చెంచు గిరిజనులు సేకరించిన తేనెను స్వతాహాగా విక్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు అక్రమార్కులు బెల్లం పాకం, స్పటికతో తయారు చేసిన తేనెను అటవీ ప్రాంతంలో శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డుపై యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఐటీడీఏ, అటవీ శాఖాధికారులు, జీసీసీ అధికారుల కళ్లఎదుటే కల్తీ తేనె జోరుగా విక్రయిస్తున్నా నివారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ తేనెను చిన్న పిల్లలకు తినిపిస్తే పలు వ్యాధులు వచ్చే అవకాశం లేకపోలేదని వైద్యాధికారులు అంటున్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు

నాగులుప్పలపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. చీరాల వైపు నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు 400 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై గల చదలవాడ సమీపంలో డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యం బస్తాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన బియ్యం ఒంగోలులోని స్టాక్‌పాయింట్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు మృతి

నాగులుప్పలపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు మరణాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి నాగులుప్పలపాడుకు చెందిన చుండూరి ప్రసన్నకుమార్ (38) శుక్రవారం ఉదయం గ్రామంలోని రచ్చబండ వద్ద స్నేహితులతో కలిసి పేపర్ చదువుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. వెంటనే స్నేహితులు 108వాహనంలో ప్రసన్నకుమార్‌ను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఆరేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మద్దిపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమ కేంద్రం సమీపంలో శుక్రవారం మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పతంగి శ్రీనివాస రావు, పతంగి శ్రీధర్‌బాబు మోటార్‌సైకిల్‌పై స్వగ్రామం వెళుతుండగా కారు బ్రేక్ ఫెయిల్ వారిని ఢీకొట్టింది. దీంతో వారిద్దరికీ స్వల్ప గాయాలు కాగా వెంటనే మేదరమెట్ల తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

పేర్నమిట్టలో మోటార్‌సైక్లిస్టుకు..



గాయపడిన సైదా

సంతనూతలపాడు: రోడ్డుప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం పేర్నమిట్ట చెరువు సమీపంలో జరిగింది. తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంకు చెందిన షేక్ సైదా స్వగ్రామం నుంచి ఒంగోలుకు వెళ్తున్నాడు. అయితే నాంచారెడ్డిపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న మినీలారీ ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదాకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఒంగోలులో గుర్తు తెలియని వాహనం ఢీకొని..



గాయపడిన నాగరాజు

ఒంగోలు(రూరల్): స్థానిక కొప్పోలురోడ్డులోని రైల్వే ఫ్లైఓవర్ వంతెనపై కొప్పోలు నుంచి ఒంగోలు వెళ్లే మోటార్‌సైక్లిస్టును గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన నాగరాజు గాయపడ్డారు. క్షతగాత్రుడిని స్థానికులు 108వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చీమకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరపాలెం ఫీడర్ పరిధిలో పీఎంఐ పనుల జరుగుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవరపాలెం, బక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించగా బొందలపాటి నవీన్ కృష్ణ, సుమతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అదేవిధంగా స్వామివారికి నిర్వహించిన శేషవాహన సేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శేషవాహనసేవకు ఉభయదాతలుగా వల్లేటి రవీంద్ర, సుభాషిణి, పువ్వాడ చినయానాది శెట్టి, దాసరి అమ్మన్న, వెంకటలక్ష్మి వ్యవహరించారు. ఈవో బోడపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శనివారం స్వామి వారికి నెమలి వాహన సేవ, నరనంది వాహన సేవ, శివలీలామృతం ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటాయని ఈవో తెలిపారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

దామచర్ల బక్రీద్ శుభాకాంక్షలు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని, జిల్లాలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ ఉపకారవేతనానికి నలుగురు గోనుగుంట విద్యార్థుల ఎంపిక



అలేఖ్య ,కీర్తన, వినయ్‌కుమార్, పవన్‌కల్యాణ్

చీమకుర్తి, జూన్6(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రతిభా ఉపకారవేతనం (ఎన్‌ఎం ఎంఎస్) పరీక్షలో గోనుగుంట జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రతిభ చాటారు. నలుగురు విద్యార్థులు ఏకంగా ఉపకారవేతనానికి ఎంపికయ్యారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివిన విద్యార్థులు అలేఖ్య, కీర్తన, వినయ్‌కుమార్, పవన్‌కళ్యాణ్ ఉపకారం వేతనానికి ఎంపిక కాగా వారికి కేంద్రప్రభుత్వం నుంచి ఇంటర్ వరకూ నాలుగేళ్లపాటు ప్రతిఏటా ఒక్కొక్కరికి రూ.12వేలను అందజేస్తారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సోమా శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, వేణుగోపాలాచారి, ఎ.శ్రీనివాసరావు, ఆంజనేయులు, తిరువెంగళం, కరీముల్లా, పరమేశ్వరీ అభినందించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

గిద్దలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి సందర్భంగా అరుణాచలం దేవస్థానానికి గిద్దలూరు డిపో నుంచి ప్రత్యేక బస్సు నడుపనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ రాత్రి 8గంటలకు గిద్దలూరు నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, దారిలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని అరుణాచలం వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామని, ఒక్కొక్కరికి రూ.2500 చార్జీ అని, వివరాలకు 9959225702, 9959225745 సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులు వేగవంతం చేయాలి

గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణాల పూర్తికి చర్యలు ● ఒంగోలు మండల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): "గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో పురోభివృద్ధి లేదు. పనులు త్వరగా పూర్తి చేయాలి." అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కింద అభివృద్ధి పనులకు రూ.65.50లక్షలు నిధులు తెచ్చినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని అసహనం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. గ్రామాల్లో రేషన్‌కార్డులు, పెన్షన్‌ల కోసం అర్హత గల వారిని పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటి నుంచి గుర్తించి వారి పేర్లు ఆన్‌లైన్ చేయించాలని చెప్పారు. గ్రామాల్లో ఇప్పటికే 90 శాతం సిమెంట్‌రోడ్డులు పూర్తి కాగా డ్రైనేజీ నిర్మాణాలను త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలు లేవని, త్వరగా నిర్మించాలని సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు లేకుండా ఉంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తెలపాలన్నారు. శ్మశానవాటికలు చుట్టూ ప్రహరీలు గోడలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జగనన్నకాలనీల్లో ఇప్పటికి మిగిలి ఉన్న స్థలాలు నిజమైన లబ్ధిదారులా లేదో అనే విషయాలను గుర్తించాలని ఆదేశించారు. ఐదు ఎకరాలు కంటే విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సమయపాలన పాటించాలని, ప్రజలు సమస్యలు పరిష్కరిస్తూ మంచి సేవలు అందించాలని చెప్పారు. వలేటివారిపాలెం కార్యదర్శిపై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, తహసీల్దార్ నయాబ్‌రసూల్, ఏవో శేషబాబు, ఎంపీటీసీలు పాలేటి శ్రీనివాసరావు, గుండపనేని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మండవ వెంకటసుబ్బయ్య, మంచు మురళి, దేవరంపాటి కోటేశ్వరరావు, నన్నపనేని వెంకటేశ్వరరావు, ఏడీఏ బసవశంకరరావు, ఏవో కిషోర్‌బాబు, ఏఈ వంశీకృష్ణారెడ్డి, కరవది వైద్యాధికారి వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బీఎన్



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్ ఆయా అర్జీలు పరిశీలించి సమస్యలపై కొంతమంది అధికారులతో అర్జీదారుల సమక్షంలోనే మాట్లాడారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తన నివాసంలో 27మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.19,42,286 చెక్కులను అందజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమఫలాలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



కలెక్టర్ అన్సారియాకు టేబుల్‌బుక్‌ను అందజేస్తున్న డీడీఎం రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు 449 క్లైయిమ్స్‌లకు రూ.7.22 కోట్లు మంజూరు చేశారు. సింగిల్ డెస్క్ పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసిన వివిధ శాఖలకు చెందిన 137 వినతులకు 110 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం బి.శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, నాబార్డు ఏజీఎం రవికుమార్, ఏపీఐఐసీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టేబుల్ బుక్ అందజేత

జిల్లాలో నాబార్డు అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల విజయాలను ప్రతిబింబించే కాఫీ టేబుల్ బుక్‌లెన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు జిల్లా అభివృద్ధి అధికారి(డీడీఎం) రవికుమార్ అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఈ బుక్‌లెట్‌ను అందించారు. ఇందులో రైతులు, మహిళలు నాబార్డు ప్రాజెక్టుల ద్వారా సాధించిన విజయాలు, వారి జీవనోపాధిలో వచ్చిన మార్పులు, సమాజంపై పడిన సానుకూల ప్రభావాలను వివరించారు. నాబార్డు తన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో అమలు చేసిన కార్యక్రమాలను అందులో ప్రచురించినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

పొగాకు రైతులకు మెరుగైన ధరలు కల్పిస్తాం

● ఆర్‌ఎం లక్ష్మణరావు



వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు అధికారులు

మద్దిపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి సకాలంలో అమ్మకాలు పూర్తి చేయడానికి కృషి చేస్తామని బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ 160 మిలియన్ కిలోలు లక్ష్యంగా కాగా 220 మిలియన్ కిలోలు పొగాకు పంట సాగు చేశారని, ధరల విషయంలో వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. వ్యాపారుల ఆర్డర్లు ఖరారు అయితే అన్ని రకాల పొగాకు బేళ్ల కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. రానున్న రోజుల్లో నోబిడ్ బేళ్ల తగ్గించాలని సూచించనట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, మండవ గోవిందరాజులు, మండవ శ్రీరామమూర్తి, నారిపెద్ది వరహాలుచౌదరి, బోయపాటి వెంకయ్య, జజ్జర శరత్‌బాబు, చిలకలూరిపేట క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : ఎంఈవో



శిక్షణ ఇస్తున్న ఎంఈవో రమణయ్య

నాగులుప్పలపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వంటపని కార్మికులు విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిచాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు శుక్రవారం నాగులుప్పలపాడులోని ఎంఆర్‌సీ భవన్‌లో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతు ఈనెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. భోజనం తయారీపై పలు సూచనలు చేశారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దారవీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతకతను అందిపుచ్చుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి పేర్కొన్నారు. పెద్దారవీడులోని రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం రైతులకు ఖరీఫ్ పంటలకు ముందుస్తుగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఉన్నతికి అమలు చేస్తున్న పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన, కిసాన్ మన్ ధన్ యోజన, వ్యవసాయ సదుపాయాల నిధి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా మిరప, కంది, పెసర సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. భూ లోపాలను గుర్తించి, సారవంతం చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పురుగుమందుల పిచికారీకి డ్రోన్‌లను విని యోగించుకోవాలన్నారు. హైదరాబాద్ కోళ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బి.ప్రకాష్ మాట్లాడుతూ కోళ్ల రకాలు, వాటి పోషక విలువలు, వచ్చే వాదులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఆదిరెడ్డి, కేవీకే సిబ్బంది, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

8న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జైశ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ద్రావిడదేశం వి.కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల నుంచి ఒక్కొక్క మండలంలో మొదటి బహుమతిగా రూ.3వేలు, రెండో బహుమతిగా రూ.2వేలు, మూడో బహుమతిగా రూ.1000 నగదు బహుమతులతో పాటు బ్యాగులు, ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేస్తామన్నారు. శ్రీసాయి కృష్ణ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో జీఎస్టీ, కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ గోను రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 500 పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. శనివారం సాయంత్రం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8గంటలకు తన కార్యాలయంలోను, మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలో జరిగే కార్యక్రమంలో మాగుంట పాల్గొంటారు.

జిల్లా ప్రజలకు బక్రీదు శుభాకాంక్షలు

ఎంపీ మాగుంట ముస్లింలకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజారోగ్య భద్రత కోసం సర్వే : డీఎంహెచ్‌వో

సంతనూతలపాడు, జూన్6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజల ఆరోగ్య భద్రతకు వైద్యఆరోగ్యశాఖ ఎన్‌సీడీ-సీడీ 3.0 సర్వేను నిర్వహిస్తోందని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటా జరుగుతున్న సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏదైన సమస్య ఉంటే ముందుగానే గుర్తించి దానికి వైద్య సేవలు అందించాలని ఆయన చెప్పారు. అనంతనం టీబీ స్ర్కీనింగ్‌పై కూడా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డి.సురేష్‌కుమార్, డీపీహెచ్‌ఎన్‌వో నబీవలీ, వైద్యులు హరిణి, ప్రశాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాషపై పట్టు సాధించాలి



ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే మాతృభాష తెలుగుపై పట్టు సాధించాలని మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో కార్యదర్శి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన తెలుగుభాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారి చేత పలు తెలుగు గీతాలను పలికించి వాటికి అర్థాలను వివరించారు. టి.శ్రీనివాస రావు యోగా, స్టెప్ సీఈవో పి.శ్రీమన్నారాయణ మోటివేషన్ క్లాస్, బిందుమాధవి క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ పర్యవేక్షణ చేశారు. శనివారం వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఉంటుందని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి కోరారు.

గుడి నిర్మాణాన్ని ఆపాలంటూ నోటీసులు

సంతనూతలపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామంలో నిర్మిస్తున్న గుడి నిర్మాణాన్ని ఆపాలంటూ పంచాయతీ కార్యదర్శి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టేందుకు గతంలో తీర్మానం చేపట్టారు. అయితే గ్రామానికి చెందిన టి.శేషయ్య, టి.శ్రీకాంత్ ఆ స్థలంలో అనుమతులు లేకుండా గుడి నిర్మాణం చేపడుతున్నారని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి గుడి నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. నిర్మాణాన్ని తొలగించాలని, లేని పక్షంలో వారంరోజుల వ్యవధిలో తొలగిస్తామని అందులో పేర్కొన్నారు.

ఎస్పీ అశోక్‌బాబుకు సత్కారం

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాన్ క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన అశోక్‌బాబును శుక్రవారం స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ నిర్వాహకులు షహనాజ్, సర్దార్‌బాషా, కొల్లా మధు, నల్లూరి మోహన్‌రావు, అసిస్ట్ డీడీ వడ్డేంపూడి సుజాతరావు, కోసూరి శ్రీదేవి, తాటిపర్తి దివ్య, చౌదరి, జనసేవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

మద్దిపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌మోహన్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంగీత విభావరి



గానం చేస్తున్న వినోద్‌కుమార్

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దేవస్థాన ఆస్థాన విద్వాంసులు వీవీఎస్.వినోద్‌కుమార్‌చే నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల సంగీత విభావరి భక్తులను విశేషంగా అలరించింది. పలు అన్నమాచార్య కీర్తనలను ఆయన రసరమ్యంగా ఆలపించి భక్తుల కరతాళధ్వనులందుకున్నారు. ఇక ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజ, హోమాలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన బొల్లాపల్లి సుబ్రహ్మణ్య హనుమత్ కిషోర్, వెంకట ఫణిదీప్తి దంపతులు శ్రీవారికి మేల్‌ఛాట్ వస్త్రాలను సమర్పించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, సుశీలాదేవి, సీవీ.రామకృష్ణా రావు, ఆలూరు జైశంకర్, శ్రీనివాస చరణ్ పర్యవేక్షణ చేశారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శివరామయ్య

మద్దిపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శివరామయ్య అన్నారు. శుక్రవారం మద్దిపాడు ప్రధాన సెంటర్ ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహనం నడిపేందుకు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, కాలుష్య రహిత ధ్రువపత్రం ఉండాలన్నారు. బైకు వెనుక కూర్చున్న వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వచ్చే విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు.

బక్రీద్‌ను సామరస్యంగా జరుపుకోవాలి

మండలంలో బక్రీద్‌ను సామరస్యంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శివరామయ్య కోరారు. శుక్రవారం మద్దిపాడులోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన ముస్లిం పెద్దలను పిలిపించి వారితో మాట్లాడారు. పండుగను భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని కోరారు.

సారమెరిగి సాగు చేయాలి

» భూసార పరీక్షలు రైతులకు మేలు
» లోపాలు తెలుసుకుని ఎరువులు వాడాలి

త్రిపురాంతకం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఏ లోపం ఉందో తెలియకుండా ఇష్టానుసారంగా ఎరువులు వాడి రైతులు పంటనష్టం చవిచూస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వివిధ కార్యక్రమాల ద్వారా వ్యవసాయ పద్ధతులు తెలియజేస్తున్నా అందరిలో అవగాహన రాని కారణంగా వారికి తోచిన విధంగా యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ సరైన దిగుబడులు రాక, అధికంగా అప్పులు పెరిగి నేలను నిందిస్తూ రోదిస్తున్నారు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం భూసార పరీక్షలను చేపట్టి భూముల్లో ఏలోపం ఉందో ముందుగానే తెలుసుకుని అందుకు అవసరమైన ఎరువులు, పోషకాలను అందించడం ద్వారా లాభదాయకమైన వ్యవసాయం చేపట్టవచ్చని చెప్తున్నారు. దీంతో రైతులు తమ భూముల్లో సారమెరిగి సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

సేకరించిన మట్టినమూనా వివరాలు

మండలం	లక్ష్యం	సేకరించినవి
ఎర్రగొండపాలెం	1169	1039
పుల్లలచెరువు	1022	871
త్రిపురాంతకం	1169	981
దోర్నాల	673	589

భూసార పరీక్షలతో లాభాలు

భూమిలో సారాన్ని తెలుసుకుని ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటించవచ్చు. భూమిలో మొక్కకు కావలసిన పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. చౌడు భూముల్లో చౌడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకుని దాని నివారణకు చర్యలు తీసుకోవచ్చు. ఎరువులపై వృథా ఖర్చును తగ్గించుకుని అవసరమైన మేరకే ఎరువులు వాడి దిగుబడులు సాధించవచ్చు. అందుకే రైతులు ఒకే పొలంలో భూమి రంగు మార్పు ఉన్నప్పుడు, చౌడు కనిపించినప్పుడు, పంట దిగుబడుల్లో తేడాలు వచ్చినప్పుడు 5 ఎకరాలకు ఒక చోట మట్టిని తీసి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి.


మట్టి నమూనాలను సేకరిస్తున్న అధికారులు

సాగు నీటి పరీక్ష కూడా మేలు

పంటల దిగుబడి విషయంలో సాగు నీటి నాణ్యత కూడా ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సాగునీటిలో కూడా హైడ్రోజన్ ఘాడత, లవణాల సాంద్రత వంటి అంశాలు పంటల దిగుబడిపై ప్రభావం చూపుతాయి. కాబట్టి రైతులు నీటిలో వివిధ అంశాల పరిమాణాలను కూడా తెలుసుకునేందుకు బోరుబావి, కాలువనీటిని 1లీటరు నీటిని తీసి శుభ్రం చేసిన ప్లాస్టిక్ సీసాలో నింపి ప్రయోగశాలకు పంపాలి. అదేరోజు పరీక్ష ఫలితాలు ఇవ్వడం జరుగుతుంది. ఇందుకుగాను కేవలం రూ.15 మాత్రమే రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి అవకాశాలు వినియోగించుకుని రైతులు ఆరోగ్యకరమైన నేలలుగా భూములను తయారుచేసుకుని ఆరోగ్యవంతమైన పంటలు పండించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

ఎర్రగొండపాలెం వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో అధికారులు భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 4013 మంది రైతుల భూముల్లో మట్టి నమూనాలు సేకరణ లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 3480 నమూనాలు సేకరించడం జరిగిందని మిగిలిన వాటిని కూడా సేకరించి పరీక్షించటం జరుగుతుందని అధికారులు చెప్తున్నారు.

రైతుల్లో అవగాహన పెరగాలి

భూసార పరీక్షల పట్ల రైతుల్లో ఇంకా అవగాహన పెరగాలి. గతంలో కంటే ఇప్పుడు చాలా మంది పరీక్షలకు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ సూచనలు తెలుసుకుని మెరుగైన పద్ధతులు అవలంబిస్తున్నారు, భూసార పరీక్షలు చేయించుకుని భూమి స్వభావాన్ని బట్టి అవసరమైన ఎరువులు వినియోగించుకుంటే మంచిది.

- నీరజ, వ్యవసాయాధికారి, త్రిపురాంతకం


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలోని జగదాంబ మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరుణ్‌తేజ శర్మ, వేలూరి ఆంజనేయశర్మ మార్కండేశ్వరునికి, జగదాంబకు అభిషేకాలు నిర్వహించారు. జగదాంబ మాతకు విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

జేవీవీ పోస్టర్ల ఆవిష్కరణ

గిద్దలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం భాగస్వాములుగా చేరండి అనే పోస్టర్లను జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి, విశ్వరూపం, వెంకటేశ్వర్లు, స్ప్రింగ్ బోర్డు పాఠశాల డైరెక్టర్ చైతన్య పాల్గొన్నారు.


జార్జి కాలేజీ వద్ద సిబ్బందికి హాల్ టికెట్ చూపిస్తున్న అభ్యర్థులు

సజావుగా మెగా డీఎస్సీ

మార్కాపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం మార్కాపురం పరిధిలోని జార్జి ఇంజనీరింగ్ కళాశాల, కిట్స్ కళాశాలలో సజావుగా జరిగాయి. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో 120 మందికిగాను 106 మంది హాజరయ్యారు. 14 మంది హాజరుకాలేదని పరీక్షా కేంద్రం డీవో డీ రామచంద్రారెడ్డి తెలిపారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 100 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 89 మంది హాజరయ్యారని 11 మంది అభ్యర్థులు హాజరుకాలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల కుటుంబ సభ్యులు చంటిబిడ్డలను ఆడించుకుంటూ సందడిగా గడిపారు.

ప్రతిభా అవార్డులకు కంభం కాలేజీ విద్యార్థులు ఎంపిక

కంభం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్ష ఫలితాలలో ప్రతిభను చాటిన కంభం జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభుత్వ ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్ శుక్రవారం తెలిపారు. తమ్మినేని చాతుర్య (980/1000), బడిపాటి సతీష్ (929/1000) అవార్డును అందుకోనున్నారు. 9వ తేదీ సోమవారం ఉదయం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో ప్రశంసా పత్రం, రూ.20వేల నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

అనాథ పిల్లలను ఆదుకునేందుకే బంగారు బాల్యం

రాచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : అనాథ పిల్లలను ఆదుకునేందుకే బంగారు బాల్యం కార్యక్రమం అని జిల్లా నోడల్ అధికారి వి.గిరిధరశర్మ అన్నారు. జిల్లాలో అనాథ పిల్లలను గుర్తించి వారిని ఆదుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. మహిళా పోలీసులతో ప్రత్యేక సర్వే చేయించి పిల్లలను గుర్తిస్తారన్నారు. రాచర్ల మండలంలో ఈ కార్యక్రమం విజయవంతం అయినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య అన్నారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు మండలంలోని యడవల్లి గ్రామంలో గురువారం ఆయన పల్లెనిద్ర చేశారు. ఈసందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు వివిధ రకాలుగా మభ్యపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని, తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తున్నారని, వారికి ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ

రాచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రంగారెడ్డిపల్లె హైవే రోడ్డుపై శుక్రవారం జరిగింది. కనిగిరికి చెందిన నగిరికంటి నారాయణ, నగిరికంటి సాయి ద్విచక్ర వాహనంపై గిద్దలూరు వస్తూ రంరంగారెడ్డిపల్లె గ్రామ సమీపంలో రోడ్డు పక్క నిలిపి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. వారిని 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం పశువులకు శాపం..!

» షాక్‌తో మృతి చెందుతున్న గేదెలు
» తీవ్రంగా నష్టపోతున్న పోషకులు

కంభం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతున్నది. మార్కాపురం సబ్ డివిజన్‌లోని మండలాల్లో పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు చెందిన గేదెలు అకాలంగా మృత్యువాత పడుతున్నాయి. ఓ పక్క విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, మరో పక్క విద్యుత్ సిబ్బంది కొరత ఉండడంతో యుద్ధప్రాతిపదికన చేయాల్సిన పనులు చేయలేకపోతున్నారు. ఒక్క నెలలోనే విద్యుత్ షాక్‌తో రూ.20లక్షల విలువ చేసే 30కి పైగా గేదెలు మృత్యువాటపడ్డాయి. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న పోషకులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతవారం అర్ధవీడు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి 4 పాడిగేదెలు మృతి చెందాయి. అంతకముందు రావిపాడులో విద్యుత్ షాక్‌తో 2 పాడిగేదెలు, బేస్తవారపేట మండలం గలిజేరుగుళ్లలో 3 పాడిగేదెలు, మార్కాపురం మండలం తిప్పాయిపాలెంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగి కిందపడడంతో తీగను తగిలి 16 పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. ఇక కొమరోలు, రాచర్ల, బేస్తవారపేట, కంభం మండలాల్లో తెగిన విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి గేదెలు మృత్యువాత పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులకు, వర్షాలకు తీగలు తెగి పడినపుడు 24 గంటల్లోనే సరి చేయాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉన్నది.

ప్రమాదాలు జరగకుండా చూస్తాం

విద్యుత్ ఘాతంతో గేదెలు మృతి చెందుతున్న మాట వాస్తవమే. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడడం, ట్రాన్స్‌ఫార్మర్లు కిందికి ఉండడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరలా ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మృతిచెందిన గేదులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఏడీఈ


తిప్పాయిపాలెంలో హైటెన్షన్ వైరు తగిలి మృతిచెందిన 16 గేదెలు (ఫైల్)

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పెద్దారవీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతకతను అందిపుచ్చుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సం కల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం రైతులకు ఖరీఫ్ పంటలకు ముందస్తుగా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఉన్నతికి అమలు చేస్తున్న పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన, కిసాన్ మన్ ధన్ యోజ న, వ్యవసాయ సదుపాయాల నిధి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా మిరప, కంది, పెసర సాగుకు ముందు విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. భూ లోపాలను గుర్తించి, సారవంతం చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పురుగుమందుల పిచికారీకి డ్రోన్‌లను వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్ కోళ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బి.ప్రకాష్ మాట్లాడుతూ కోళ్ల రకాలు, వాటి పోషక విలువలు, వచ్చే వాధులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఆదిరెడ్డి, కేవీకే సిబ్బంది, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో శర్వాణి

మధ్యాహ్న భోజనంలో శుభ్రత పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే క్రమంలో సుచి, శుభ్రత పాటించాలని ఎంఈవో కె.శర్వాణి అన్నారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజన కార్మికులకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మెనూ ప్రకారం జాగ్రత్తగా భోజనం వండి ఒడ్డించాలన్నారు. విజయ వాహిణి చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు రంగారావు, దివ్యశ్రీ మాట్లాడుతూ వంటలో నాణ్యమైన పధార్థాలు వాడాలని, పరిసరాల పరిశుభ్రతగా ఉండేలా చూడాలని సూచించారు.

పెద్ద దోర్నాల : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో కొండలరావు అన్నారు. ఎంఈవో కార్యాలయంలో వంట చేసేవారు, సహాయకులకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, కూరగాయలు ఎప్పటికప్పుడు మార్కెట్ నుంచి తెప్పించుకోవాలని కుళ్లినవి వాడరాదని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, సీఆర్‌పీలు షణ్ముక్ నాయక్, ఎలియాజర్, హనీఫ్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత, శుభ్రత పాటించాలని ఎంపీడీవో బీ శ్రీనివాసరావు వంట పనివారలకు సూచించారు. విద్యావనరుల భవనంలో వంట పనివారలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆంజనేయులు, మల్లునాయక్ పాల్గొన్నారు.

బక్రీద్ నాడు గోవధ చేయొద్దు

మార్కాపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : : ముస్లింలు జంతువధ చట్టాన్ని అతిక్రమించ కుండా ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలు, ఒంటెలను వధిస్తే జంతు సంరక్షణ చట్టం ప్రకారం నేరమవుతుందని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్కాపురం : బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ పి.సుబ్బారావు అన్నారు. సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. సమావేశంలో మత పెద్దలు జామీయా మసీద్ ముతవల్లి మీర్జా సఫ్దర్ అలీ బేగ్, షేక్ మౌలాలి, షేక్ రజాక్, షేక్ కరిముల్లా, ముఫ్తీలు పాల్గొన్నారు.

మాస్కులు ధరించాలి

పొదిలి : బక్రీద్ రోజున ముస్లింలు తప్పనిసరిగా మాస్కులు ధరించి మసీదులకు వెళ్లాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రాచర్ల : బక్రీద్ పండుగ నాడు గోవధ చేయవద్దని రాచర్ల ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా గోవధ చేయాలని ఆలోచిస్తారేమోనని, ఆ ఆలోచన పూర్తిగా విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఉత్సాహంగా యోగాంధ్ర


విజేతలతో ఎంపీడీవో, ఎంఈవో

ఎర్రగొండపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం మహిళలకు యోగాంధ్ర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీడీవో బీ శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. 21 సచివాలయాల మహిళలు యోగాంధ్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లు నాయక్, జూనియర్ సహాయకులు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, ఉమాదేవి, ప్రవీణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : మండలంలోని యవ.పి చెరువు, నేకునాంబాద్ గ్రామ సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో సైతం యోగాంధ్రపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాగంట ఈశ్వర్, షాహబాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

గిద్దలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి సందర్భంగా అరుణాచలం దేవస్థానానికి గిద్దలూరు డిపో నుంచి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ రాత్రి 8గంటలకు గిద్దలూరు నుంచి సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, దారిలో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దేవాలయాలను దర్శించుకుని అరుణాచలం వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2500 చార్జీ అని తెలిపారు. వివరాలకు 9959225702, 9959225745 సంప్రదించాలని, భక్తులు వినియోగించుకోవాలని డీఎం తెలిపారు. కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

క్యాన్సర్, కళ్లు, గుండె సంబంధిత బాధితులకు పరీక్షలు

కంభం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ శనివారం ఉచిత క్యాన్సర్, కంటి, గుండె పరీక్షలకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహకులు పగిడి వెంకటరమణ, ఉదయగిరి మల్లికార్జునరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కంభంలోని ఉదయగిరి బృందావన కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10గంటలకు ఒంగోలు హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ వారిచే ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం, కర్నూలు శాంతిరామ్ ఐ హాస్పిటల్ వారిచే ఉచిత కంటి, గుండె చికిత్స ఉదయం సాయంత్రం 4గంటల వరకు పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పరీక్షలకు వచ్చే వారు హెల్త్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని, మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మూడు రోజులుగా శ్రీశ్రీ పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3వ రోజు శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, వీరాంజనేయ, నాగదేవత, నవగ్రహ, నందీశ్వర, శిఖర కలశ ధ్వజ ప్రతిష్ఠలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పసుపుల మల్లేశ్వరయ్య, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, గోడి ఓబులరెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి, నిమ్మకాయల శేఖర్ పాల్గొన్నారు.

శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజ స్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

పుల్లలచెరువు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు వెలసిన శ్రీ భవానీ శంకరస్వామి దేవాలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శుక్రవారం ఆలయ పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, గణపతి పూజ, యంత్ర ప్రతిష్ఠ, కలశ స్థాపన కార్యక్రమాలకు నిర్వహించారు. వేదపండితులు ఇడమకంటి జనార్దనశివాచార్యులు, వడ్లమాను గోవర్ధనాచార్యులు పూజలు నిర్వహించారు. శివం సీడ్స్ వారు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రశంసాపత్రాల అందజేత

గిద్దలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. చివరి రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శిక్షణ తరగతులకు హాజరై వివిధ అంశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేశారు. గంజి వీరయ్య, శివపురం ఆంజనేయులు దాతలుగా నగదు బహుమతులను అందచేశారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బీరం రామిరెడ్డి, గౌరవ సలహాదారులు రవీంద్రరెడ్డి, జేవీవీ నాయకులు స్వరూపారెడ్డి పాల్గొన్నారు.


సర్టిఫికెట్లను పొందిన చిన్నారులతో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి

ముఖాముఖి

ఇంటి పన్నులు చెల్లిస్తేనే పంచాయతీ అభివృద్ధి

పోట్ల కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి, దొనకొండ



ప్రశ్న: ఇంటి పన్నులు సకాలంలో వసూలవుతున్నాయా ?

జవాబు: గృహాలకు చెందిన పన్నులు దాదాపుగా చెల్లిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలకు చెందిన రూ.26 లక్షలు, యాజమాన్య సంస్థలకు చెందిన రూ.13 లక్షల బకాయిలు పేరుకుపోయాయి.

ప్ర: చెత్తసేకరణ చేస్తున్నారా ?

జ: ప్రతిరోజు చెత్త సేకరణ జరుగుతుంది. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తున్నారు.

ప్ర: జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇవ్వటంలేదనే ఆరోపణలు వస్తున్నాయి?

జ: పంచాయతీ రికార్డుల్లో నమోదయి ఉంటే రెండు గంటల్లో సర్టిఫికెట్ ఇస్తున్నాం. రికార్డుల్లో నమోదుకానివి, అందుబాటులో లేని రికార్డులకు సంబందించి నాన్ అవెలబులిటీ సర్టిఫికెట్ జారీ చేస్తున్నాం. ఆర్డీవో నుండి ప్రొసీడింగ్స్ అందగానే సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నాం.

ప్ర: తాగునీటి సమస్యకు చర్యలు చేపడుతున్నారా ?

జ: గ్రామ పంచాయతీ పరిధిలో ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ఇటీవల ఎనిమిది బోర్లు వేశాం. వారం రోజుల్లో మోటార్లు బిగించి ట్యాంకులు ఏర్పాటుచేసి నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నాం.

ఎడ్ల బలప్రదర్శన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

సీఎస్‌పురం(పామూరు) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురంలో శ్రీ రాచూరి పెద్దమ్మతల్లి తిరుణాళ్ల సందర్భంగా కాపునాయుళ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శుక్రవారం జరిగిన బహుతుల ప్రధానోత్సవంలో ప్రథమస్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన శేవవరెడ్డి సురేంద్రరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది.

కార్యక్రమంలో తిరుమలశెట్టి రామనాయుడు, తోట అశోక్‌నాయుడు, మన్నెపల్లి పెద్దన్న, పాలిశెట్టి సత్యం, తులబంధుల రవీంద్ర, పావళి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్ అకాల మృతి తీరనిలోటు

సీఎస్‌పురం(పామూరు) జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చేతికి అందివచ్చే సమయంలో ఒక్కగానొక్క కుమారుడు అకాలంగా మృతి చెందడం ఊసా కుటుంబానికి తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు హర్షవర్ధన్ (26) గురువారం రాత్రి మృతి చెందాడు.

విషయం తెలుసుకొన్న సీపీఎం నాయకులు వై.సిద్ధయ్య, జాలా అంజయ్య, పూనాటి ఆంజనేయులు, సయ్యద్ హనీఫ్, జీవీ కొండారెడ్డి, కె.ఆంజనేయులు, తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలరించిన అన్నమయ్య సంగీత విభావరి

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దేవస్థాన ఆస్థాన విద్వాంసులు వీవీఎస్.వినోద్‌కుమార్‌చే నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల సంగీత విభావరి భక్తులను విశేషంగా అలరించింది. పలు అన్నమాచార్య కీర్తనలను ఆయన రసరమ్యంగా ఆలపించి భక్తుల కరతాళధ్వనులందుకున్నారు.

ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో యాగశాల పూజ, హోమాలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన బొల్లాపల్లి సుబ్రహ్మణ్య హ నుమత్ కిషోర్, వెంకట ఫణిదీప్తి దంపతులు శ్రీవారికి మేల్‌ఛాట్ వస్త్రాలను సమర్పించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, సుశీలాదేవి, సీవీ.రామకృష్ణా రావు, ఆలూరు జైశంకర్, శ్రీనివాస చరణ్ పర్యవేక్షణ చేశారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివా సులురెడ్డి ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. శనివారం సాయంత్రం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కా ర్యక్రమాల్లో పాల్గొంటారు.

ఆదివారం ఉదయం 8గంటలకు తన కార్యాల యంలోను, మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుమల్లి మండలం చింతల పాలెం గ్రామంలో జరిగే కార్యక్రమంలో మాగుంట పాల్గొంటారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

» పూరిమెట్లలో పోటెత్తిన భక్తులు



పోలేరమ్మకు పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్లలో గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 9.15 గంటలకు వేద పండితులు, ప్రధానాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలో పోలేరమ్మ అమ్మవారు, అంకమ్మ, నాంచారమ్మ దేవతా మూర్తులను ప్రతిష్ఠించారు. పూరిమెట్ల గ్రామంతో పాటు ఉమామహేశ్వర అగ్రహారం, సుంకరవారిపాలెం, మారెళ్ళ, ఈదర, భీమవరం, తమ్మలూరు, పసుపుగల్లు, పులిపాడు, నూజెండ్లపల్లితో పాటు దర్శి, వినుకొండ, కురిచేడు, త్రిపురాంతకం, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ బంకా నాగిరెడ్డి, సుంకర బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పోలేరమ్మ, అంకమ్మ, నాంచారమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందించారు. రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు, శంకరాపురం సర్పంచ్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



పామూరులో పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠ

దర్శి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రోబనపల్లిలో శివపార్వతులు, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొగ్గవరపు సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, దర్శి-2 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రామిరెడ్డి వెలిగొండారెడ్డి, గొర్రె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజరోహణ పూజ హారతులు

పామూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీమదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భగంగా రెండోరోజు శుక్రవారం ధ్వజరోహణ, గరుడ ప్రసాదం, అగ్నిప్రతిష్ఠ సహస్రనామపూజ హారతుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివార్లకు ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణం సత్యగోపాలబాబు ఆధ్వర్యంలో విశేష పూజలు, హారతులు, ఆలయ ప్రాంగణంలో గుడి చుట్టూ రథోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాత్రి స్వామి వార్లకు శేషవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, తిరివీధి జనార్దనరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహారుద్రపీఠం వార్షికోత్సవం

పీసీపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడులో ఈనెల 7,8తేదీలలో రెండు రోజులపాటు మహారుద్రపీఠం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు రుద్రపీఠ నిర్వాహకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. 7వ తేదీ గణపతి పూజ, పుణ్యావచనం, నవగ్రహపూజ, మండపారాధనతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

8వ తేదీ గణపతి పూజ, నాగప్రతిష్ఠ, బింబశుద్ధి, తదితర పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నట్టు పలుకూరి సుబ్బారావు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

» ముస్తాబైన మసీదులు



విద్యుత్ వెలుగుల్లో మసీదు

పామూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు జరుపుకుంటున్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం తన ఏకైక కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్ జిబహ్ చేయడానికి ప్రయత్నించిన సంఘటన ద్వారానే బక్రీద్ పండుగ వచ్చింది. వృద్ధాప్యంలో తనకు లేకలేక కలిగిన ఏకైక సంతానం ఇస్మాయిల్‌ను జిబహ్ చేస్తున్నట్లు కలగంటారు. కలలో చూసిన దృశ్యాన్ని దేవుని ఆజ్ఞగా భావించి తన తొమ్మిదేళ్ల కుమారుడుని దేవుని ప్రసన్నత కోసం జిబహ్ కోసం సంసిద్ధమవుతారు. ఆయన త్యాగరీతిని మెచ్చుకొని ఇస్మాయిల్ మెడపై ఉంచిన కత్తిని తెగకుండా చేస్తారు. ఆ తరువాత అదృశ్యవాణి ద్వారా ఇబ్రహీం స్థానంలో పొట్టేలును బలి ఇవ్వమని ఆదేశిస్తారు. ఎంతటి ప్రీతికరమైన వస్తువులైనా దైవమార్గంలో త్యాగం చేయాలని ఖుర్బాని పండుగ ద్వారా మనకు ప్రతిఏటా గుర్తుచేస్తున్నది. మనిషి తనకిష్టమైన వస్తువుల్ని దైవమార్గంలో సమర్పిస్తే దానిని త్యాగం అంటారు. హజ్‌యాత్రకు వెళ్లినా, వెళ్లలేకపోయిన స్తోమత కలిగిన ప్రతి ముస్లిం ఖుర్బాని ఇవ్వాలి. రంజాన్ పండుగ సమయంలో నమాజ్‌కు ముందు ఫిత్రదానం చేయడం ఎంత ముఖ్యమో బక్రీద్ లో నమాజ్ తరువాత ఖుర్బాని ఇవ్వడం అంతే ముఖ్యమని మత పెద్దలు తెలుపుతున్నారు.

త్యాగానికి నిదర్శమైన బక్రీద్ పండుగను ముస్లింలు ఆనందోత్సహాల నడుమ జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈసందర్భంగా పామూరు, సీఎస్‌పురం మండల కేంద్రాలతో పాటు, మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న ఈద్గా మైదానాలలో ప్రార్థనల కోసం ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈద్గా మైదానంలో ఉదయం 7 గంటలకే సామూహిక ప్రార్థనలు ప్రారంభమవు తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

దొనకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది అందించే ప్రతిష్ఠాత్మకమైన ప్రతిభా అవార్డులకు మండలంలోని ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఉత్తర్వులు అందాయి. దొనకొండ విశ్వభారతి పాఠశాలకు చెందిన ఎన్‌వీ సుబ్బారెడ్డి, పి.నందిని, కేవీ సుధీర్, షేక్ మహమ్మద్ షాఅఖ్లాక్, బి.మహేశ్వర్‌నాయక్, తెల్లబాడు జడ్పీ పాఠశాలకు చెందిన ఆర్.సౌమ్యాబ్లెస్సీలు ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం రూ.20వేలు నగదు, మెడల్, సర్టిఫికెట్ అందజేస్తుంది.

తాళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డులకు మండలంలోని నాలుగు పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయినట్లు ఎంఈవో జి.సుబ్బయ్య, ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. తాళ్లూరు శ్రీసరస్వతీ హైస్కూల్‌కు చెందిన చల్లా రేవతి, బి.ఈశ్వర్‌నాయక్, ఏబీసీ హైస్కూల్‌కు చెందిన ఐ.స్నేహితారెడ్డి, అనపర్తి మైకేల్, తూర్పుగంగవరం గీతాంజలి హైస్కూల్‌కు చెందిన కె.మధుశివప్రసాద్, శారదాహైస్కూల్‌కు చెందిన షేక్ మల్లిక్ ఎంపికయినట్లు తెలిపారు.

ఉపకార వేతనాలకు ఐదుగురు ఎంపిక

సీఎస్‌పురం(పామూరు), జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని సి.నాగులారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. దుగ్గిరెడ్డి మంజూష, పల్లా రామకృష్ణ, గుమ్మభవ్యశ్రీ, ఏ.ఘన ప్రసన్న జాతీయ ఉపకార వేతనాలు(ఎన్ఎంఎంఎస్) ఎంపికైనట్టు హెచ్ఎం డి.డేవిడ్ తెలిపారు.

తాళ్లూరు: మండలంలోని లక్కవరం జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన బాలికలు నేషనల్ మెరిట్‌మిన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయినట్లు హెచ్ఎం అనంతనాభరావు శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థినులు ఎం.స్నేహ, టి.శిరీష, ఎం.ఇందిర, బి.మాధురిలు ఉపకాత వేతనాలకు ఎంపికయినట్లు తెలిపారు. నాలుగుసంవత్సరాల పాటు కేంద్రప్రభుత్వం వీరికి ఉపకార వేతనం అందజేస్తుందన్నారు. ప్రతిభ కనపరిచి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి గిద్దలూరు వెళ్తున్న కారు, దర్శి నుంచి తూర్పుకంభంపాడు వెళ్తున్న మినీ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో కారులో ఉన్న మహిళకు గాయాలు కాగా, లారీ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఎస్ఐ కె.కమలాకర్‌కు సమాచారం అందించటంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గాయపడిన మహిళను ఒంగోలుకు తీసుకెళ్లారు. లారీ డ్రైవర్‌కు మాత్రం చేతికి స్వల్ప గాయమైంది.



దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న ఎస్ఐ కమలాకర్ తదితరులు

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

రాచర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకుని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రంగారెడ్డిపల్లె హైవే రోడ్డుపై శుక్రవారం జరిగింది. కనిగిరికి చెందిన నగిరికంటి నారాయణ, నగిరికంటి సాయి ద్విచక్ర వాహనంపై గిద్దలూరు వస్తూ రంరంగారెడ్డిపల్లె గ్రామసమీపంలో రోడ్డు పక్క నిలిపి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడ్డారు. 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై కోటేశ్వరరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుమతుల కో సం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ త మీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరే ట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు 449 క్లైయిమ్స్‌లకు రూ.7.22 కోట్లు మంజూరు చేశారు. సింగిల్ డెస్క్ పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసిన వివిధ శా ఖలకు చెందిన 137 వినతులకు 110 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం బి.శ్రీనివాసరావు, ఏపీసీపీ డీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, నాబార్డు ఏజీఎం రవికుమార్, ఏపీఐఐసీ పొల్యూషన్ కంట్రోలు బోర్డు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టేబుల్ బుక్ అందజేత

జిల్లాలో నాబార్డు అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల విజయాలను ప్రతిబింబించే కాఫీ టేబుల్ బుక్‌లెట్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారి యాకు జిల్లా అభివృద్ధి అధికారి(డీడీఎం) రవి కుమార్ అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలె క్టర్ చాంబర్‌లో శుక్రవారం ఈ బుక్‌లెట్‌ను అం దించారు. ఇందులో రైతులు, మహిళలు నాబార్డు ప్రాజెక్టుల ద్వారా సాధించిన విజయాలు, వారి జీవనోపాధిలో వచ్చిన మార్పులు, సమాజంపై పడిన సానుకూల ప్రభావాలను వివరించారు. నాబార్డు తన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో అమలు చేసిన కార్యక్రమాలను అందులో ప్రచురించినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

దొనకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు ముందే రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని చందవరం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల్లో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈపంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల వివరాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులకు 50శాతం సబ్సిడీతో పచ్చరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన అక్రమ మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

దొనకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో 15 అక్రమ మద్యం సీసాలను దర్శి ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు.. దొనకొండ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వఉన్న 15 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వీఆర్ సత్యనారాయణరావు, సిబ్బంది ఖాశింపీరా, సీహెచ్ సాయిబాబా, ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నట్లు తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అక్రమ మద్యం విక్రయాలు జరిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

దొనకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 9న ర్యాలీ నిర్వహించాలని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి యోగా చేయటంవల్ల కలిగే ఉపయోగాలు, యోగా ఆవశ్యకత, యోగా డే ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించాలన్నారు. గ్రామంలోని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులను సమన్వయపర్చుకొని ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

పామూరు: ఈనెల 21 జరగనున్న అంతర్జాతీయ యోగాడే సందర్భంగా సోమ వారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మాస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో యోగా ప్రాముఖ్యతను తెలియ జేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

సారమెరిగి సాగు చేయాలి

» భూసార పరీక్షలు రైతులకు మేలు

» లోపాలు తెలుసుకుని ఎరువులు వాడాలి

త్రిపురాంతకం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూమిలో ఏ లోపం ఉందో తెలియకుండా ఇష్టానుసారంగా ఎరువులు వాడి రైతులు పంటనష్టం చవిచూస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు వివిధ కార్యక్రమాల ద్వారా వ్యవసాయ పద్ధతులు తెలియజేస్తున్నా అందరిలో అవగాహన రాని కారణంగా వారికి తోచిన విధంగా యాజమాన్య పద్ధతులు అవలంబిస్తూ సరైన దిగుబడులు రాక, అధికంగా అప్పులు పెరిగి నేలను నిం దిస్తూ రోదిస్తున్నారు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం భూసార పరీక్షలను చేపట్టి భూముల్లో ఏలోపం ఉందో ముందుగానే తెలుసుకుని అందుకు అవసరమైన ఎరువులు, పోషకాలను అందించడం ద్వారా లాభదాయకమైన వ్యవసాయం చేపట్టవచ్చని చెప్తున్నారు. దీంతో రైతులు తమ భూముల్లో సారమెరిగి సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

భూసార పరీక్షలతో లాభాలు

భూమిలో సారాన్ని తెలుసుకుని ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటించవచ్చు. భూమిలో మొక్కకు కావలసిన పోషక పదార్థాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. చౌడు భూముల్లో చౌడు ఏ స్థాయిలో ఉందో తెలుసుకుని దాని నివారణకు చర్యలు తీసుకోవచ్చు. ఎరువులపై వృథా ఖర్చును తగ్గించుకుని అవసరమైన మేరకే ఎరువులు వాడి దిగుబడులు సాధించవచ్చు. అందుకే రైతులు ఒకే పొలంలో భూమి రంగు మార్పు ఉన్నప్పుడు, చౌడు కనిపించినప్పుడు, పంట దిగుబడుల్లో తేడాలు వచ్చినప్పుడు 5 ఎకరాలకు ఒక చోట మట్టిని తీసి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి.

సాగు నీటి పరీక్ష కూడా మేలు


పంటల దిగుబడి విషయంలో సాగు నీటి నాణ్యత కూడా ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. సాగునీటిలో కూడా హైడ్రోజన్ ఘాడత, లవణాల సాంద్రత వంటి అంశాలు పంటల దిగుబడిపై ప్రభావం చూపుతాయి. కాబట్టి రైతులు నీటిలో వివిధ అంశాల పరిమాణాలను కూడా తెలుసుకునేందుకు బోరుబావి, కాలువ నీటిని 1లీటరు నీటిని తీసి శుభ్రం చేసిన ప్లాస్టిక్ సీసాలో నింపి ప్రయోగశాలకు పంపాలి. అదేరోజు పరీక్ష ఫలితాలు ఇవ్వడం జరుగుతుంది. ఇందుకుగాను కేవలం రూ.15 మాత్రమే రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి అవకాశాలు వినియోగించుకుని రైతులు ఆరోగ్యకరమైన నేలలుగా భూములను తయారుచేసుకుని ఆరోగ్యవంతమైన పంటలు పండించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

8న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జైశ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ద్రావిడదేశం వి.కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల నుంచి ఒక్కొక్క మండలంలో మొదటి బహుమతిగా రూ.3వేలు, రెండో బహుమతిగా రూ.2వేలు, మూడో బహుమతిగా రూ.1000 నగదు బహుమతులతో పాటు బ్యాగులు, ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేస్తామన్నారు. శ్రీసాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో జీఎస్టీ, కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ గోసు రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 500 పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజారోగ్య భద్రత కోసం సర్వే


సంతనూతలపాడు, జూన్6(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజల ఆరోగ్య భద్రతకు వైద్యఆరోగ్యశాఖ ఎన్‌సీడీ-సీడీ 3.0 సర్వేను నిర్వహిస్తోందని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటా జరుగుతున్న సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏదైన సమస్య ఉంటే ముందుగానే గుర్తించి దానికి వైద్య సేవలు అందించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డి.సురేష్‌కుమార్, నబీవలీ, వైద్యులు హరిణి, ప్రశాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

7-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	27
తెనాలి	40	27
నరసరావుపేట	39	27
బాపట్ల	39	28
రెంటచింతల	40	29
చీరాల	39	28

గత పాపం అన్నదాతకు శాపం!




- అన్నదాత సుఖీభవ పథకానికి సాంకేతిక చిక్కులు
- వైసీపీ అస్తవ్యస్త రీసర్వేతో రైతుల లబోదిబో
- తహసీల్దార్ లాగిన్‌లకు వేలల్లో రెవెన్యూ రికార్డులు
- లబ్ధికి దూరం చేయొద్దంటూ అన్నదాతల వేడుకోలు
- తుది నిర్ణయంపై యంత్రాంగం తర్జనభర్జన

గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ ప్రస్తుతం రైతులకు శాపంగా మారుతోంది. ఒక నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఇష్టారీతిన భూ రికార్డులను ఆన్‌లైన్ చేయడంతో వాటిని ఉన్న పళంగా సరిచేసుకోలేక రైతు లు లబోదిబోమంటున్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసే కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఆన్‌లైన్ రికార్డులన్నీ యంత్రాంగం వద్దకు చేరా యి. వేల సంఖ్యలో రెవెన్యూ చిక్కులు కనబడ డంతో వాటిని తహసీల్దార్ లాగిన్‌లకు వెరిఫి కేషన్ కోసం పంపించారు. ఇలా పంపించిన వాటిలో దాదాపు 70 శాతం గత ప్రభుత్వం చేసిన రీసర్వే తప్పిదాలేనని తెలుస్తోంది. రెవెన్యూ చిక్కులు తేలకుండా అన్న దాత సుఖీభవ పథకం అర్హుల జాబితా లో చేర్చడంపై తుది నిర్ణయం తీసుకోలేమనేది అధికారుల వాదనగా ఉంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ ప్రకారం సాగు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానిలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని వ్యవసాయశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పీఎం కిసాన్ కింద కేంద్రం మూడు విడతల్లో ఇచ్చే రూ.6 వేలు సాయానికి మరో రూ.14 వేలు కలిపి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు సాయం అందించనుంది. ఈ నెల రెండో వారంలోనే ఈ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

మూడు జిల్లాల్లో 68 వేలు పెండింగ్

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టే క్రమంలో ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉన్న రికార్డులను మరోసారి పరిశీలించి జాబితా సిద్ధం చేశారు. బాపట్ల జిల్లాలో మొత్తం 3,41,974 ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి 2,97,630 మందిని అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీటి విషయంలో కూడా వ్యవసాయ కమిషనరేట్ (మిగతా 6వ పేజీలో)



యోగాసనంలో కలెక్టర్ జె.వెంకటమురళి

యోగాతో మానసిక సమతుల్యత

- సాధన చేస్తే ప్రయోజనమన్న కలెక్టర్
- సూర్యలంక తీరంలోని నగరవనంలో యోగాంధ్ర

బాపట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో యోగాను నిత్యం సాధన చేస్తే వారి శారీరక ఆరోగ్యం, మానసికస్థితి సమతుల్యతతో ఉంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల మండలం సూర్యలంక తీరంలోని నగరవనంలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనను నిత్య జీవితంలో ఓ భాగంగా మార్చుకుంటే ఎంతో ప్రయోజనకరమన్నారు. యోగా ప్రక్రియ ఒక్క భారతదేశానికే పరిమితం కాలేదని అనేక దేశాలు అకర్షితులయ్యాయన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు 172 దేశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. జూన్ 21న రామాపురం, సూర్యలంక బీచ్‌ల్లో వేలాది మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, ఆర్డీవో పి.గ్లోరియా, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆసనాలు వేస్తున్న అధికారులు



ఉచిత బియ్యం.. రూ.13

- బహిరంగంగా షాపుల వద్దే కొనుగోలు
- బ్లాక్ మార్కెటింగ్ మొదలు పెట్టిన డీలర్లు
- కేజీకి రూ.4 లాభంతో మాఫియాకి చేర వేస్తున్న వైనం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరఫరా వాహనాలతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంది.. అక్రమాలను అడ్డుకోవాలి.. అని కూటమి ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను ప్రవేశపెట్టగా రేషన్ అక్రమాలు యథావిధిగానే కొనసాగుతున్నాయి. అయితే గతంలో ఎండీయూ వాహనదారులు పాత్రను ఇప్పుడు రేషన్ డీలర్లు తీసుకున్నారు. గతంలో ఎండీయూ వాహనదారులు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులతో సరిపెట్టగా అదే పంథాను ఇప్పుడు పలు ప్రాంతాల్లోని డీలర్లు చేస్తున్నారు. అయితే గతంలో కార్డుదారులకు రేషన్‌వాహనదారులు రూ.8 నుంచి రూ.10 వరకు ఇవ్వగా ఇప్పుడు డీలర్లు ఆ మొత్తాన్ని రూ.13 కు పెంచారు. ఐదు రోజుల్లోనే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలువురు రేషన్ డీలర్లు బ్లాక్ మార్కెటింగ్‌ని మొదలు పెట్టేశారు. షాపుల వద్ద ఎలాంటి బెదురు లేకుం డా బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కేజీకి రూ.13 చొప్పున లెక్కకట్టి కార్డుదారులతో వేలిముద్ర వేయించుకుని నగదు ఇస్తున్నారు. సాయంత్రానికి అన్ని లెక్కలు సరిచూసుకుని మాఫియా పంపించే వాహనంలో బియ్యాన్ని తరలిస్తున్నారు. కేజీకి రూ.4 లాభం చూసుకుని మాఫియాకి రూ.17కి విక్రయిస్తున్నారు. కాగా రేషన్ మాఫియాలోని వ్యక్తులు ఆ బియ్యాన్ని మిల్లర్లకు ఇచ్చి మరో రూ.4 మిగిల్చుకుంటున్నారని సమాచారం.

తూతూమంత్రంగా తనిఖీలు

పౌరసరఫరాల అధికారులను నిత్యం షాపులను తనిఖీ చేసి నిల్వలు సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించినప్పటికీ ఒక్కో సీఎస్‌డీటీ కింద వందకు పైగా షాపులు ఉండటంతో వాళ్లు సరిగా చూడలేకపోతున్నారు. డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభమై ఐదు రోజులు పూర్తి కాగా దాదాపుగా 56.74 శాతం పంపిణీ పూర్తి అయింది. ఇందులో కనీసం 20 శాతం ఇప్పటికే నల్లబజారుకు తరలి నట్లు ఒక అంచనా. తనిఖీలు తూతూ మంత్రంగానే ఉం టుండటంతోనే డీలర్ల అక్రమాలు వెలుగుచూడటంలేదని తెలుస్తోంది. ఈ ఐదు రోజుల్లో కనీసం ఒక్క కేసు అయినా నమోదు చేసిన దాఖలాలు లేవు. గుంటూరు జిల్లాలో 972 దుకాణాలు ఉండగా 5 లక్షల 89 వేల 531 కార్డులున్నాయి. ఇప్పటివరకు 3,31,562 కార్డుదారులకు పంపిణీ చేసి రాష్ట్రంలో 24వ స్థానం అంటే కింది నుంచి మూడులో ఉన్న ది. బాపట్ల జిల్లా 62.32 శాతం పంపిణీతో 15వ స్థానం, 68.99 శాతంతో పల్నాడు జిల్లా మూడో స్థానంలో ఉంది.

షైనింగ్ స్టార్స్.. 461 మంది

గుంటూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్‌స్టార్ అవార్డులు అందజేయనున్నారు. అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 461 మంది ఎంపికైనట్లు విద్యాశాఖ ప్రకటించింది. గుంటూరు జిల్లా నుంచి 112 మంది, బాపట్ల జిల్లా నుంచి 185 మంది, పల్నాడు జిల్లా నుంచి 164 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాల బాలికలు, సామాజిక వర్గాల వారీగా విద్యార్థులను ఎంపిక చేశారు. త్వరలో విద్యామంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో షైనింగ్‌స్టార్స్‌గా ఎంపికైన 461 మందికి నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక అందజేస్తారని విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికే.. ప్రజావేదిక

- రేపల్లెలో 68 అర్జీలు స్వీకరించిన మంత్రి అనగాని

రేపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారి నుంచి ఫిర్యాదులను మంత్రి స్వీకరించారు. రోడ్లు, డ్రెయి నేజీ, తాగునీటి సమస్యలు పరి ష్కరించాలని ఇసుకపల్లిలోని 18వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసులు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 68 ఫిర్యాదులు అందగా వాటిలో ఎక్కువగా భూ సమస్యలే ఉన్నాయ న్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, నివేశన స్థలాలు, గృహాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని తెలిపారు.



అర్జీలను పరిశీలిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

నల్లబర్లీ పొగాకంతా కొనుగోలు చేస్తాం

- రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధం
- మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీసామూన్
- కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎండీ

పర్చూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు నిల్వలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) మనజీర్ జిలానీసామూన్ తెలిపారు. శుక్రవారం పర్చూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని గిడ్డంగులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు లేక ఇబ్బంది పడుతున్న నల్లబర్లీ పొగాకు రైతులను అదుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు సిద్ధమైందన్నారు. చివరి రైతు వరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల సంక్షేమం కోసం హెచ్‌డీబీఆర్(నల్లబర్లీ) పొగాకును ప్రభుత్వం కొను గోలు చేస్తుందన్నారు. నాణ్యతను ప్రామాణికంగా తీసుకుని గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఇందుకు రైతులు కూడా సహకరించాలన్నారు. పొగాకు నిల్వలను దృష్టిలో పెట్టుకుని మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేపడుతున్న పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలించారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియా, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, తహసీల్దారు బ్రహ్మయ్య ఐటీసీ ప్రతినిధి కల్యాణరామిరెడ్డి, ఏఎంసీ స్పెషల్ కార్యదర్శి దేవరకొండ తిరుపతి రాయుడు, అసిస్టెంట్ కార్యదర్శి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, కొల్లా శ్రీనివాసరావు, పోట్రు శోభన్, అడగడ్డ వెంకటేశ్వర్లు, అడగడ్డ రామకృష్ణ, వ్యవ సాయ అధికారులు పాల్గొన్నారు.



ఏఎంసీ గోడౌన్‌లో పొగాకు గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్, ఐటీసీ అధికారులు

మద్యం తాగించి.. మత్తులో చంపారు

- వివాహిత హత్య కేసులో నిందితుల అరెస్టు
- కడవకుదురులో చంపి.. పందిళ్లపల్లిలో పూడ్చారు

వేటపాలెం(చీరాల), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్యకు గురైన ప్రమీల కేసును పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి వివరాలను శుక్రవారం డీఎస్పీ మొయిన్ విలేకర్లకు వివరించారు. నాగులుప్పలపాడుకు చెందిన ప్రమీల అలియాస్ మౌనిక, అలియాస్ దీపికకు ఏడేళ్ల క్రితం వేటపాలెం మండలం వినాయకపురానికి చెందిన ఏడుకొండలుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబ సమస్యల నేపథ్యంలో భర్త ఆత్మహత్య చేసుకోగా ఆమె పిల్లలతో నాగులుప్పలపాడులో నివాసం ఉంటుంది. ఈ క్రమంలోనే నిజాంపట్నానికి చెంది ప్రస్తుతం నాగులుప్పలపాడులో నివాసముంటున్న ఈగ వెంకటేశ్వర్లుతో ప్రమీలకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆయన బావమరిది సైకం నాగరాజుతో కూడా ఆమె సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో కక్షపెంచుకున్న వెంకటేశ్వర్లు, నాగరాజులు ప్రమీలను నమ్మించి ఏప్రిల్ 30న రాత్రి కడవకుదురు శివారులోకి పిలిపించారు. ఆమెకు కూడా ఫూటుగా మద్యం తాగించి బీరు సీసాలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం అక్కడ మృతదేహాన్ని పూడ్చేందుకు నేల సహకరించక పోవడంతో బ్యానర్‌లో మృతదేహాన్ని చుట్టుకుని ద్విచక్ర వాహనంపై మూడు కిలోమీటర్ల దూరంలోని పందిళ్లపల్లి నాగవరపమ్మ గుడి సమీపంలోని వెదురుబొంగుల తోట వద్దకు తెచ్చి పూడ్చిపెట్టారు. కుక్కలు వాసనలు పట్టకుండా సమాధిపై ఆకులతో మంటలు వేశారు. అయితే ఆ సమీపంలోనే ఓ గుర్తు తెలియని మృతదేహం లభించడంతో ఆ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు ప్రమీల హత్య విషయం వెలుగుచూసింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, నాగరాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ శేషగిరిరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందికి ఎస్పీ తుషార్ డూడీ రివార్డులు అందించారు.



ప్రమీల (పాత చిత్రం)



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎండీ మొయిన్



నిందితుడు వెంకటేశ్వర్లు

నాలుగు నెలలకు పైగా కాలయాపన

పోల్ టెండర్లలో కిరికిరి

- ఇప్పటి వరకు పిన్నెల్లి అనుచరుడే నిర్వహణ
- వైసీపీ హయాంలో టెండర్లు లేకుండానే దారాదత్తం
- టెండర్ దారులను పక్కన పెట్టి మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఏడాది అవుతుంది. అయినా కొన్ని శాఖల్లో అధికారుల తీరు మారలేదు. విద్యుత్ శాఖలో ఇప్పటికీ వైసీపీ హవా కొనసాగుతోంది. కొందరు వైసీపీ వారికి వంతపాడుతూ వారికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనంగా గుంటూరులోని విద్యుత్ శాఖకు సంబంధించి పోల్‌సెంటర్ నిర్వహణ ఉంది. గుంటూరు లోని పోల్ సెంటర్(విద్యుత్ స్థంభాలు తయారీ కేంద్రం) బాధ్యతలు అప్పగించేందుకు గత ఏడాది డిసెంబరు 28న టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న వారు విద్యుత్ శాఖకు రెండేళ్ల పోల్స్ తయారు చేసి ఇవ్వాలి. టెండర్లు దాఖలకు ఈ ఏడాది జనవరి 17 వరకు గడువు ఇచ్చారు. జనవరి 20న ప్రైస్ బిడ్స్ తెరిచి టెండర్ ఖరారు చేయాలని నిర్ణయించారు. అయితే ఇంత వరకు ఆ టెండర్లు వెలుగు చూడలేదు. అప్పటి నుంచి టెండర్ ఫీజుగా రూ.16 లక్షలు చెల్లించిన వారు ఏమి తేలక లబోదిబోమంటున్నారు. గత వైసీపీ హయాంలో పోల్ సెంటర్ దక్కించుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడు నిర్వహించాడు. వాస్తవానికి అతడు నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో టెండర్‌ను దక్కించుకున్నాడన్న ఆరోపణలున్నాయి. అయితే అప్పటికి అధికారు లు మౌనంగా ఉన్నా.. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే కొన సాగుతున్నాడు. ఆ తర్వాత విమర్శలు రావడంతో అతడ్ని తప్పు కోమన్నట్లుగా అధికారులు టెండర్ల పేరుతో హడావుడి చేశారు. అయి తే అతడు తప్పుకోకుండా అధికారుల సూచనలతోనే కోర్టుకు వెళ్లి టెండర్లు ప్రక్రియ కొద్ది రోజులు నిలిచిపోయేలా చేశాడని సమాచా రం. ఉన్నతాధికారుల ఒత్తిడితో కోర్టు కేసు ఉప సంహరింపచేసి అం దుకు నజరానాగా పోల్ సెంటర్‌లో ఉన్న స్టాక్‌ను మరికొంత కాలం అతడికే సరఫరా చేసే అవకాశం కల్పించారు. కోర్టు కేసు తొలగి పోవడంతో టెండర్లు తెరిచి అర్హులను (మిగతా 6వ పేజీలో)



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

బాపట్ల, చీరాల కేంద్రాల వద్ద అభ్యర్థుల బారులు

గుంటూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ప్రారంభమయ్యాయి. నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు డీఈవో రేణుక తెలిపారు. మూడు జిల్లా పరిధిలో మొత్తం 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా బాపట్ల జిల్లా పరిధిలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజి కేంద్రాలకు తొలి రోజు నిర్దేశించిన కేంద్రాలకు అభ్యర్థులు చేరుకున్నారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహించారు. అనేక కేంద్రాల్లో అభ్యర్థులు నిర్దేశించిన సమయం కంటే దాదాపు గంట ముందుగా చేరుకున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించమని ముందుగానే స్పష్టం చేయడంతో అభ్యర్థులు అప్రమత్తమయ్యారు.

అవీ..ఇవీ..

ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

బల్లికురవ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షల్లో ప్రతిభ చాటారు. జిల్లాస్థాయిలో మెదటి మూడు స్థానాలలో విద్యార్థులు నిలిచారని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. రెండు మాసాల క్రితం నిర్వహించిన పరీక్షలను విద్యార్థులు రాయగా, తమ పాఠశాల విద్యార్థులు 10 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో జిల్లా స్థాయిలో మెదటి స్థానంను బొంతు భగత్, రెండో స్థానంలో లక్ష్మీ అమూల్య, మూడో స్థానంలో షేక్ మస్తాన్‌లు నిలిచారన్నారు. వారికి మెరిట్ స్కారల్ షిప్ ద్వారా నగదు అందుతుందని హెచ్ఎం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో రమేష్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

● మార్టూరు : స్థానికంగా శ్రీహర్షిణి విద్యాసంస్థలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 988 మార్కు లను సాధించిన షేక్ షీరున్నిసా, 10వ తరగతిలో 592 మార్కులు సాధించిన జే.భానుప్రత్యూషలను ప్రతిభ పురస్కారాలకు ఎంపిక చేశారన్నారు. వారిద్దరిని కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

● పంగులూరు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పదోతరగతి పరీక్షలలో సత్తాచాటి ప్రభుత్వ ప్రతిభ పురస్కారాలకు ఎంపికయ్యారు. 2024 -2025 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని 590 మార్కులు సాధించి అవార్డుకు ఎంపికకాగా, ఇదే పాఠశాలకు చెందిన మణిదీపకరెడ్డి 586 మార్కులు సాధించి అవార్డు కైవసం చేసుకున్నారు. బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన భవనం దివ్య 585 మార్కులు సాధించి అవార్డు కైవసం చేసుకోగా, ఇదే పాఠశాలకు చెందిన మురళీకృష్ణ సాయిరాం 580 మార్కులు సాధించి అవార్డు దక్కించుకున్నారు. కొండమంజులూరు ఉన్న పాఠశాల విద్యార్థిని ఎండ్లూరి సుయన్‌శ్రీ 578 మార్కులు సాధించి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ ప్రతిభ పురస్కారానికి పురస్కారానికి ఎంపికైన విద్యార్థులను నాగభూషణం, ఎంఈవో-2 వీరాంజనేయులు అభినందించారు.

● ఇంకొల్లు : ఏపి ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారానికి ఇంకొల్లు ఆదర్శ హైస్కూల్ విద్యార్థిని షేక్ షబానా ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 600 మార్కులకు 593 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రదమస్థానం,జిల్లా స్థాయిలో 4వస్థానంలో నిలిచిందన్నారు.విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను విజయభాస్కర్ అభినందించారు. ఎంపికైన విద్యార్థిని షబానాను ఉపాధ్యాయులు అభినందించారు.

● పర్చూరు : ప్రతిభా పురుస్కారానికి మండలంలోని ఆయా పాఠశాలల నుండి పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన నల్లగొర్ల హర్షిత 596, షేక్.మహ్మద్ సుహేల్ 595, త్రిపురనేని నరేంద్రబాబు 593, తేళ్ళ పునీత్ సాయి 592, నెల్లూరి మహాలక్ష్మి 592, పేరం దుర్గాభరత్ 591, గద్దల సహితి 586లకు ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు.

● మేదరమెట్ల : కేంద్ర ప్రభుత్వం 2024వ సంవత్సరానికి నేషనల్ మీన్స్ కం మెరిట్ పరీక్ష ద్వారా రావినూతల హైస్కూల్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు ఎంపికైన సీహెచ్ మధు వర్షిత, డి.స్టెల్లా నైటింగ్‌యేల్‌ను శుక్రవారం పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, పాఠశాల కమిటి చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు చెన్నయ్య, సీతారామిరెడ్డి, కోటిస్వామి ఆంజనేయులు, సురేష్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

8న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జైశ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో పదో తరగతిలో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు ద్రావిడదేశం వి.కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల నుంచి ఒక్కొక్క మండలంలో మొదటి బహుమతిగా రూ.3వేలు, రెండో బ హుమతిగా రూ.2వేలు, మూడో బహుమతిగా రూ.1000 నగదు బహుమతు లతో పాటు బ్యాగులు, ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేస్తామన్నారు. శ్రీసాయి కృష్ణ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో జీఎస్టీ, కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ గోసు రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 500 పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

తెలుగుభాషపై పట్టు సాధించాలి



ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే మాతృభాష తె లుగుపై పట్టు సాధించా లని మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకుడు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి కోరారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో కార్యదర్శి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరుగు తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆయన తెలుగుభాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారి చేత పలు తెలుగు గీతాలను పలికించి వాటికి అర్థాలను వివరించారు. టి.శ్రీనివాస రావు యోగా, స్టెప్ సీఈవో పి.శ్రీమన్నారాయణ మోటివేషన్ క్లాస్, బిందుమాధవి క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ పర్యవేక్షణ చేశారు. శనివారం వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఉంటుందని విద్యా ర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి కోరారు.

గుడి నిర్మాణాన్ని ఆపాలంటూ నోటీసులు

సంతనూతలపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామంలో నిర్మిస్తున్న గుడి నిర్మాణాన్ని ఆపాలంటూ పంచాయతీ కార్యదర్శి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో కమ్యూనిటీ హాల్ ని ర్మాణం చేపట్టేందుకు గతంలో తీర్మానం చేపట్టారు. అయితే గ్రామానికి చెందిన టి.శేషయ్య, టి.శ్రీకాంత్ ఆ స్థలంలో అనుమతులు లేకుండా గుడి ని ర్మాణం చేపడుతున్నారని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి గుడి నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. నిర్మాణాన్ని తొలగించాలని, లేని పక్షంలో వారంరోజుల వ్యవధిలో తొలగిస్తా మని అందులో పేర్కొన్నారు.

ఎస్పీ అశోక్‌బాబుకు సత్కారం

ఒంగోలు కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాన్ క్యాడర్ ఎస్పీగా ఉద్యోగో న్నతి పొందిన అశోక్‌బాబును శుక్రవారం స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాప క అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ నిర్వాహకులు షహనాజ్, సర్దార్‌బాషా, కొల్లా మ ధు, నల్లూరి మోహన్‌రావు, అసిస్ట్ డీడీ వడ్డేంపూడి సుజాతరావు, కోసూరి శ్రీ దేవి, తాటిపర్తి దివ్య, చౌదరి, జనసేవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువు కట్టనూ వదలకుండా మట్టి తవ్వకాలు

● తరలింపు విషయంలో యువకుల మధ్య వాగ్వివాదం
● ఒకరు ఆత్మహత్యాయత్నం



చెరువు కట్ట తవ్వడంతో ఏర్పడ్డ గొయ్యి

అద్దంకి, జూన్6(ఆంధ్రజ్యోతి): చెరువులను తవ్వి మట్టి తరలించటం సర్వసాధారణంగా జరుగుతుంటోంది. అయితే అద్దంకి మండలంలోని జార్లపాలెంలో మాత్రం ఏకంగా చెరువు కట్టను సైతం వదలకుండా తవ్వుతున్నారు. మట్టి తవ్వకం విషయంలో యువకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకోగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలలోకి వెళితే అద్దంకి మండలం జార్లపాలెం చెరువులో ఏళ్ళ తరబడి ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలు పనులు చేసి చుట్టూ కట్ట పోస్తుంటారు. అదే సమయంలో గ్రామస్థులు ఇళ్ల మెరకలకు, ఇతర అవసరాలకు చెరువులో తవ్వకాలు చేసి మట్టి తరలిస్తుంటారు. అయితే రెండు రోజులుగా చెరువులోకి సాగర్ నీరు వస్తోంది. దీంతో ఏకంగా చెరువు కట్ట మట్టినే ఎక్స్‌కవే టర్లతో తవ్వి ట్రాక్టర్లతో మట్టిని గ్రామంలోకి తరలిస్తున్నారు. చెరువు కట్ట మట్టి తరలింపుపై పలువురు గ్రామస్థులు అభ్యంతరం కూడా చెప్పారు. అయినా మట్టితరలింపు మాత్రం ఆగలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత మట్టి తరలింపు విషయంలో యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో మనస్థాపానికి గురైన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నించాడు. ఆ యువకుడిని అద్దంకి లోని ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం అధికారుల దృష్టికి పోవడంతో శు క్రవారం మట్టి తరలింపు నిలిపివేసినట్లు తెలుస్తోంది. .చెరువు కట్ట మట్టి తరలించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కట్ట మట్టి తరలించకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డు అంచు వరకు తవ్విన చెరువు కట్ట

రైతులకు విద్యుత్ వెతలు

● మధ్యాహ్నం వేళలోనేసరఫరా
● ఆ సమయంలో నీరు పెట్టలని దుస్థితి
● ఉదయాన్నే ఇవ్వాలని కోరుతున్న రైతులు



సాగులో ఉన్న వేరుశనగ

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులకు అందించే ఉచిత విద్యుత్ సరఫరాలో లోపాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సేవలకు అవకాశం కల్పించారు. ఈ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో నీరు పెడితే మొక్కలు బెట్టకు వస్తాయి. సాధారణంగా వేసవిలో ఉదయం, సాయంత్రం వేళలో మొక్కలను నీరు పెడతారు. అలా కాకుండా ఎండ గా ఉన్న సమయంలో నీరు పెడితే పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం సుమారు 150 ఎకరాలు వేరుశనగ, 150 ఎకరాలు ఆకుకూరలు సాగవుతున్నాయి. ఇది వరకు కురిసిన అధిక వర్షపాతం కారణంగా ఇప్పటికే సుమారు 200 ఎకరాల వరకు పంట నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో తాజాగా విత్తనాలు చల్లుతున్నారు. దీంతో పంట తడుపునకు ప్రభుత్వం నిర్దేశించిన సమయం అన్నదాతలకు అతి పెద్ద సమస్యగా మారింది. దాదాపుగా ఒక ఎకరాకు నీటి తడి అందించేందుకు 4 గంటలు పైగా సమయం పడుతుంది. తద్వారా 9 గంటల నుండి ప్రారంభించిన పంటకు నీరందించేందుకు మధ్యాహ్నం 1 గంట అవుతుంది. ఎండవేడిమికి అప్పటికే మొక్కలు వాలిపోయి బెట్టకు వచ్చి ఉంటాయి. ఈ నేపధ్యంలో ఉదయం 5 గంటలకే విద్యుత్ సరఫరా చేస్తే నీరు మొక్కలకు సరైన సమయంలో అందిస్తామని పేర్కొంటున్నారు.

నీరు పెట్టేందుకు తీవ్ర అవస్థలు

ఉదయం 9 గంటల నుండి నీరు అందించడం వలన తడుపుకు చాలా ఆలస్యం అవుతుంది. ఉదయం మాత్రం 5 గంటల నుంచే నీరు అందిస్తే సాగుకు సమస్య ఉండదు. అధికారులు మా గోడు పట్టించుకుని సాగుకు సహకరించాలి.

నాగరాజు, బుర్లవారిపాలెం రైతు

గోశాలకు స్థలం కేటాయింపు



గోశాలకు కేటాయించిన స్థలంలో గోవులు

అద్దంకి, జూన్6(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గోశాలలోని ఆవులు స్వేచ్ఛ ప్రపంచంలోకి చేరాయి. అద్దంకి పట్టణంలో పాడుపడ్డ మిల్లులో కాలం వెళ్లదీస్తున్న గోశాలకు శింగరకొండ వద్ద స్థలం కేటాయించారు. శుక్రవారం సాయంత్రం గోవులు ఆ స్థలానికి చేరాయి. హరిహర గోకుళంలో సుమారు 70 కు పైగా ఆవులు ఉన్నాయి. అయితే సరైన వసతి లేక గోశాల నిర్వహకుడు గోనుగుంట సుబ్బారావు అద్దంకి పట్టణంలో పాడుపడ్డ మిల్లులలో గోశాలను నెట్టుకు వస్తున్నాడు. ఈ క్రమంలో '.ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితం అయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గోశాలకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శింగరకొండ వద్ద స్థలాన్ని గుర్తించిన తహసీల్దార్ శ్రీచరణ్ గోశాలకు కేటాయింపు కు చర్యలు చేపట్టారు. దీంతో శుక్రవారం సాయం త్రం గోవులను ఆటోలలో ఎక్కించుకొని శింగరకొండ వద్ద కేటాయించిన స్థలానికి చేర్చారు. కొండ ప్రాంతం కావడంతో గోవులు మేతకు వెళ్లేందుకు కూడా ఇబ్బంది లేకుండా ఉంటుందన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో గోవులకు అవసరమైన రేకుల షెడ్ల నిర్మాణానికి కూడా పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు గోశాల నిర్వహకుడు సుబ్బారావు తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులు వేగవంతం చేయాలి

గ్రామాల్లో డ్రైనేజీ నిర్మాణాల పూర్తికి చర్యలు ● ఒంగోలు మండల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): "గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో పురోభివృద్ధి లేదు. పనులు త్వరగా పూర్తి చేయాలి." అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ కింద అభివృద్ధి పనులకు రూ.65.50లక్షలు నిధులు తెచ్చినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని అసహనం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. గ్రామాల్లో రేషన్‌కార్డులు, పెన్షన్‌ల కోసం అర్హత గల వారిని పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటి నుంచి గుర్తించి వారి పేర్లు ఆన్‌లైన్ చేయించాలని చెప్పారు. గ్రామాల్లో ఇప్పటికే 90 శాతం సిమెంట్‌రోడ్డులు పూర్తి కాగా డ్రైనేజీ నిర్మాణాలను త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలు లేవని, త్వరగా నిర్మించాలని సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు లేకుండా ఉంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తెలపాలన్నారు. శ్మశానవాటికలు చుట్టూ ప్రహరీలు గోడలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జగనన్నకాలనీల్లో ఇప్పటికి మిగిలి ఉన్న స్థలాలు నిజమైన లబ్ధిదారులా లేదో అనే విషయాలను గుర్తించాలని ఆదేశించారు. ఐదు ఎకరాలు కంటే విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గం టల వరకు సమయపాలన పాటించాలని, ప్రజ లు సమస్యలు పరిష్కరిస్తూ మంచి సేవలు అందించాలని చెప్పారు. వలేటివారిపాలెం కార్యదర్శిపై దాడికి ప్రయత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్న య్య, తహసీల్దార్ నయాబ్‌రసూల్, ఏవో శేషు బాబు, ఎంపీటీసీలు పాలేటి శ్రీనివాసరావు, గుండపనేని శ్రీనివాస రావు, సర్పంచ్‌లు మండవ వెంకటసుబ్బయ్య, మంచు మురళి, దేవరంపాటి కోటేశ్వరరావు, నన్నపనేని వెంకటేశ్వరరావు, ఏడీఏ బసవశంకర రావు, ఏవో కిషోర్‌బాబు, ఏఈ వంశీకృష్ణారెడ్డి, కరవది వైద్యాధికారి వాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే బీఎన్



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎస్ ఆయా అర్జీలు పరిశీలించి సమస్యలపై కొంతమంది అధికారులతో అర్జీదారుల సమక్షంలోనే మాట్లాడారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తన నివాసంలో 27మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.19,42,286 చెక్కులను అందజేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమఫలాలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గోడౌన్లను పరిశీలించిన మార్క్‌ఫెడ్ ఎండీ



గోడౌన్లను పరిశీలిస్తున్న ఎండీ మంజీర్ జిలాని

ఇంకొల్లు, జూన్ 6,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంకాయలపాడులోని మార్కెటింగ్ గోడౌన్‌ను మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలానీ ఐఏఎస్ అధికారి శుక్రవారం పరిశీలిం చారు. ప్రభుత్వం పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే ప్రయత్నంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని గిడ్డంగులను సందర్శించి కొనుగోలు చేసిన పొగాకు పెట్టేందుకు ఏర్పాట్లు చేపట్టడానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ కిషోర్, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, కల్యాణ్ రెడ్డి, ఇంకొల్లు తహసీల్దార్ వెంకటరత్నం, వ్యవసాయాధికారి వేణుగోపాల్, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కడవకుదురు గ్రామంలో శనివారం సాయంత్రం 2గంటల నుండి 6గంటల వరకు విద్యుత్ సరఫరాకు తాత్కాలికముగా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏ.ఈ.ఈ పి.గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడవకుదురు గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయమునకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉదయం ఐదు గంటలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏ.ఈ.ఈ కోరారు.

వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా రమణబాబు

మేదరమెట్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పలు పదవులను ప్రకటించింది. నియోజకవర్గ బీసి సెల్ అధ్యక్షుడు గోలి రమణబాబును నియమించింది.

రెండు మార్చురీబాక్స్‌ల బహూకరణ

మేదరమెట్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిపాడులో ఏఎంసీ మాజీ చైర్మన్ రావి ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నరేష్ గ్రామానికి రెండు మార్చరీ బాక్స్‌లను బహుకరించారు. శుక్రవారం తెలుగుదేశం నాయకులు వాటిని పంచాయతీకి అందజేశారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు

నాగులుప్పలపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు దాడి చేసి ప ట్టుకున్నారు. చీరాల వైపు నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు 400 బస్తాల రేషన్ బియ్యం తరలి స్తున్న లారీని ఒంగోలు-చీరాల జాతీ య రహదారిపై గల చదలవాడ సమీపంలో డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్స్పెక్టర్ గుణవంశీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యం బస్తాల ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన బియ్యం ఒంగో లులోని స్టాక్‌పాయింట్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఫుడ్ ఇ న్స్పెక్టర్ గుణవంశీ తెలిపారు.

గత పాపం.. అన్నదాతకు శాపం

(5వ పేజీ తరువాయి)

ఆర్‌టీజీఎస్ ద్వారా సమగ్ర పరిశీలన చేపట్టిన తర్వాతే తుది జాబితా ఖరారు చేయనుందని తెలుస్తోంది. 21,900 వరకు వివిధ కారణాలతో తిరస్కరణకు గురికాగా 22,714 మంది రైతుల రికార్డులు ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ పడ్డాయి. గుంటూరు జిల్లాలో ఈ సంఖ్య దాదాపు 18 వేల వరకు ఉండగా, పల్నాడులో 27 వేలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరి భూ రికార్డులు ఆన్‌లైన్‌లో తప్పుల తడకగా ఉండడమో లేక నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయకపోవడం వల్లనే రెవెన్యూ చిక్కులు తలెత్తాయి.

అస్తవ్యస్త రీసర్వే ఫలితమే...

ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి వేల సంఖ్యలో అన్నదాతలు దూరం అయ్యే పరిస్థితి వైసీపీ అస్తవ్యస్తంగా చేపట్టిన రీసర్వే ఫలితమేనని క్షేత్రస్థాయిలో వెలుగు చూస్తున్న రెవెన్యూ చిక్కులు చెబుతున్నాయి. గత ప్రభుత్వం సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం ప్రవేశపెట్టడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. రీసర్వే ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఓ గ్రూపుగా ఎంపిక చేసి.. వారికి ఎల్‌పీఎం నంబరు కేటాయించి అదే ఘనతగా చెప్పుకున్నారు. వెబ్ ల్యాండ్ డేటా మొదలుకుని ఆధార్ సీడింగ్, పేరు తప్పుగా నమోదు చేయడం వంటి సాంకేతిక తప్పిదాలు కోకొల్లలు. పెండింగ్‌లో ఉంచిన రికార్డుల్లో 70 శాతం గత ప్రభుత్వ రీసర్వే తప్పిదాలేనని అధికారులే ఒప్పుకోవడం గమనార్హం. వీటిని తిరస్కరణ కింద చూపెడితే రైతులు ప్రశ్నిస్తారని, అలా అని అర్హుల జాబితాలో చేర్చడానికి నిబంధనలు ప్రతిబంధకంగా మారాయని యంత్రాంగం చెబుతోంది.

తమ ప్రమేయం లేకుండానే

ఆన్‌లైన్‌లో రికార్డులు తప్పుగా చూపించడం వెనక తాము చేసిందేమి లేదని రైతులు చెబుతున్నారు. అన్నీ పక్కాగా ఉన్నప్పటికీ తప్పుగా నమోదు చేశారని వారు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో కొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగానే తప్పుగా నమోదు చేసినట్లు అన్నదాతలు చెబుతున్నారు. టీడీపీ సానుభూతిపరులను వేధించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం రీ సర్వే అంకాన్ని కూడా వాడుకుని.. స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో కావాలనే తమ భూములను రెవెన్యూ చిక్కుల్లో పడేటట్లు చేశారనే వాదనను రైతులు చేయడం గమనార్హం. వీటి విషయంలో ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడం సాధ్యపడదని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. మరో వైపు అన్నదాత సుఖీభవ పథకం తుది జాబితా ఈ నెల మొదటి వారంలో ఖరారు చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉండడంతో.. గత ప్రభుత్వం చేసిన తప్పుకు తాము పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోల్ టెండర్లలో కిరికిరి

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేస్తారని దరఖాస్తుదారులు ఆశించారు. అయితే ఈ ప్రక్రియను పక్కన పడేసినట్లు సమాచారం. పోల్ సెంటర్‌ను టెండర్‌దారులకు కాకుండా పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ ప్రాంతానికి చెందిన మరో వైసీపీ వ్యక్తికి కట్టబెట్టేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిసింది. విశేషమేమిటంటే ఆ వ్యక్తి అసలు టెండరే వేయలేదు. పైగా తగిన అనుభవం కూడా లేదు. కానీ అనర్హుడికి పోల్‌సెంటర్‌ను కట్టబెడుతున్నారనే విషయం వెలుగుచూడటంతో టెండర్ వేసిన వారు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. టెండర్లు ఎప్పుడు పిలిచారు.. ఎంత మంది పాల్గొన్నారు.. ఎవరెవరు పాల్గొన్నారు.. ఇప్పటి వరకు ఎందుకు ఖరారు చేయలేదు.. వంటి సమాచారాన్ని కోరుతూ సమాచార హక్కు ద్వారా విద్యుత్‌శాఖకు టెండర్‌దారులు దరఖాస్తు చేశారు. అనర్హుడికి పోల్‌సెంటర్‌ను కట్టబెట్టాలనే ఆలోచనకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దరఖాస్తుదారులు కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్నారని తెలిసింది. దరఖాస్తుదారుల్లో టీడీపీకి చెందిన వారు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు టెండర్లలో కిరికిరి గురించి చెప్పి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి కూడా తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

అవీ..ఇవీ..

వ్యక్తిపై రౌడీషీటర్ కత్తితో దాడి

● చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వ్యక్తిపై ఓ రౌడీ షీటర్ బీరు సీసాతో ఘోరంగా దాడి చేశాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి ప్రసాద్ థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ఇరువురు సమీపంలో వేర్వేరుగా మద్యం సేవిస్తున్నారు. ఈక్రమంలో అనుకోని రీతిలో చెలరేగిన వివాదంతో ఆ రౌడీషీటర్ బీరు సీసాతో వ్యక్తి తలపై, తీవ్రంగా దాడి చేశాడు. దీంతో రక్తగాయాలతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీపై జేడీ సూచనలు



రికార్డులను పరిశీలిస్తున్న జేడీ గంగాభవాని

పందిళ్లపల్లి (చీరాల), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యమిత్ర కిట్ల పంపిణీల్లో జాగ్రత్తలు పాటించాలని జాయింట్ డైరక్టర్ గంగాభవానీ అన్నారు. శుక్రవారం వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలోని స్కూల్‌కు చేరిన కిట్లు యూనిఫాం, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలను పరిశీలించారు. అలాగే అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీచేసి సంతృప్తి చెందారు. జిల్లాస్థాయి అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంఈవో-2 పురుషోత్తం, సీఆర్‌పీ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మరమ్మతులకు గురైన పల్లెవెలుగు



ముంతావారి సెంటర్‌లో ఆగిన బస్సును నెడుతున్న ప్రయాణికులు

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులతో ఒంగోలు నుండి చీరాలకు వస్తున్న పల్లెవెలుగు బస్సు పట్టణంలో మరమ్మతులకు గురైంది. సుమారు 25 మందితో ముంతావారి కూడలికి సమీపంలో రాగానే అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో చేసేదేమీలేక ప్రయాణీకులు ఆపసోపాలు పడి బస్సును నెట్టారు. ఎట్టకేలకు స్టార్ట్ అవడంతో గమ్యంచేరారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పంగులూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూదవాడ గ్రామంలో శుక్రవారం గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఇంకొల్లుకు చెందిన చెరుకూరి హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్యశిబిరంలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ , కంటి వైద్య నిపుణులు డాక్టర్ ముద్దన సతీష్‌కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిలుకూరి భువన, షుగర్ వైద్యనిపుణులు డాక్టర్ అమూల్య పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని గొట్టిపాటి యువసేన ప్రతినిధులు తెలిపారు. బూదవాడ పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రేపు చినగంజాంలో ఉచిత కంటి వైద్య శిబిరం



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు

చినగంజాం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంట లకు వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు మండల టీడీపీ నాయకులతో కలిసి జడ్పీ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో చినగంజాం, పెదగంజాం గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, నక్కల కృష్ణ, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, కొక్కిలిగడ్డ విష్ణు, భయ్యా సతీష్‌కుమార్, గంటా వెంకటనారాయణ,యాల్లావుల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ అధికారిపై కమిషనర్ ఆగ్రహం

పర్చూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల సొంతభూములను దేవదాయశాఖ నిషిద్ధ భూముల జాబితాలో చేర్చి వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించడంలో తీవ్రజాప్యంపై కమిషనర్ రామచంద్రమోహన్ అగ్రహం వ్యక్తం చేశారు, పర్చూరు మండలంలోని పలువురు రైతులు శుక్రవారం కమిషనర్‌ను కలసి జిల్లా దేవదాయశాఖ తీరుపై ఫిర్యాదు చేశారు. తమ సొంత భూములు దేవాదాయశాఖకు చెందినవిగా పేర్కొని నిషిద్ధ భూముల జాబితాలో చేర్చారన్నారు. వాటిని తొలగించాలని ఏడేళ్లగా తాము అర్జీలు ఇస్తున్నా సమస్య పరిష్కరించలేదని కమిషనర్‌కు వివరించారు. దీంతో జిల్లా దేవదాయశాఖ అధికారికి కమిషనర్ ఫోన్‌చేసి సమస్యల పరిష్కారంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. కారణాలు చెబుతూ ఎంతకాలం జాప్యం చేస్తారని ప్రశ్నించారు. రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించరా..? అంటూ అగ్రహం వ్యక్తం చేశారు. నిషిద్ధ జాబితాలో తప్పుగా నమోదు చేసిన రైతుల భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పనితీరును మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యపై పర్యవేక్షించాలని గుంటూరు దేవాదాయశాఖ ఉప కమీషనర్ కె.బి.శ్రీనివాసరావుకు కమిషనర్ సూచించారు.

ఉత్సాహంగా యోగాంధ్ర గ్రామసభలు

సంతమాగులూరు జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీపుల్ కార్యక్రమంపై అవగాహన, గ్రామసభలు విజయవంతంగా నిర్వహించారు. అలాగే సంతమాగులూరులో గ్రామ సర్పంచి పుచ్చకాయల నాగేశ్వరావు గ్రామ సిబ్బంది, ఎంపీటీసీలు గ్రామసభ అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభలను ఉద్దేశించి ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. సంపద అధికంగా ఉన్న కుటుంబాలు, అట్టడుగున ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబంగా నమోదు చేసి వారికి మార్గదర్శులను ఏర్పాటుచేసి గ్రామసభ ద్వారా వారిద్దరి మధ్య సమన్వయం ఏర్పరచడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాంప్రసాద్, ఆయా గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







కొణిదెన గ్రామంలో అసంపూర్తి పనులతో అలంకార ప్రాయంగా ఉన్న నూతన సచివాలయ భవనం, చిందరవందరగా పడేసిన మద్యం సీసాలు, రైతుసేవా కేంద్రంలో అరబెట్టిన పొగాకు

అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ భవనాలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన తీరు

మద్యం తాగి సీసాలు పడేస్తున్న మందుబాబులు

బల్లికురవ. జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పాల న అవసరాల కోసం లక్షలు ఖర్చు చేసి నిర్మాణం రూపు దిద్దుకుంటున్న ప్రభుత్వ భవనాలు ఇప్పుడు అసంపూ ర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ భవనాలను మందుబాబులు బార్లుగా వినియోగిస్తున్నారు. అనం తరం ఖాళీ సీసాలను సైతం అక్కడే పడేసి వెళుతు న్నారు. ఇక రైతుసేవా భవనంలో కొందరు పొగాకు తాళ్లు కట్టుకోవడం గమనార్హం. మండల పరిధిలోని కొణిదెన గ్రామంలో సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేసి గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్ర భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ భవనాల పనులు 80 శాతం పూర్తయ్యాయి. కొంత కాలం నుంచి ఈ భవనాల పనులు నిలిచి ఉన్నాయి. నిధుల కొరతతో పనులు అర్ధాంతరంగా ఆగాయి. దీంతో ఈ భవనాలను ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. మందుబాబులు అయితే పగలు రాత్రి అన్న తేడా లేకుండా లోపలి గదులలో పార్టీలు చేసుకుంటూ బార్లుగా వినియోగించుకుంటున్నారు. ఖాళీ సీసాలును అక్కడే పడవేసి పోతున్నారు. రైతుసేవా కేంద్ర భవనంలో అయితే కొందరు రైతులు పొగాకు తాళ్లు కట్టారు. ప్రజలకు ఉపయోగ పడాల్సిన ప్రభుత్వ భవనాలు అలంకార ప్రాయంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే మిగిలిన నిధులు మంజూరు చేస్తే నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకు రావచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

మొక్కలు నాటడంతో సరి

సంరక్షణ గాలికి.. ఏటా ఇదే తంతు



కొత్తగా మొక్కలు నాటిన శంకరప్పాడు- కలవకూరు రోడ్డు

అద్దంకి, జూన్6 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం వచ్చిందంటే ఏటా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. అయితే ఆ తరువాత వాటి సంరక్షణ గురించి మాత్రం పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో నాటిన మొక్కల్లో కేవలం 10 శాతానికి మించి బతికి ఉండడం లేదు. గతంలో ఉపాధిహామీ పథకం ద్వారా అన్ని గ్రామాలలో రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వాటి సంరక్షణ, నీరు పెట్టేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా నెలకు సుమారు రూ.4 వేల చొప్పున కూలీ కూడా ఇచ్చారు. అయితే ప్రస్తుతం అప్పట్లో మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలిస్తే చాలా చోట్ల ఆనవాళ్లు కూడా లేవు. ఈ నేపథ్యంలో గత ఏడాది చాలా తక్కువ మొక్కలు మాత్రమే నాటారు. ఈ ఏడాది వన మహోత్సవం సందర్భంగా రైత్వారీ కుంటల వద్ద మొక్కలు నాటామని, ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా ఎక్కువ ప్రాంతాలలో ఫోటోలకు ఫోజులు ఇవ్వటం తోనే సరిపెట్టినట్లు తెలుస్తోంది. కనీసం ఈ ఏడాది నాటిన మొక్కలనైనా సంరక్షణ చేపట్టే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలా కాకుండా మొక్కలు నాటడంతో తమ పని అయిపోయిందని వదిలి వేస్తే ప్రయోజనం ఉండదనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

మండువేసవిలో మైలవరం చెరువుకు జలకళ

నాలుగు గ్రామాలలో పెరగనున్న భూగర్భజలాలు



మైలవరం చెరువుకు చేరుతున్న నీరు

అద్దంకి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలవరం చెరువుకు సాగర్‌జలాలు పుష్కలంగా చేరాయి. గతంలో మైలవరం చెరువు నీరు చేరడం కష్టతరంగా ఉండేది. అరకొరగా విడుదలయ్యే నీరు చెరువులోకి చేరేసరికే నీటి విడుదల నిలిచిపోయేది. అయితే పూడికతీత పనులు చేసి ఉండడంతో సాగర్ కాలువల ద్వారా నీరు వేగంగా చెరువుకు చేరింది. మండు వేసవిలో మైలవరం చెరువుకు సాగర్ జలాలు చేరడంతో జలకల సంతరించుకొంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు, నీటిసంఘం ఛైర్మన్ సయింపు అమరనాథ్ చౌదరి, సత్యనారాయణ, పలువురు గ్రామ టీడీపీ నేతలు కలిసి సాగర్ నీరు చెరువుకు చేరేవిధంగా పర్యవేక్షించారు. మైలవరం చెరువు నిండడంతో మైలవరం, వెలమవారిపాలెం, ఏలేశ్వరవారిపాలెం గ్రామాలలో భూగర్భ జలాలు పెరిగాయి. వేసవిలో పశువులకు తాగునీటి కష్టాలు తీరాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గత ఏడాది ప్రత్యేక చొరవ తీసుకొని సాగర్ మేజర్, మైనర్ కాలువలలో పూడికతీత పనులు చేయించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న భక్తులు

మార్టూరు, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం వైభవంగా శ్రీ అభయాంజనేయస్వామి వాయు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అంతేగాకుండా ఉష్ట్రవాహన, వినాయక జంటనాగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ డాక్టరు అన్నదానం చిదంబర స్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అనంతరం పలువురు మహిళలు విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. అంతేగాకుండా మహిళలు స్వామి వారికి కుంకుమ, పసుపుతో పూజలు చేశారు. స్వామి వారికి హారతులు పట్టారు. దాదాపుగా 22 అడుగులు ఎత్తైన శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామస్థులు సహకరించారు. మండలంలోని కోనంకి గ్రామం నుండి వలపర్ల గ్రామంలోకి ప్రవేశించే సమయంలో వలపర్ల గ్రామపొలిమేర వద్ద భారీగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమాన్ని తిలకించడానికి వలపర్ల, కోనంకి, రామకూరు గ్రామాల నుంచి ప్రజలు విశేషంగా తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం భారీగా అన్న ప్రసాద వితరణ చేశారు.

పొగాకు కొనుగోలుకు సన్నద్ధంపై హర్షం

బొమ్మల కూడలిలో బాణసంచా కాల్చి సంబరాలు



బొమ్మల కూడలిలో బాణసంచా కాలుస్తున్న టీడీపీ నేతలు

పర్చూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ప్రజాకూటమి శ్రేణులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. పొగాకు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కొనుగోలు చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరిని రైతులు కొనియాడారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం నుండి ప్రజా కూటమి శ్రేణులు రైతులు ర్యాలీగా బయలుదేరి స్థానిక బొమ్మల కూడలిలో బాణసంచాకాల్చి కృతజ్ఞతలు తెలపారు. కార్యక్రమం లో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి ఎరువు తయారీ ప్లాంట్ ప్రారంభం



వ్యర్థాలను వేరుచేసే యంత్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

అద్దంకి,జూన్6(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో గతంలో సేకరించి అద్దంకి కొండ వద్ద వేసిన చెత్త నుండి ఎరువు తయారీ చేసే యూనిట్ ను మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర శు క్రవారం ప్రారంభించారు. అద్దంకి కొండ వద్ద సుమారు 55 వేల మె ట్రిక్ టన్నుల చెత్త ఉంది. ఈ నేపథ్యంలో తరుణి సంస్థ ఆధ్వర్యంలో చెత్త ను ఎరువు గా మార్చే యూనిట్ ను ఏర్పాటు చేశారు. చెత్త పై రసాయనాలు చల్లటం ద్వారా కుళ్ళి ఎరువుగా మారుతుంది. కుళ్ళిన తరువాత ఎరువు, కుళ్ళిపోకుండా ఉండే దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులను ఒక భాగం గా, రాళ్ళు ఇతర ఘన పదార్దాలు మరో భాగంగా యం త్రం ద్వారా వేరు చేస్తారని తెలిపారు. ప్లాస్టిక్ సామానులను గుంటూరు లోని జిందాల్ కు తరలిస్తారని, రాళ్ళు , ఇతర గట్టి పదార్థాలను పల్లం గా ఉన్న ప్రాంతాన్ని పూడ్చేందుకు వినియోగిస్తారని తెలిపారు. చెత్త తొలగింపు తరువాత అక్టోబర్ 2 వ తేది నాటికి ఇప్పటి వరకు చెత్త వేసిన సుమారు 7 ఎకరాలను తరుణి సంస్థ శుభ్రం చేసి మున్సిపాలిటీ కి అప్పగిస్తారన్నారు. ఆ స్థలం మున్సిపాలిటీ అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపారు.

ప్రజాదర్బార్‌తో సమస్యలకు పరిష్కారం

● యువ నాయకులు గౌరీ అమర్నాథ్



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న యువనాయకులు గౌరీ అమర్నాథ్

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలకు పారదర్శకంగా పరిష్కారమని యువనాయకులు గౌరీ అమర్నాథ్ అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి 87 అర్జీలు స్వీకరించగా, వాటిల్లో పింఛన్ 16, నివేశన స్థలాలు 61, ఇతర సమస్యలు 10 ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన డీఎస్‌సీ పరీక్ష

● 443 మందికి 50 మంది అభ్యర్థులు గైర్హాజరు

● జూలై 7 వరకు పరీక్షలు

చీరాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డీఎస్‌సీ పరీక్షలు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9:30, గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30. గంటల నుండి 5 గంటల వరకు జరిగిన పరీక్షల్లో 443 మందికి గాను 50 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పరిశీలించారు. పరీక్ష విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు సంబంధించి తగిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. జూలై 7 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

యువతి వివాహానికి దాతల సాయం

మార్టూరు, జూన్6 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని గొట్టిపాటినగర్‌లో నివాసం ఉంటున్న పేద యువతి షేక్ మజిరాబీ వివాహం నిమిత్తం హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో దాదాపుగా రూ.25 వేలను దాతలు అందించారు. శుక్రవారం వారు ఈ మొత్తాన్ని యువతి తల్లిదండ్రులు షేక్ చినమీరావలి, షేక్ సుభానిబీలకు సంస్థ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో షేక్ భాషా,ఎస్ఎంబీ రషీద్, పఠాన్ చినకాలేషావలి, జాష్టి సాంబశివరావు, ఎస్‌కె హబీబా, రహీమా, ఎస్‌కె బాజి, ఇంకా తదితర వ్యక్తులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పీఎంజేఏవై కార్డులు నమోదు చేసుకుంటున్న పెదగంజాం గ్రామస్థులు

చినగంజాం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నీటినిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం మలేరియానివారణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం హైరిస్క్ ప్రజలు కల్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం రోజు ఫ్రైడే డ్రై డే రోజు నీటి నిల్వలు లేకుండా కార్యక్రమం తప్పకుండా చేయాలని అన్నారు, దోమల వ్యాప్తి నిర్మూలన కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పలు వ్యాధులకు సంబంధించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం కార్యక్రమంలో నూతన కార్డుల కోసం 525 మందిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, గ్రామ కార్యదర్శి కే.కృపారావు, జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ టీం సభ్యులు కె.సుజిత, ఏ.రాజశేఖర్, కె.ప్రభాకర్, కె.బోయిజ్, జి.అనిల్‌కుమార్, కె.రాంబాబు, టీ.ఫణి, జి.మౌనిక, 104 డిఈవో పాదిలి రాఘవ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్‌వో ప్లాంటు ప్రారంభం



ప్లాంటు ప్రారంభిస్తున్న తహసీల్దార్

యద్దనపూడి, (మార్టూరు) జూన్6 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలో శుక్రవారం రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌వో ప్లాంటుకు తహసీల్దార్ కే.రవికుమార్ ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో ఆర్‌వో ప్లాంటు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయు పృధ్వీరాజ్, పంచాయతీ కార్యదర్శి రాణి, టీడీపీ నాయకులు నల్లపనేని రంగయ్యచౌదరి, దొడ్డా భద్రయ్య, సింగు చంద్రశేఖర్, దొడ్డా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.





నెల్లూరు: పరీక్ష రాసి కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న అభ్యర్థులు

తొలిరోజు ప్రశాంతం

8 కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

117 మంది అభ్యర్థుల గైర్హాజరు

నెల్లూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడిజిల్లాలోని 8 కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా రెండు విడతల్లో పరీక్షలు జరిగాయి. జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్‌ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ కలిపి 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనుండగా వీటికి 31,221 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెం ఐయాన్ డిజిటల్‌జోన్, కోవూరు మండలం గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, కావలిలోని పీబీఆర్ విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జిల్లా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరగ్గా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు వైద్యశిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


● తొలిరోజు 1,237 మంది హాజరు

డీఎస్సీ పరీక్షలకు సంబంధించి తొలిరోజు ఉదయం సెషన్‌లో 679 మందికి 616 మంది హాజరవగా 63 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 675 మందికి 621 మంది హాజరవగా 54 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి 1354 మంది హాజరు కావాల్సి ఉండగా 1237 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. అలాగే విజువల్లీ హ్యాండీక్యాప్డ్, ఆర్థో హ్యాండీక్యాప్డ్‌లో రెండు చేతులు లేని వారికి స్క్రైబ్‌లను ఏర్పాటు చేశామని, దీనికోసంగా ఇంటర్ అర్హత కలిగిన వారిని సహాయకులుగా నియమించినట్లు చెప్పారు. కాగా, అభ్యర్థుల వెంట వారి కుటుంసభ్యులు కూడా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షలు ఆరంభం నుంచి ముగింపు వరకు కళాశాలల వద్ద చెట్ల కిందే కూర్చున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నెల్లూరులో మరో కరోనా కేసు

27 మంది అనుమానితులకు పరీక్షలు

7కు చేరిన పాజిటీవ్‌లు



నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో కొవిడ్ కేసు నమోదయ్యింది. గురువారం ఆరు పాజిటివ్‌లు గుర్తించగా, శుక్రవారం ఓ కేసు రికార్డుకెక్కింది. నెల్లూరులోని మూలాపేటకు చెందిన 22 ఏళ్ల యువకుడికి పరీక్షలు చేయగా కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. అయితే, కరోనా తీవ్రత తక్కువగా ఉండటంతో బాధితుడ్ని హోం ఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉంటే జిల్లాలో నమోదయిన 6 కరోనా కేసులకు సంబంధించి వారితో సన్నిహితంగా ఉన్న వారిని వైద్యాధికారులు గుర్తించి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 27 మందికి ఈ పరీక్షలు చేయగా, ఒకరికి కరోనా నిర్ధారణ అయింది.

9న విజన్ ప్లాన్ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఈ నెల 9వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గస్థాయి ప్రత్యేకాధికారి, స్థానిక ఎమ్మెల్యే, ఏడుగురు కమిటీ సభ్యులతో విజన్‌ప్లాన్ డాక్యుమెంటు తయారు చేసినట్లు చెప్పారు. 9న ఉదయం వర్చువల్‌గా సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా, నియోజకవర్గాలు, మండలాల్లోప్రారంభమైన పనుల జాబితా తయారు చేయాలని, మంజూరైన వాటికి శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీటికి ఈ నెల 11న వీటికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా 12న అమరావతిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులతో ట్రెయిన్ స్టార్మింగ్ సెషన్ జరుగుతుందని చెప్పారు.

● ఎక్సైజ్ డీసీగా శంకరయ్య

నెల్లూరు (క్రైం) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం శంకరయ్య శుక్రవారం బాధ్యతలు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా శంకరయ్యను ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పి దయాసాగర్, జిల్లా డీపీఈవో శ్రీనివాసులు నాయుడు, ఏఈఎస్ రమేష్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



నెల్లూరులోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో సామూహిక ప్రార్థనల కోసం చేసిన ఏర్పాట్లు

నేడు బక్రీద్

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు

ముస్లింలు బక్రీదు పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. ఇందుకోసం ప్రభుత్వపరంగా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. దైవ మార్గంలో పయనిస్తున్నప్పుడు మనకు ప్రీతిపాత్రమైన వాటిని త్యాగం (ఖుర్బానీ) చేసే విషయంలో ముస్లింలు ప్రవక్త హజరత్ ఇబ్రహీం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటారు. ఆయన త్యాగానికి ప్రతీకగా బక్రీదు పండుగను జరుపుకుంటారు.

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా, బుజబుజ నెల్లూరు, మహాత్మాగాంధీనగర్. సంతపేట, నవాబుపేట, జాకీర్‌హుస్సేన్ నగర్, బర్మాషెల్‌గుంట తదితర ప్రాంతాల్లోని ఈద్గాలలో సామూహిక ప్రార్థనలకు నగర పాలక సంస్థ మౌలిక సదుపాయాలు కల్పించింది. అన్నీ ఈద్గాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లూరులోని మసీదులు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయని ముస్లిం పెద్దలు తెలియజేశారు. బక్రీదు పండుగకు అవసరమైన సామగ్రి కొనుగోళ్ల కోసం ముస్లింలు తరలిరావడంతో బజార్లు కళకళలాడాయి. కాగా, బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ వేర్వేరు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం.. ఈ రెండూ బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించండి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముస్లింలు, పోలీస్ శాఖలోని ముస్లింలు, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, భక్తికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని అందరూ సుఖశాంతులతో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకుగానీ, డయల్ 112కుగానీ సమాచారమివ్వాలని కోరారు.

ఐసీడీఎస్ పీడీగా హేనా సుజన్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా హేనాసుజన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె జిల్లాలో పీడీగా పని చేశారు. ఈ సందర్భంగా హేనాసుజన్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామని చెప్పారు.

ఉపాధ్యాయుల్లో గందరగోళం

● సీనియారిటీ జాబితాల్లో పొరపాట్లు

● విద్యాశాఖ అధికారుల తీరుపై టీచర్ల ఆందోళన

నెల్లూరు (విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం నెలకొంటోంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 111 మంది స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా నియమించారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 మొత్తం 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకేషన్ 12 కలిపి 1748 మందికి సంబంధించిన సీనియారిటీ జాబితాలను విడుదల చేశారు. వీరికి ఒక్కరోజు మాత్రమే అవకాశం కల్పించడంతో ఆప్షన్లను ఇచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. వెలువడిన జాబితాలో కూడా సీనియారిటీ, ఖాళీలు పొరపాట్లు పడ్డాయి. వీటన్నింటిపై అభ్యంతరాలు తెలపగా, కొన్నింటిని పరిష్కరించి మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. దీంతో తుది జాబితాలో పూర్తిగా పొరపాట్లు దొర్లి తమకు అన్యాయం జరిగిందంటూ ఎస్ఏలు ఆందోళన చేస్తున్నారు. కొంత మంది అర్హత లేకపోయినా పాయింట్లు పొందేలా పావులు కదిపి తమకు అన్యాయం చేశారంటూ ఆరోపిస్తున్నారు.

● స్కూల్ అసిస్టెంట్లకు స్థానచలనం


జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)కు ఉత్తర్వులు విడుదలయ్యాయి. తొలుత ఎస్ఏ నాన్ లాంగ్వేజెస్

- మిగతా 7లో..



డీఈవో కార్యాలయంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు





'నెల్లూరు కాకపోతే ఆ పక్క మండలం.. అక్కడా కాకపోతే ఈ పక్క మండలానికి వెళతాం తప్ప.. ఎక్కడో దూర ప్రాంతాలకు వెళ్లమంటే మా వల్ల కాదు సార్.. ఇదుగోండి.. మా ఎమ్మెల్యే సిఫారసు లేఖ కూడా ఇచ్చారు.'

- రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగుల తీరిది.

అక్కడ లేదా ఇక్కడ

● అనుకూల ప్రాంతాల కోసం రెవెన్యూలో పోటీ

● నెల్లూరు పరిసర ప్రాంతాల వైపే మొగ్గు

● గతంలో చేసిన స్థానాలకు మళ్లీ ప్రయత్నాలు

● సిఫారసుల కోసం ఎమ్మెల్యేల వద్దకు క్యూ

● పాతుకుపోయిన ఆర్‌ఐలు.. కొత్తవారికి నో ఛాన్స్

● కలెక్టరేట్ వైపు చూసేందుకూ విముఖత

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగుల తీరు భిన్నంగా ఉంటోంది. నెల్లూరు దాటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలు జరుగుతుండటంతో ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు, గత బదిలీల్లో నచ్చని స్థానాలకు బదిలీ అయిన ఉద్యోగులు.. ఇప్పుడు మళ్లీ వారికి అనుకూలమైన చోటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు తమకున్న రాజకీయ, ఆర్థిక బలాలను ఉపయోగిస్తూ జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. కొందరైతే ఆయా ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు కూడా పొందడం గమనార్హం. ఇంకొందరు తమ స్థానాన్ని కదపకుండా ఉండేందుకు ఎమ్మెల్యేల ద్వారా ఉన్నతాధికారులకు చెప్పించుకుంటున్నారు. వీరి మూలంగా సామాన్య ఉద్యోగులు నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బదిలీలు ఎంత మేరకు పారదర్శకంగా జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

● ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

సాధారణ బదిలీకు ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకూ గడువు పొడగించినా రెవెన్యూ శాఖలో ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. వీఆర్వో స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకూ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో బదిలీ అయిన వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లో జరుగుతోంది. కొంతమంది వీఆర్వోలు, ఆర్‌ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు తమకు అనుకూలమైన పోస్టుల కోసం తీవ్రంగా పైరవీలు చేస్తున్నారు. వీరిలో చాలా మంది గతంలో పనిచేసిన మండలాలకే వెళ్లేందుకు సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా వస్తుండటం, ఇక్కడ వారికి ఇళ్లకు దగ్గరగా ఉండడంతో నెల్లూరు డివిజన్ దాటి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇలా ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగుల మూలంగానే రెవెన్యూ వివాదాలు పెరుగుతున్నట్లు ఆ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

● ఆర్‌ఐలకు స్థానచలనం కలిగేనా?

కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అయితే అనేక ఏళ్లుగా ఫీల్డ్‌లోనే పనిచేస్తున్నారు. కొత్త వారికి అవకాశం కల్పించడం లేదు. సాధారణంగా రెండేళ్లు ఒక మండలంలో ఆర్‌ఐగా పనిచేశాక ఆ ఉద్యోగిని తర్వాత ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ స్థానానికి మార్చి కొత్తగా ఉద్యోగోన్నతి పొంది వచ్చిన ఆర్‌ఐలకు ఫీల్డ్ వర్కులు అప్పగిస్తుంటారు. కానీ కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు కూడా దృష్టి పెట్టారు. ఈదఫా ఏళ్ల తరబడి ఫీల్డ్‌లోనే పనిచేస్తున్న ఆర్‌ఐలకు స్థానచలనం తప్పదని, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. అయితే కొందరు ఆర్‌ఐలు తమ పలుకుబడి ఉపయోగిస్తూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మరి చివరకు ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. అదే సమయంలో కలెక్టరేట్ అంటేనే ఉద్యోగులు విముఖత చూపుతున్నారు. ఇక్కడ పనిచేసేందుకు మాత్రం దరఖాస్తు చేసుకోవడం లేదు. ఇక్కడ రూల్ ప్రకారం కచ్చితంగా పనిచేయాల్సి ఉండడం, మండలాల్లో మాదిరి ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి వెళ్లేందుకు వీలు లేకపోవడంతోనే ఉద్యోగులు కలెక్టరేట్‌లో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు.



ఆత్మకూరు మండలం అప్పారావు పాలెం స్టాక్‌యార్డులో నిల్వ చేసిన ఇసుక

ఎందుకింత నిర్లక్ష్యం?

ఇసుక కావాలంటే డీసిల్టేషన్ పాయింట్లే దిక్కు

ఫలితంగా పెన్నాలోకి విరుద్ధంగా దిగుతున్న ట్రాక్టర్లు

ఇసుక యార్డులు తెరవడంలో తీవ్ర జాప్యం ● వారం రోజులుగా ఆగిన తవ్వకాలు

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నా ఆ ఇసుకను వినియోగదారులకు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. వారం రోజుల నుంచి పెన్నా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపేసినప్పటికీ ప్రత్యామ్నాయంగా స్టాక్‌యార్డుల్లోని ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది. అధికారుల తీరుతో ఇసుక ధర పెరుగుతుండగా, అది వినియోగదారులపై పడుతోంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం మాన్ సూన్ సీజన్‌లో నదుల్లో తవ్వకాలు జరపకూడదు. ఈ నెల 1 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకూ పెన్నాలో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయి. ఈ మేరకు కలెక్టర్ కూడా ప్రకటన విడుదల చేశారు. అయితే తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించిన జిల్లా అధికారులు.. ప్రత్యామ్నాయ మార్గాలను చూపించడంలో మాత్రం విఫలమవుతున్నారు.

● యార్డుల్లో మొదలుకాని విక్రయాలు

జిల్లాలో 9 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతూ ఉండగా, వాటిలో నాలుగు రీచ్‌లు డీసిల్టేషన్‌వి కాగా మరో ఐదు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రమే ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. మిగిలిన అన్ని ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు నిలిపేశారు. వీటన్నింటి చోట స్టాక్‌యార్డులు ఏర్పాటు చేసి ఉన్నారు. ఇంతకముందే అక్కడ ఇసుకను నిల్వ చేశారు. మొత్తంగా జిల్లాలోని తొమ్మిది స్టాక్‌యార్డులలో 2.34 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటిలో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 స్టాక్‌యార్డుల వద్ద మాత్రమే మొదటి నుంచీ ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన ఐదు స్టాక్‌యార్డులలో అమ్మకాలు మొదలుకాలేదు. ఇక్కడి నిర్వాహక ఏజన్సీలకు అనుమతులు ఇవ్వలేదని చెప్పుకుంటున్నారు. దీంతో వినియోగదారులకు ఇసుక కావాలంటే డీసిల్టేషన్ పాయింట్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా రవాణా చార్జీలు పెరుగుతున్నాయి. ఈ భారం వినియోగదారులపై పడుతోంది. ఈ వారం రోజుల్లోనే టిప్పర్ ఇసుక ధర రూ.2 వేల వరకూ పెరిగినట్లు వినియోగదారులు చెబుతుండడం గమనార్హం. అదే సమయంలో ట్రాక్టర్లు కూడా దూరాన ఉన్న డీసిల్టేషన్ పాయింట్లకు వెళ్లలేక సమీపంలోని పెన్నా నదిలోనే నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి తీసుకెళుతున్నారు.

జిల్లాలో ఇసుక నిల్వలు

స్టాక్ యార్డు	ఇసుక నిల్వలు (మెట్రిక్ టన్నులు)	విక్రయించాల్సిన ధర (రూ.లలో)
పోతిరెడ్డిపాలెం	40,550	250
సంగం	96,468	250
సూరాయపాలెం-1	46,165	250
సూరాయపాలెం-2	15,817	250
కందుకూరు భీమవరం	2000	184
పల్లిపాడు	5850	82
అప్పారావుపాలెం	15000	108
మినగల్లు	7200	93
విరువూరు	5000	93

మైనింగ్ అధికారులను ఆదేశిస్తాం

మాన్‌సూన్ సీజన్‌లో నదుల్లో ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీల్లేదు. నిర్దేశించిన స్టాక్ యార్డుల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడ ఎంత ధరకు విక్రయించాలన్నది గతంలోనే ఫైనలైజ్ చేశాం. స్టాక్‌యార్డుల్లో ఎందుకు విక్రయాలు చేయడం లేదన్నది పరిశీలిస్తాం. వెంటనే విక్రయాలు మొదలుపెట్టేలా మైనింగ్ అధికారులను ఆదేశిస్తాం.

- కే కార్తీక్, ఇన్‌చార్జ్ కలెక్టర్

'మాలకొండ' పాలకవర్గం ఎప్పటికో!

- వివరాలు 8లో..

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
కోడిగుడ్ల ధర (100): 535	



కావలి ప్రాంతీయ వైద్యశాల

» బాధ్యతల నిర్వహణకు సీనియర్ డాక్టర్ నిరాకరణ
» ఆసక్తి చూపుతున్న మాజీ ఆర్ఎంవో
» సీనియార్టీ లేదని యూనియన్ నేత అభ్యంతరం
» కావలి ఏరియా ఆసుపత్రిలో వైద్యుల మధ్య విభేదాలే కారణం

వివాదాల సుడిలో

ఆర్ఎంవో సీటు!

కావలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా ఆసుపత్రిలో ఆర్ఎంవో సీటు వివాదాల సుడిగుండంలో నలుగుతోంది. ఇక్కడ వైద్యుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా నిబంధనల ప్రకారం ఆర్ఎంవో బాధ్యతలు నిర్వర్తించాల్సిన సీనియర్ వైద్యుడు నిరాకరిస్తుండగా ఆ సీటులో కూర్చుని బాధ్యతలు నిర్వర్తించడానికి గతంలో ఆర్ఎంవోగా పనిచేసిన ఓ వైద్యురాలు ఆసక్తి చూపుతున్నారు. అయితే నిబంధనల మేరకు ఆమె కంటే సీనియార్టీ ఉన్న వైద్యులకు ఆ బాధ్యతలు అప్పగించాలి తప్ప సీనియార్టీ లేని ఆమెకు ఎలా అప్పగిస్తారని ఓ యూనియన్ నాయకుడైన మరో వైద్యుడు అభ్యంతరం చెబుతున్నట్లు సమాచారం. సీనియార్టీ ప్రకారం పోస్టింగ్ ఇవ్వాలని వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు సైతం తరచూ ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆర్ఎంవో నియామకం వివాదాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వద్ద కూడా పంచాయతీ జరిగినట్లు తెలిసింది. వివరాల మేరకు ఇటీవల వరకు ఇక్కడ ఆర్ఎంవోగా డాక్టర్ ప్రమీల పనిచేశారు. ఈ నేపథ్యంలో అనస్థీషియన్ డాక్టర్ సుబ్బారెడ్డి ఏరియా వైద్యశాలలో విధుల్లో చేరారు. నిబంధనల ప్రకారం అందరికంటే ఆయనే సీనియర్ కావడంతో సీనియార్టీ ప్రకారం ఆయనకు ఆర్ఎంవో ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయన తనకు ఆర్ఎంవో పోస్టు వద్దని రాతపూర్వకంగా లేఖ రాసివ్వడంతో డాక్టర్ ప్రమీల ఇటీవల వరకు ఆర్ఎంవోగా కొనసాగారు. అయితే సీనియార్టీలో డాక్టర్ సుబ్బారెడ్డి ఉండగా ఆమెను ఆర్ఎంవోగా కొనసాగించడం ఏమిటని వైద్యశాలలో యూనియన్ నాయకుడిగా కొనసాగుతున్న ఒక డాక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు సుబ్బారెడ్డినే ఆర్ఎంవోగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయన విధిలేని పరిస్థితిలో ఆర్ఎంవో బాధ్యతలు స్వీకరించారు. అనస్థీషియన్ డాక్టర్‌గా కొనసాగుతున్న తాను ఎక్కువ సమయం థియేటర్‌లోనే ఉంటున్నందున ఆర్ఎంవోగా తగిన న్యాయం చేయలేనని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో మళ్లీ తనకు ఆర్ఎంవో పోస్ట్ వద్దని తాను అనస్థీషియన్ డాక్టర్‌గానే తన విధులు నిర్వహిస్తానని లెటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అంతర్గతంగా జరిగిన ఒప్పందాల ప్రకారం ఆర్ఎంవోగా డాక్టర్ సుబ్బారెడ్డి ఉంటారని, అయితే అందుకు సంబంధించిన వ్యవహారాలన్నీ డాక్టర్ ప్రమీల చూసుకుంటారని ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలిసింది. అయితే వైద్యశాలలో వైద్యుల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఇక్కడ ఏది జరిగినా అది వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు చేరుతుండటంతో దీని వెనుక యూనియన్ నాయకుడు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రికి వచ్చే డబ్బులు పంపిణీ విషయంలో కూడా వైద్యుల మధ్య విభేదాలు వెలుగుచూడడంతో ఒక దశలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి కూడా వెళ్లింది. ఆయన కూడా వైద్యులతో మాట్లాడి సర్ది చెప్పినా వారి మధ్య అంతర్గత విభేదాలు లోలోపల కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆర్ఎంవో పోస్టింగ్‌లో దోబూచులాట కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఇక్కడ ఆర్ఎంవో పోస్టును ఆశిస్తున్న వైద్యురాలు, యూనియన్ నేతగా వ్యవహరిస్తున్న వైద్యుడు ఇద్దరూ కావలికి చెందిన వారే కావడంతో వారి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు ఏరియా ఆసుపత్రి సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

సూపరింటెండెంట్‌కు ఆర్ఎంవో ఇన్‌చార్జి బాధ్యతలు

వైద్యుల మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో సీనియార్టీ పేరుతో ఆర్ఎంవో పోస్టు వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడం, డాక్టర్ సుబ్బారెడ్డి తాను ఆ బాధ్యతలు నిర్వర్తించలేనని రాసివ్వడంతో ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ పద్మావతికి ఆర్ఎంవో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



ప్రజా చైతన్యంతోనే వ్యాధుల కట్టడి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత

కావలిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి చైతన్యవంతులయ్యారు. దీంతో వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. ఎండదెబ్బ (సన్‌స్ట్రోక్) మృతుల కేసు ఒక్కటీ లేకపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల్లో కొవిడ్, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే అందించాల్సి వైద్యం తదితర అంశాల పట్ల మాక్ డ్రైవ్ చేపట్టామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? కావలి డివిజన్‌లో కొవిడ్ కేసులు ఉన్నాయా. కొవిడ్ కేసులు ఉంటే తగిన వైద్యం అందుబాటులో ఉందా.

! ఎక్కడా కొవిడ్ కేసులు నమోదు కాలేదు. కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం. అన్ని పీహెచ్‌సీల్లో మాక్ డ్రైవ్ చేపట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ప్రజలను అప్రత్తం చేశాం. వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయి.

? వడదెబ్బ మృతులు ఉన్నాయా.

! ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో వడదెబ్బ మృతులు లేవు.

? విష జ్వరాల కేసుల ప్రభావం ఎలా ఉంది.

! గతంతో పోలిస్తే విష జ్వరాల కేసులు తక్కువ. వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ అవగాహన చర్యలతో ఫలితాలు బాగున్నాయి.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి ఆనం కందుకూరుకు రాక

కందుకూరు/వలేటివారిపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం కందుకూరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 8.30 గంటలకు కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం వద్ద నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న షాపింగ్‌కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. 9.45 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని అక్కడ పార్టీ నాయకులతో సమావేశమవుతారని టీడీపీ నాయకులు తెలిపారు. అనంతరం వలేటివారిపాలెం మండలంకు చేరుకుని చుండి- కాకర్లపాలెం గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డును, పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు పేర్కొన్నారు. కొండపైన రూ.80 లక్షలతో నిర్మించిన 5 వసతి గదులు, రూ.2.40 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్, రూ.77 లక్షలతో నిర్మించిన ఎస్ఎస్ క్యూలైన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా కొండ కింద రూ.1.56 కోట్లతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, రూ.2.65 కోట్లతో నిర్మించనున్న డార్మిటరీ హాలుకు, రూ.46.50 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు డీసీ తెలిపారు.

సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం

కందుకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు పంచాయతీ పరిధిలోని వలేటివారిపాలెం గ్రామంలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలలో పాల్గొని వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నార్నె రోశయ్య, ఎన్వీ రమణయ్య తదితరులున్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

కందుకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్‌చౌదరి, తూమాటి మాధవరావు, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మనలోని దాతృత్వాన్ని ప్రదర్శించేందుకు బక్రీద్ గొప్ప అవకాశంగా వారు అభివర్ణించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

లింగసముద్రం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో యేసుపోగు గ్లోరి, కేసి అక్షయ, దాసరి ఐజాక్‌లు ఉన్నారని హెచ్‌ఎం యు మాధవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులకు ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఎంపికైన వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాళ్లపాడుకు 1.5 టీఎంసీల సోమశిల జలాలు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : వచ్చే వ్యవసాయ సీజన్‌కు సోమశిల జలాశం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు 1.5 టీఎంసీల నీటిని తీసుకువచ్చి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామం వద్ద రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈ జీ.మునిరత్నం, ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వరరావుతో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఎక్స్‌కవేటర్‌ను నడిపి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల ఉత్తర కాలువ వెడల్పు పనులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ ప్రాంతంలోని రైతులకు సాగు, తాగునీటిని అందించే జీవనాడి రాళ్లపాడును రైతుల సహాయ సహకారాలతో కాపాడుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాళ్లపాడు ప్రాజెక్టు కాలువల్లో పూడిక, చిల్లచెట్లు తొలగింపునకు రూ.30 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి గుళ్లపాలెం వరకు 20 కి.మీ పొడవున ఉన్న కాలువకు పక్కనే ఉన్న రోడ్డును, ఎడమ కాలువ రోడ్డును, ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న జంగిల్ తొలగింపుకు రూ.75 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతుల సహాయ సహకారాలతో ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈ చంద్రమౌళి, నవీన్, మనోహర్, టీడీపీ నాయకులు ఎస్ మనోహర్, ఎంఎల్ఎన్ చౌదరి, ఎం వెంకటేశ్వర్లు, సర్పంచు సీహెచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు యు సుబ్బారావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

భద్రతపై బాలికలు అవగాహన పెంపొందించుకోవాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలు మోసపోకుండా అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని చుండి అంగన్‌వాడీ ఖస్త్రకేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఉజ్వల భవిష్యత్‌కు విశోరి వికాసం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళాపోలీస్ జ్యోత్స్న, కార్యకర్తలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● కందుకూరు ఏపీడీ బాబూరావు

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ పథకం కందుకూరు ఏపీడీ జే.బాబూరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, ఏపీవో దయాసాగర్‌తో కలిసి పెదపవనిలో జరుగుతున్న చెరువు, కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంటు, మేట్ల మధ్య ఏర్పడిన వివాదాల కారణంగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో ఇబ్బందులు ఏర్పడుతుండడంతో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. పనుల్లో అవతవకలు పాల్పడినా, కూలీల వద్ద డబ్బులు వసూలు చేసినా, బోగస్ మస్టర్లు వేసినా వారిని తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. బోగస్ మస్టర్లు వేయనివ్వకుండా గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పెదపవనిలో ఉపాధి హామీ కూలీల మస్టర్ తనిఖీ చేస్తున్న ఏపీడీ బాబూరావు

రత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఉదయగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ ● రూ.1.5 లక్షల అందజేత

జలదంకి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న కొమరా రత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి భరోసా ఇచ్చారు. శుక్రవారం వారు మృతుడి స్వగ్రామం మండలంటని చామదల పంచాయతీ వేణుగోపాలపురం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే కాకర్ల తన ట్రస్ట్ నుంచి రూ.50 వేల అందజేయగా, గౌడ సంఘం తరుపున రూ.75వేలు, తన స్వొంత నిధులు రూ.25వేలు కలిపి రూ.లక్ష చైర్మన్ వీరంకి అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వారి ఆగడాలు తాళలేక తీవ్ర ఒత్తిడికి లోనై గీత కార్మికుడు రత్తయ్య కలిగిరి మండలం బట్టువారిపాలెంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఫైనాన్స్ కంపెనీపై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. వీరి వెంట మండల టీడీపీ, తెలుగుయువత అధ్యక్షులు పి.మధు మోహన్‌రెడ్డి, ఎం.తిరుమలరెడ్డి, నాయకులు పి.భాస్కర్‌రెడ్డి, గౌడసంఘం నాయకులు వంశీ, శ్రీను, వెంకట్రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రత్తయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కొండాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులకు నోటీసుల అందజేసి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. మండలంలోని సాయిపేటలో సర్వే నెంబరు 586-1 ప్రభుత్వ భూమిలో కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందడంతో శుక్రవారం గ్రామంలో ఆమె పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు పాల్పడినవారికి నోటీసులు అందజేసి నిర్మాణాలను తొలగింపజేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కోటేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 1994-95 నుంచి 1998-99 విద్యా సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను మెమొంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా వారు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు యు మాధవరావు, కె సూర్యప్రకాశరావు, పూర్వ విద్యార్థులు నాయుడు మహీధర్, బి ఓంకారం, కె చిరంజీవి, యు చినబ్రహ్మయ్య, ఏ సురేష్, జి మాధవ, ఎం బాలు, కృష్ణవేణి, జయసుధ, శారద, అమరావతి పాల్గొన్నారు.



లింగసముద్రం జడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉపాధ్యాయుల్లో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

గణితం, పీఎస్, బీఎస్, సోషల్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల చేశారు. అనంతరం లాంగ్వేజెస్‌లో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం టీచర్ల బదిలీ ఉత్తర్వులు కూడా విడుదల చేసి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అధికారికంగా డౌన్‌లోడ్ చేశారు. అయితే ఈ ఉత్తర్వులు వెలువడిన తరువాత ఎస్ఏలు తమకు అన్యాయం జరిగిందంటూ విద్యాశాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు.

● టీచర్ల ఆందోళన

స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు వెబ్‌ఆప్షన్ల ద్వారా విడుదల అయిన బదిలీ ఉత్తర్వుల్లో అవకతవకలు జరిగాయంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన ఈ ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం నుంచి ప్రహసనంగా మారిందని, పాయింట్ల కేటాయింపుల్లో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. బదిలీలపై జరిగిన అవకతవకలపై విచారణ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకల వెబ్‌ఆప్షన్‌ల విధానానికి స్వస్తి పలికి ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ ఆందోళనలో ఏపీటీఎఫ్ నేతలు పిచ్చిబాబు, జుల్ఫికర్ అలీ, రియాజ్, వెంకటేశ్వర్లు, గురవయ్య, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, వెంగబాబు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

వలేటివారిపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా గ్రామీణ రోడ్లు మరమ్మతులకు కూడా నోచుకోక జనం రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గ్రామీణ రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అందులో బాగంగానే మండలంలోని పోకూరు నుంచి శింగమనేనిపల్లెకు ఉపాధి నిధులు రూ 1.50 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసింది. అదేవిధంగా కళవళ్ల నుంచి లింగసముద్రం మండలం వీఆర్‌కోటకు ఉపాధి నిధులు రూ.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి, అదేవిధంగా వలేటివారిపాలెం నేషనల్‌హైవే నుంచి రోళ్లపాడు గ్రామంలోకి ఉపాధి నిధులు రూ. 1.50 కోట్లతో తారురోడ్డు పనులు పూర్తి చేశారు. అలాగే జాతీయ రహదారి నుంచి కొండసముద్రం గ్రామంలోకి ఉపాధి నిధులు రూ.1.50 కోట్లతో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆ గ్రామీణ రోడ్లు గత ఐదేళ్లలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఆ రోడ్లపై ఎక్కడికక్కడ మోకాటిలోతు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. అయితే కూటమి ప్రభుత్వంలో ఆ రోడ్లకు కొత్తగా తారు వేయడంతో రహదారులు కొత్త అందాలను సంతరించుకొని కళకళలాడుతున్నాయి. తమ గ్రామాలకు వెళ్లే రహదారులు రూపురేఖలు మారిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల బాగుకు నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



రోళ్లపాడు గ్రామంలోకి నూతనంగా నిర్మించిన తారురోడ్డు

పది రోజుల్లో నీటి సరఫరానే లక్ష్యం : డీఈ

బిట్రగుంట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శిక్షణ కేంద్రం విద్యార్థుల అవసరార్థం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పది రోజుల్లో నీటి సరఫరా లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. బోగోలు మండలం కప్పరాళతిప్పలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం కొత్త పైపులైన్ ఏర్పాటు ప్రాంతాన్ని జేఈ రవీంద్రనాథ్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట బీఎంఆర్ వాటర్ ప్లాంట్ సమీపం నుంచి ఏకలవ్య కాలనీ మీదుగా ట్రయినింగ్ సెంటర్ వరకు దాదాపు 1200 మీటర్ల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య విషయం ఎమ్మెల్యే జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో ఐటీడీఏ ప్రత్యేక నిధులు రూ.5.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, అల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పురుషోత్తం, బోగోలు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ లీలాప్రకాష్



రైతు భరోసా కేంద్రాలకు నేటికీ అవే పేర్లు



పేరుమార్చని వీరంపల్లి రైతుభరోసా కేంద్రం

మనుబోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. అయినా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలకు అవే పేర్లు కొనసాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చాలని ఆదేశించింది. మండలంలో 14 రైతుభరోసా కేంద్రాలకు గాను 6 కేంద్రాలను మాత్రమే నిర్మించారు. ఒక్కదానికి కూడా పూర్తిస్థాయిలో పేర్లు మార్చలేదు. జిల్లావ్యాప్తంగా 545 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి పేరు మార్చడానికి రూ. 371 ప్రభుత్వం విడుదల చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పేర్ల మార్పు సక్రమంగా జరగలేదు. కాగా, దీనిపై జిల్లా వ్యవసాయా ధికారిణిని వివరణ కోరగా అన్ని చోట్ల పేర్లు మార్చేశామని, అన్ని కేంద్రాలకు వ్యవసా యాధికారుల ఖాతాల్లో ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు వేశామని చెప్పడం విశేషం.



అక్కంపేటలో ఇలా...



అపూర్వం.. ఆదర్శం

నాలుగు దశాబ్దాల క్రితం అంతా ఆ పాఠశాలలో చదివిన వారు. ఉన్నత చదువులు పూర్తయి, వివిధ రంగాలలో స్థిరపడ్డారు. ఇప్పుడు అంతా ఒకచోట కలిశారు. చిన్ననాడు తాము చేసిన అల్లరిని నెమరు వేసుకున్నారు. ఎవరు.. ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేస్తున్నారో సరదాగా మాట్లాడుకున్నారు. చివరిగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురు వులను సత్కరించారు. మర్రిపాడు మండలం కంపసముద్రం పాఠశాలలో 1985-86లో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా శుక్రవారం నెల్లూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కలిశారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

పులి వాహనంపై చాముండేశ్వరి వైభోగం

ఇందుకూరుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కాగా, రాత్రి అమ్మవారు పులివాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 764 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 508 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 256 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 180 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

● కలిగిరి : కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 461 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 312 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-127, ఆర్‌ఆర్-6, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 149 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.232.15గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ స్టోన్ తరలిస్తున్న లారీ పట్టివేత

ఉలవపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : సీజ్ చేసిన గ్రావెల్ స్టోన్ డంప్ నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, శానంపూడి గ్రామంలో ఉలవపాడుకు చెందిన నీలకంఠేశ్వర స్వామి ఆలయం భూములు ఉన్నాయి. ఆ భూముల్లో విలువైన గ్రావెల్ స్టోన్‌ను పణి అనే వ్యక్తి అక్రమంగా తవ్వి విక్రయించుకుంటూ గత ఏడాది ఉలవపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న లారీ అసోసియేషన్ భవనం వెనుక డంప్ చేశారు. దీనిపై దేవాదాయశాఖ అధికారుల ఫిర్యాదు అందడంతో డంప్ చేసిన గ్రావెల్ స్టోన్‌ను అప్పట్లో స్థానిక పోలీసులు సీజ్ చేశారు. అయితే శుక్రవారం అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ స్టోన్‌ను టిప్పర్లకు నింపి చెన్నైకు తరలిస్తున్నారనే సమాచరంతో దాడులు చేసి సదరు వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సంతపేట పోలీసు స్టేషన్ పరి ధిలో ఉన్న బుజ్జమ్మ రేవు ప్రాం తంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వ హించారు. స్పెషల్ పార్టీలతో కలిసి నగర డీఎస్పీ సింధు ప్రియ, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్‌ఐలు, సుమారు 50 మంది పోలీసులు కలిసి 500 ఇళ్ళు తనిఖీ చేశారు. అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 31 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు ఆకతాయిలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

యువకుడి నిజాయితీకి పోలీసు సత్కారం

పొదలకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నిజాయితీ ని గుర్తించిన పోలీసులు శుక్రవారం అతడిని సత్కరించారు. గత బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మోటారుబైక్ కవర్‌లో ఉంచిన రూ.86వేల నగదు చోరీకి గురైంది. దీంతో బాధితుడైన పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామాని కి చెందిన రామకృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈనేప థ్యంలో పట్టణానికి చెందిన సురేష్ అనే యువకుడు శుక్రవారం తన ఇంటి సమీపంలోని చెత్తకుప్పలో నగదు ఉన్న కవరు దొరికిం దని పోలీసులకు అప్పగించాడు. కవర్‌లో రూ.86వేల నగదుతో పాటు బ్యాంకు పాస్ పుస్తకం, పాన్‌కార్డులు ఉన్నాయి. దొరికిన సొ మ్మును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన యువకుడిని స్థానిక ఎస్‌ఐ షేక్ మహమ్మద్ హనీఫ్ సత్కరించారు. అలాగే వెయ్యి రూపాయలు యు వకుడికి అందజేశారు.

రండయ్యా.. రండి... భలే... ఎండు చేపలండి!



కోవూరు సమీపంలోని లక్ష్మీనగర్ ప్రాంతం



ఏ రకం కావాలన్నా కేరాఫ్ లక్ష్మీనగర్
కొన్నేళ్లుగా ఎన్నో కుటుంబాలకు ఇదే వ్యాపారం

కోవూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యప్రి యులం దరికీ కోవూరు సమీపంలోని లక్ష్మీనగర్ ఎంతో ఇష్టమైన ప్రదేశం. కడప, చిత్తూరు, అనంతపురం జిల్లా ల్లోని మాంసాహారప్రియులు నెల్లూరు వస్తే ఖచితంగా ఈ లక్ష్మీనగర్‌కు చేరుకుంటారు. తమకు ఇష్టమైన ఎండు చేపలను కొనుగోలు చేసుకుని ఇళ్ల తీసుకెళతారు. చాలా ఏళ్ల కిందట విడవలూరు మండలం రామతీర్థం, లక్ష్మీపురం తదితర గ్రా మాలకు చెందిన మత్స్యకారులు కోవూరు-నెల్లూరు మార్గంలోని సాలుచింతల సమీపంలో కాలనీ ఏర్పాటు చేసుకుని ఎండుచేపల వ్యాపారం ప్రారంభించారు. మొదట్లో జిల్లాలోని సముద్ర తీరం వెంబడి మత్స్యకారుల నుంచి చేపలు కొనుగోలు చేసి ఎక్కడికక్కడే ఎండబెట్టి లక్ష్మీనగర్‌కు తీసుకువచ్చి విక్రయించేవారు. అయితే, నెల్లూరు జిల్లా తీరంలో మత్స్య సంపద తగ్గడంతో రకరకాల ఎండు చేపల కోసం విశాఖ మార్కెట్టును ఆశ్రయించారు. అక్కడి నుంచి వ్యాన్లలో సరుకును తీసుకువస్తారు. అయితే, రవాణా భారం ఎక్కువవడంతో వ్యాపారులంతా చేరి గ్రూపులుగా విభజించి, సరుకును దిగుమతి చేసు కోవడంతో వ్యాపారం లాభసాటిగా మారింది. తాటియాకు చేపలు, బొమ్మడాయిలు, రొయ్యపొట్టు, మెత్తా ళ్ళు, చెరువు చేపలు, కంట చుక్కల చేపలకు గిరాకీ ఉంటుంది.



జీవనానికి ఆధారమిదే

ఎండు చేపలు అమ్మడమే మా పని. మా కుటుంబానికి ఆధారమిదే. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండొచ్చినా వానొచ్చినా ఎండు చేపల్ని అమ్ముతుంటాం. కుటుంబాన్ని పోషించుకోగలిగిన ఆదాయమే వస్తోంది.

- కుమారి, ఎండుచేపల విక్రేత



ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ...

మాది పడమట ప్రాంతం. అక్కడ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాం. ఎండు చేపలు అమ్ముతూ బతికేస్తున్నాం. ఇది తప్ప మాకు రెండో పని లేదు. కుటుంబమంతా ఎండు చేపల అమ్మకానికే పని చేస్తుంది. చేపల్ని ఆరబెట్టు కోవాలి. శుభ్రం చేయాల్సి ఉంటుంది.

- చింతంగారి పాపమ్మ,లక్ష్మీనగర్

అబ్బో.. తాటాకు చేప

ఎండు చేపలు కోసం ఇక్కడికి ఎన్నో సంవత్సరాల నుంచి వస్తున్నా. ఎండు చేప తగలందే ముద్ద దిగదు. తాటాకు చేప రుచే వేరు. మా ఇంట్లో లొట్టలేసుకుని తింటారు.

- జీవమ్మ, వెంగళ్రావు నగర్



● **రారాజు తాటియాకు చేప**

ఎండుచేపల్లో రారాజు తాటియాకు చేప. విశాఖ, కాకినాడ ప్రాంతాల నుంచి వ్యాన్లలో తీసుకువచ్చి లక్ష్మీనగర్‌లో విక్రయిస్తుంటారు. కిలో తాటియాకు చేప రూ.250 నుంచి 300, బొమ్మడాయిలు రూ.150, రొయ్యపట్టు రూ.200 నుంచి 250, మెత్తాళ్ళు రూ.300 నుంచి 400, చెరువు చేపలు రూ.150 నుంచి 200, కంట చుక్కలు రూ.100 నుంచి 150 వరకు ధర పలుకుతున్నాయి. విశాఖ నుంచి వ్యాను బాడుగ రూ.15వేల నుంచి 20 వేల వరకు పలుకుతోంది. కాబట్టే ఎండు చేపల ధరలను పెంచాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

● **దూరప్రాంత వ్యాపారులు వస్తేనే ఆదాయం**

లక్ష్మీనగర్‌లోని ఎండు చేపల దుకాణాలకు దూరప్రాంత వ్యాపారులు వస్తేనే ఆదాయం వస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. దూర ప్రాంత వ్యాపారులు ఒక్కో రకాన్ని 100 నుంచి 200 కిలోలు కొనుగోలు చేస్తుంటారని, ఇలా పెద్ద మొత్తంలో చేపలు విక్రయిస్తేనే ఆదాయం వస్తుందని చెప్పారు. ఇక స్థానికులు, జిల్లావాసులు ఒక్కొక్కరు అర కిలో నుంచి కిలో వరకు కొనుగోలు చేస్తారనీ చెప్పారు. వందమంది కొనుగోలుదారులు వస్తే 50 నుంచి 75 కిలోల ఎండుచేపలు మాత్రమే అమ్మగలమని వివరించారు.

జీవితంలో యోగా భాగం కావాలి

● **'యోగాంధ్ర'లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్**

నెల్లూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో రెసిడెన్షియల్ థీమాటిక్ సామూహిక యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని చెప్పా రు. జిల్లాలో ఇప్పటికే 10 లక్షల మంది యోగా మీద మక్కువతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. 124 మంది మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఏడు వేల మందికి గ్రామ, వార్డుస్థాయిల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈనెల 9న గ్రామ, వార్డు స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామ న్నారు. 21వతేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో 2వేల ప్రదేశాల్లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగాసనాలు వేశారు. యోగాలో ఉత్తమంగా రాణిస్తు న్న చిన్నారులను అభినందించారు. స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలకు హాజరయ్యే బాల, బాలికలకు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డీఎస్‌డీవో యతిరాజ్, జిల్లా ఆయుష్ అధికారి గోవిందయ్య, యోగా గురువు స్వప్న, అధికారులు, వాకర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, స్టేడియంలో జరిగిన యోగాసన కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కేఎన్‌ఆర్ పాఠశాల, వెంగళరావునగర్ మునిసిప ల్ ఉన్నత పాఠశాల, సంతపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ ధ్యానం, యోగాలో భాగస్వాములయ్యారు. వారిని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండా ల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, డీ పెంచలయ్య పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, అధికారులు, విద్యార్థులు



'యోగాంధ్ర' అక్షర రూపంలో సాధకులు

● **రేపు సీనియర్ సిటిజన్స్‌కు..**

'యోగాంధ్ర'లో భాగంగా ఆదివారం సీనియర్ సిటిజన్స్‌కు యోగా కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని, వాకర్స్ సంఘాలు అన్నీ హాజరయ్యేలా చూడాలని సూచించారు. 14వతేదీన జిల్లా అంతటా యోగా డెమో కార్యక్రమం చేపట్టాలని, ఇందుకు అవసర మైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

'మాలకొండ' పాలకవర్గం ఎప్పటికో!

● **ఎమ్మెల్యే చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు**

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి పాలకవర్గం నియామకం నేటికీ జరగలేదు. గత నెల కడపలో జరిగిన టీడీపీ మహానాడులోపు నామినేటెడ్ పదవుల నియామకం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా స్థానిక ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉన్న వారినే ఆ పదవులు వరిస్తాయి. ఈ నేపథ్యంలో 'మాలకొండ' చైర్మన్ పదవికి అంకభూపాలపురానికి చెందిన టీడీపీ నేత ప్రగడ నరసింహం, పోలినేనిపాలెంకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చుండికి చెంది న టీడీపీ సీనియర్ నేత చెరువుపల్లి మాల్యాద్రి మాలకొండ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత తొమ్మిదేళ్ల పాలక వర్గం ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవుల నియామకం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో టీడీపీ నేతల్లో ఆశలు చిగురించాయి. మాలకొండ చైర్మన్ పదవి కోసం రెండు నెలల నుంచి ఆశావాహులు కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తునట్లు సమచారం. అయితే, చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

రాజరాజేశ్వరి సేవలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారిని అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డీ మురళీ మోహన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చ కులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మ వారికి సుందరేశ్వర స్వామికి, గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనము అందజేశారు. కాగా, శుక్రవారం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రాహుకాల దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ జరిగాయి.



మురళీమోహన్ దంపతులకు వేదాశీస్సులు అందజేస్తున్న అర్చకులు

డీఆర్‌డీఏలో బది'లీలలు'

● **స్వాహారాయుళ్లపై ప్రత్యేక దృష్టి !**

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ (డీఆర్‌డీఏ)లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబం ధ నలకు విరుద్ధంగా ఈ బదిలీలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ నెల 2వతేదీ వరకే బదిలీలకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆ తర్వాత 9వ తేదీ వరకు దానిని పొడిగించిన విషయం విదితమే. ఒకే స్థానంలో ఐదేళ్లగా పని చేస్తున్నవారు, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటు న్నవారు, ఒకే జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారు, వ్యక్తిగత అభ్యర్థనతో ఇష్టపూర్వకంగా బదిలీ కోరుకున్నవారు మాత్రమే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలకు అర్హులు. అయితే ఇందుకు భిన్నంగా డీఆర్‌డీఏ లో ఎల్-4 కేడర్‌లో క్రమశిక్షణ చర్యలు తీసుకు న్న వారిని, దీర్ఘకాలికంగా జిల్లాలో పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి బదిలీలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఏ రకమైన క్రమశిక్షణా చర్యలు లేనివారిని, స్పౌజ్‌కి అర్హత ఉన్నవారిని బలవంతపు బదిలీ చేస్తున్నట్లు సమాచారం. ఆ శాఖలో ఎల్-3 కేడర్ బదిలీలు కూడా ఇదే విధంగా కొనసాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్-3 కేడర్‌లో దీర్ఘకాలంగా పని చేస్తున్న వారిని పక్కన పెట్టి అర్హత లేని వారిని బలవంతంగా బదిలీ చేస్తున్నట్లు సమాచారం. కాగా, డీఆర్‌డీఏలో దీర్ఘకాలం పనిచేసి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న వారు ఎందరో ఉన్నారు. వారి జాబితాను అధికారులు పరిశీలించారు. పని తీరు, ఆరోప ణల నివేదికలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు పంపారు. పొదుపు మహిళల నగదును స్వాహా చేసిన ఆరోపణ లతో సస్పెండయిన కేసులు డీఆర్‌డీఏ లో ఎన్నో ఉన్నాయి. కొందరు డీపీఎం, ఏపీఎం స్థాయి వారు స్వాహాకు, అక్రమాలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. రాజకీయ పలు కుబడితో తిష్టవేసుకుని ఒకే స్థానంలో సుదీర్ఘకా లం సీటు మారకుండా పనిచేస్తున్నవారు కూడా ఉన్నారు. బదిలీల సందర్భంగా వీరిపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిసింది.



డీఆర్‌డీఏ కార్యాలయం

విలువలతో కూడిన విద్య ఉపయోగకరం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్య త్తుకు ఎంతో ఉపయోగపడు తుందని ఎస్పీ జీ కృష్ణకాంత్ అన్నారు. ఉమేష్‌చంద్ర కాన్ఫ రెన్స్ హాల్లో శుక్రవా రం పోలీసుల పిల్లల కు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన పోలీ సుల పిల్లలు 111 మందికి 11 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత, రాయితీ అడ్మిషన్స్ కల్పించినట్లు చెప్పారు. క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి వెళ్లాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉచిత అడ్మిషన్స్ అందించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏవో చంద్రమౌళి, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ రాజారావు, అడ్మిన్ ఆర్‌ఐ అంకమరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్